ఆదివారం
03 ఫిబ్రవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 315

www.vijayakranthinews.com

విజయక్రాంతి

సచిత్ర సకుటుంబ దినపత్రిక

హైదరాబాద్ | CIRCULATED IN TELANGANA STATE | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



కోపమా నాపైన! 10

నా దేశ సోదర, సోదరీమణులకు

పౌరసత్వం ఇవ్వాల్సిందే..



- కాపలాదారుడిని ఇష్టపడని అవినీతిపరులు
- మార్పు కోరుకుంటున్న బెంగాల్ ప్రజలు
- తప్పు చేయనప్పుడు మమత ఎందుకు భయపడాలి ?
- కోల్‌కతాలో ప్రధాని మోదీ

విజయక్రాంతి, కోల్‌కతా: 'బీజేపీ అంటే దీదీ భయపడుతున్నారు. పార్టీ అధ్యక్షుడు వస్తున్నారంటే వణికిపోతున్నారు. ఏ తప్పూ చేయని వారైతే.. మమత ఎందుకు భయపడుతున్నారు.' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశ్నించారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా పశ్చిమబెంగాల్ పర్యటనకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా చేసిన అంశాన్ని గుర్తు చేస్తూ ఆయన పై విధంగా వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో దేశవ్యాప్తంగా బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా పశ్చిమబెంగాల్‌లోని ఠాకూర్‌నగర్, (తరువాయి 4లో)

ముందు మీ సీట్లు చూసుకోండి

- బెంగాల్‌లో మీ గెలుపు కలే
- మోదీ, రాజ్‌నాథ్‌కు మమత సవాల్

విజయక్రాంతి, కోల్‌కతా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి రాజ్‌నాథ్‌కు సింగ్‌కు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సవాల్ విసిరారు. ముందు మీ సొంత సీట్లలో గెలుచుకోవడంపై దృష్టి పెట్టుకోండని అని హితవు పలికారు. బెంగాల్‌లో శనివారం నిర్వహించిన రెండు సభల్లో పాల్గొన్న మోదీ.. సీఎం మమతా బెనర్జీని టార్గెట్‌గా తీసుకొని విమర్శించిన సంగతి తెలిసిందే. మోదీ విమర్శలకు ప్రతిగా మమతా సవాల్ విసిరారు. వారణాసిలో మళ్లీ మోదీ గెలువగలరా.? చూసుకోండని సవాల్ విసిరారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ ముందు ఉత్తరప్రదేశ్‌ను చూసుకో అంటూ వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్ ప్రజలు తమ రాష్ట్రాన్ని చూసుకోగలరని, వెలుపలి నుంచి వచ్చే వారు అవసరం లేదంటూ వ్యాఖ్యానించారు. బెంగాల్ బీజేపీ గెలుపు కలే అని స్పష్టం చేశారు.



భట్టి ముందే

బాహాబాహీ..

- గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నేతల గలాట
- వీహెచ్ అనుచరులు వర్సస్ శ్రీకాంత్ వర్గీయుల ఫైటింగ్
- సీఎల్పీ నేత సమక్షంలో ఘర్షణ



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ కార్యాలయం గాంధీభవన్ లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. అంబర్ పేటకు చెందిన మాజీ ఎంపీ వి. హన్మంత రావు, టీపీసీసీ ఓబీసీ సెల్ నగర అధ్యక్షుడు శ్రీకాంత్ వర్గీయులు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. దీంతో గాంధీ వన్ రణరంగంగా మారింది. ఇటీవల కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా నియమితులైన భట్టి విక్రమార్కకు గాంధీభవన్ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయితే ఈ కార్యక్రమానికి హాజరైన అంబర్‌పేట నియోజకవర్గ సీనియర్ నేత వి. హన్మంతరావును శ్రీకాంత్ అనచరులు అడ్డుకున్నారు. శ్రీకాంత్ కు టికెట్ రాకుండా వీహెచ్ అడ్డుకున్నారంటూ ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. దీంతో వీహెచ్ వర్గీయులు వారిని అడ్డుకోడానికి ప్రయత్నించారు. దీంతో ఇరువర్గీయుల మధ్య ఘర్షణ చెలరేగి ఒకరిపై ఒకరు కుర్చీలను విసురుకున్నారు. బిసిలకు వీహెచ్ అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ శ్రీకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అతడిపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ సీఎల్పీ లీడర్ భట్టి చాంబర్ ముందు శ్రీకాంత్ తన అనుచరులతో (తరువాయి 4లో)

కరసేవలకులపై

నరమేధం?

- అయోధ్యలో జలియన్‌వాలా బాగ్ తరహా ఘటన
- 1990 కాల్పుల ఘటనపై వెలుగులోకి వాస్తవాలు
- సామూహిక ఖననం చేసినట్లు మాజీ పోలీస్ అధికారి వెల్లడి
- నాటి మూలాయం సింగ్ ప్రభుత్వం తీరుపై విమర్శలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో 1990లో జరిగిన కాల్పుల ఘటనపై సంచలన విషయాలు వెలుగు చూసినట్లు రిపబ్లిక్ టీవీ పేర్కొంది. ఆ ఛానల్ నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్ అంశాలను శనివారం ప్రసారం చేసింది. అయోధ్యలో నాడు జరిగింది కరసేవలకులపై కాల్పులు కాదని, జలియన్‌వాలాబాగ్ తరహా నరమేధంగా అభివర్ణించింది. నాడు అధికారంలో ఉన్న మూలాయం సింగ్ ప్రభుత్వం వాస్తవాలను కప్పిపుచ్చినట్లు ఓ మాజీ పోలీస్ అధికారి వెల్లడించారు. పోలీస్ కాల్పుల్లో చాలా మంది కరసేవలకు మృతిచెందారని, రామ భక్తులైన వారిని హిందూ సంప్రదాయ ప్రకారం దహనం చేయకపోగా సామూహికంగా ఖననం చేసినట్లు నాడు రామజన్మభూమి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన వీబీ సింగ్ స్టింగ్ ఆపరేషన్‌లో పేర్కొన్నారు. అవి కరసేవలకుల మృతదేహాలు కావని బాధిత బంధువులను పోలీసులు తప్పుదారి పట్టించినట్లు ఆయన తెలిపారు. నాటి ములాయం సింగ్ ప్రభుత్వంలో జరిగిన ఈ నరమేధం వెనక పలువురు పోలీస్ అధికారుల పాత్ర ఉందని ఆయన ఆరోపించారు.

రామ మందిరంపై..

రాహుల్ మాటేమిటి?

- నిర్మించాలా.. వద్దా? ఏదో ఒకటి చెప్పండి
- కాంగ్రెస్‌ను ప్రశ్నించిన అమిత్ షా
- కేంద్రం స్పందించకపోతే మేమే కడతామన్న ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్
- నాలుగు నెలల్లో పనులు మొదలవుతాయని మోహన్ భగవత్ స్పష్టం
- ఈ నెల 21నే శ్రీకారం చుడతామని స్వామి స్వరూపానంద సరస్వతి అల్టిమేటమ్
- ఎన్నికల వేళ కేంద్రంపై పెరుగుతున్న ఒత్తిడి
- బడ్జెట్ సమావేశాల తర్వాత కీలక నిర్ణయం తీసుకునే అవకాశం

డెహ్రాడూన్: రామ మందిరంపై రాహుల్ గాంధీ మాట ఏమిటని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ప్రశ్నించారు. శనివారం ఆయన ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లోని త్రిశక్తి సమ్మేళనంలో పాల్గొన్నారు. తెహ్రీ, హరిద్వార్ లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన జిల్లా, బూత్ స్థాయి కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. అయోధ్యలో రామాలయం నిర్మాణంపై కాంగ్రెస్ వైఖరిని స్పష్టం చేయాలని అమిత్ షా డిమాండ్ చేశారు. బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయోధ్య రామ జన్మభూమిలోని వివాద రహిత భూమి సుమారు 42 ఎకరాలు ఉందన్నారు. దీనిని అసలు యజమానులైన రామ జన్మభూమి న్యాస్, తదితరులకు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలనుకుంటోందని అయితే దీనిపై కాంగ్రెస్ గందరగోళం సృష్టిస్తోందని ఆయన మండిపడ్డారు. రామాలయాన్ని నిర్మించాలా? వద్దా? ఏదో ఒకటి చెప్పండి అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని అమిత్ షా కోరారు. కాంగ్రెస్ పార్టీ అభిప్రాయమేంటో తెలపాలని డిమాండ్ చేశారు. అక్కడ మందిర నిర్మాణం జరుగుతుందని, ఏ అనుమానం లేకుండా ప్రకటిస్తున్నానని అమిత్ షా స్పష్టం చేశారు.

రాహుల్ గాంధీ గారూ..
ఎందుకంత సీరియస్‌గా ఉన్నారు..

లోక్‌సభలో శుక్రవారం మధ్యంతర బడ్జెట్‌ను ఇన్‌చార్జ్ ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన సందర్భంలో కాంగ్రెస్ (తరువాయి 4లో)



పదవుల పందేరంపై

సీఎం కసరత్తు

- ఎమ్మెల్సీ ఎంపికపై దృష్టి
- కార్పొరేషన్లకు కొత్త చైర్మన్లు
- మూడోవారంలో శాసన సభ సమావేశాలు

విజయక్రాంతి, హైదరాబాద్: శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ రంగ సంస్థల లో నామినేటెడ్ పదవుల భర్తీ పై ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర రావు కసరత్తులు చేస్తున్నారు. మంత్రివర్గంలో ఎవరెవరికి స్థానం కల్పించాలన్న దానిపై ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చిన ఆయన నియమిత పదవుల ఎంపిక పై దృష్టి సారించారు.మార్చి నెలాఖరు నాటికి 12 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగాలి. వీటి భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ వస్తోంది.వీటిలో శాసనసభ్యుల కోటా నుంచి ఐదు,ఉపాధ్యాయుల నియోజకవర్గాల నుంచి మూడు,అనర్హత పొందిన వారు ముగ్గురు, స్థానిక సంస్థల కోటానుంచి ఒకటి, గవర్నర్ కోటా నుంచి ఒకటి కాగా రాజీనామా చేసి సభ్యుడి తో కలిపి మొత్తం 16 ఖాళీలు అవుతున్నాయి. శాసన సభ్యుల కోటా, గవర్నర్ కోటా ను పక్కన పెడితే మిగిలిన స్థానాలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.శాసనసభ్యుల కోటా నుంచి ఖాళి అవుతున్న ఐదు స్థానాలలో సంఖ్యా బలం రీత్యా నాలుగు స్థానాలు కచ్చితంగా వస్తాయని,మిగిలిన స్థానం కోసం కూడా ప్రయత్నం చేయవచ్చుని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.శాసన సభ్యులుగా పోటీ చెయ్యడానికి అవకాశం రానివారికి మండలిలో అవకాశం కల్పిస్తామని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి పలువురికి హామీ ఇచ్చారు.అదేవిధంగా ఎన్నికలలో బాగా పనిచేసిన కొంతమంది నాయుకులుకూడా మండలి లో సభ్యత్వం ఇచ్చే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నారని, దానితో పాటు ఎన్నికల ముందు పార్టీలో చేరిన మాజీ స్పీకర్ సురేష్ రెడ్డి, ఎన్నికలలో ఓటమి చెందిన మాజీ సభాపతిమధుసూదనా చారి,రాష్ట్రమాజీ మంత్రి తుమ్మల. నాగేశ్వర రావు తదితరులు కూడా మండలి స్థానం ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.పార్టీ నాయకులకు చెందిన మొత్తం సమాచారాన్ని తెప్పించుకుని వారు పార్టీకి చేసిన సేవ ఎన్నికలలో పని తీరును పరిశీలిస్తున్నారు. మండలిలో అవకాశం రానివారికి కార్పొరేషన్ చైర్మన్లు గా అవకాశం కల్పించటానికి ముఖ్యమంత్రి కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.ఎన్నికలకు కొద్ది రోజులు ముందు నియమించిన తొమ్మిది మంది చైర్మన్ లు మినహా మిగతావారిని తప్పించి కొత్తగా చైర్మన్లను నియమించాలని ముఖ్యమంత్రి యోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు అభిప్రాయం పడుతున్నారు.ప్రస్తుతం చైర్మన్ లుగా కొనసాగుతున్న కొంతమంది పనితీరు నచ్చకపోవటం తో అందరిని తొలగించి కొత్తగా నియామకాలు చేయాలని, అదేవిధంగా (తరువాయి 4లో)

నేడు యాదాద్రికి కేసీఆర్

విజయక్రాంతి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కే.చెంద్రశేఖర రావు ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటనకు వెళుతున్నారు. యాదగిరిగుట్ట లక్ష్మి నృసింహ స్వామి దేవస్థానం పుననిర్మాణ పనులను స్వయంగా పర్యవేక్షిస్తారు. సుమారు వంద కోట్ల రూపాయల వ్యయంతో యాదగిరిగుట్ట ను అభివృద్ధి చ్చేస్తున్న విషయం తెలిసిందే.ఈ అభివృద్ధి పనులు చాలా వరకు పూర్తి అయ్యాయి. ఆలయాన్ని పునర్నినిర్మించటం తో పాటు యాగశాల, యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు,కాటేజీలు నిర్మాణం వంటి పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ అభివృద్ధి పనులు అన్నింటిని స్వయంగా పరిశీలించి దేవస్థానం అధికారులు తో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.ముఖ్యమంత్రి వెంట దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆర్థిక శాఖ అధికారులు వెళ్లే అవకాశం ఉంది.



సీబీఐ కొత్త చీఫ్

రిషి కుమార్ శుక్లా

- ప్రధాని నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఎంపిక
- అభ్యంతరం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నేత ఖర్గే

4



ఒక మోదీ... ముగ్గురు మహిళలు







- సవాల్ విసురుతున్న ముగ్గురు మహిళామణులు
- మమతా, మాయాలు ఒకవైపు ప్రియాంక మరోవైపు
- ఆ ముగ్గురితోనే మోదీ ఢీ

ఢిల్లీ: చావోరేవో తేల్చుకోవాల్సిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల బరిలో ముగ్గురు మహిళలను ఎదుర్కోనున్నారు. జాతీయ స్థాయిలో ఇప్పటివరకు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ వంటి నేతలతో పోటీ పడిన మోదీ... వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బలమైన ముగ్గురు మహిళా నేతలను ఢీకొననున్నారు. పశ్చిమ బంగ సీఎం మమతా బెనర్జీ, యూపీ మాజీ సీఎం, బీఎస్పీ అధినేత్రి మాయావతి, ప్రియాంక గాంధీలు ఎన్నికల రంగంలో మోదీకి సవాలు విసురుతున్నారు.

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ స్థాయిలో బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలను ఒక్కతాటిపైకి తీసుకురావడంలో మమతా బెనర్జీ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. (తరువాయి 4లో)



శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః

శ్రీ వికంబి నామ సంవత్సరం
ఉత్తరాయణం
హేమంత ఋతువు
పుష్య మాసం


సూర్యోదయం	: ఉ. 06:47
సూర్యాస్తమయం	: సా. 06:12
పక్షము	: కృష్ణ పక్షం
తిథి	: చతుర్దశి 23:52
నక్షత్రం	: ఉత్తరాషాఢ 26:55
యోగం	: వజ్ర 07:05
కరణం	: విష్టి 10:34 శకుని 23:52
రాహుకాలం	: సా. 04:43, 06:08
యమగండం	: మ. 12:29, 01:54
వర్జ్యం	: ఉ. 08:55, 10:43
అమృతకాలం	: సా. 07:43, 09:31



సూక్తి సుధ

వ్యక్తిత్వాన్ని లేదా శీలాన్ని నిర్మించుకోండి.
అప్పడే మీరు మీ జీవితాన్ని రూపుదిద్దుకోగలరు.

-స్వామి శివానంద





మహాపాపహరుడు కాశీవిశ్వనాథుడు

కాశిలో.. చేయవలసినవి.. చూడవలసినవి..!

వారాణసి హిందువులందరికి పరమ పావన క్షేత్రం. ప్రతి యేటా లక్షమంది పైగా యాత్రికులు ఇక్కడికి వచ్చి గంగాస్నానం ఆచరించి, దైవ దర్శనం చేసుకుని పునీతులు అవుతుంటారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో కాశీ విశ్వేశ్వర లింగం ఒకటి. అంతేకాక గంగా స్నానం సర్వాకాల సర్వ్యావస్థలో ఎప్పడు ఆచరించిన సకల పాపాలు పరిహారమై ముక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఇద్దరమ్మలయిన అన్నపూర్ణ, గంగమ్మలతో కొలువుదీరిన ఏకైక శైవక్షేత్రం కాశీక్షేత్రం. జీవనానికి కావల్సిన ఆహారాన్ని అందించే తల్లిగా అన్నపూర్ణా దేవి, జీవనానంతరం పుణ్యలోకాల ప్రాప్తినిచ్చే తల్లిగా గంగమ్మ, ఈ రెంటి నడుమ జీవితంలో మానవునికి కనువిప్ప కలిగించే దృశ్యాలయిన శవ దహనం. ఆ దహనంతో వచ్చే భస్మంతో భస్మాభిషేకం చేయించుకునే విశ్వేశ్వరుడు..



కాశీలో ప్రవేశించగానే ముందుగా.. కాశీ విశ్వేశ్వరుని తలచుకుంటూ కాశీ నేలని తాకి నమస్కరించుకోవాలి. బస చేరుకున్న తరువాత ముందుగా.. గంగా దర్శనం.. గంగా స్నానం.

కాలభైరవుని దర్శనం. కాలభైరవుని గుడి వెనకాల దండపాణి గుడి దర్శనం, డుంఠి గణపతి దర్శనం

కాశీ విశ్వేశ్వరుని దర్శనం:- (4.00am – 7.30pm స్పర్శ దర్శనం) భక్తుల సంఖ్య రిత్యా ఇది మారుతుంటుంది.

శ్రీచక్ర లింగ దర్శనం:- భాస్కరాచార్య ప్రతిష్ఠిత శ్రీచక్ర లింగం(అన్నపూర్ణ దేవాలయ ప్రవేశ ద్వారం వద్ద కుడివైపు ఉంటుంది).

కాశీ విశాలాక్షి దర్శనం: – ఈ గుడి ఉదయం 8.00am వరకే తెరిచి ఉంటుంది. లలిత ఘాట్ మర్గం నుండి వెళ్ళవచ్చు. వారాహి మాత – ఈ గుడి విశాలాక్షి మాత గుడి వెనుకగా అడ్డ దారి ఉంది. ఇది చాలా దగ్గర దారి.

మణికర్ణికా ఘట్టంలో స్నానం:-

మన ఊరు-మనగుడి

(వీలైతే మధ్యాహ్నం 12.00 గంటలకి)

గంగా హారతి:-




దశాశ్వమేధ్ ఘాట్ (అస్సి ఘాట్ వద్ద కూడా గంగా హారతి ఇస్తారు).

కేదార్ఘాట్ వద్ద కేదారేశ్వరుని దర్శనం, చింతామణి గణపతి దర్శనం, అస్సి ఘాట్ వద్ద ఉన్న లోలార్క కుండంలో స్నానం లేక ప్రోక్షణ. లోలార్కఈశ్వరుని దర్శనం, దుర్గా మందిరం, గవ్వలమ్మ గుడి, తులసీ మానస మందిరం, సంకట మోచన హనుమాన్ మందిరం. తులసీ దాసుకు ఆంజనేయ స్వామి దర్శనం అయిన స్థలం. తిలాభాండేశ్వర దర్శనం.

వీలైతే సారనాథ్ స్థూపం బుద్ధ మందిరం – ఈ మందిరం కొంత దూరంగా ఉంటుంది. ప్రత్యేకంగా వెళ్ళాలి. ఈ మర్గంలో బట్టల షాపింగ్ సెంటర్ ఉంది.

గంగా నదీ ఘట్టాల దర్శనం:-



అస్సిఘాట్ నుండి మొదలు పెడితే వరుణ నదీ సంగమం వద్ద ఉన్న ఆదికేశవ్ మందిరం వరకు వెళ్ళవచ్చు.

ఆదికేశవ స్వామి దర్శనం:-



ఇదే విష్ణు మూర్తి ప్రథమంగా భూమిపై అవతరించిన చోటు. గుడిలోకి వెళ్ళి వస్తామని బోటు అతనితో ముందే మాట్లాడుకోకపోతే దూరం నుంచే చూపించి బోటు వెనక్కి తిప్పుతారు.

బిందు మాధవుని గుడి:- ఇది పంచగంగఘాట్ వద్ద ఉన్న ఔరంగజేబు కోటకి దగ్గరలో ఉంది.

ఓంకాళేశ్వర దర్శనం:-

మెయిన్ రోడ్ నుండి కాల భైరవ స్వామి గుడి వైపు కాక, ఎడమ వైపు రోడ్ గుండా వెళ్ళాలి. రిక్షా అయితే మంచిది. ఇవి రెండు మందిరాలు. ఉకారేశ్వరుడు, మకారేశ్వరుడు చిన్నగా ఉంటాయి. ఇవి రెండూ కూడా స్వయంభూ లింగాలు.

కృత్తివాసేశ్వర లింగం:-



ఓంకాళేశ్వర స్వామి దర్శనం తర్వాత కొంచెం ముందుకు వెళ్ళితే కృత్తివాసేశ్వర లింగం. ఇది అన్ని కాలలలోను చల్లగా ఉంటుంది.

స్వయంభూ లింగం:-

కృత్తివాసేశ్వర లింగం దర్శనం అయినా తరువాత ఇంకా కొంచెం ముందుకు వెళ్ళితే మహా మృత్యుంజయలింగం దర్శించుకోవాలి. ఆసియాలో అతి పెద్ద రెసిడెన్షియల్ విశ్వవిద్యాలయమైన బనారస్ హిందూ విశ్వవిద్యాలయం + అక్కడి నూతన విశ్వనాథ, దుర్గా లక్ష్మి నారాయణ గుడి సముదాయం.

వారాణసిలో కొన్ని ముఖ్యమైన శివ లింగాలు.. స్థలాలు..

విశ్వేశ్వరుడు గంగానది ఒడ్డున దశాశ్వమేధ ఘాట్ వద్ద మంగళేశ్వరుడు శంక్తా ఘాట్ ఆత్మ విశ్వేశ్వరుడు శంక్తా ఘాట్, కుక్కుటేశ్వరుడు దుర్గా కుండ్, త్రి పరమేశ్వరుడు దుర్గా కుండ్ కాల మాధవుడు కథ్ కీ హవేలీ, ప్రయాగేశ్వరుడు దశాశ్వమేధ ఘాట్, అంగారకేశ్వరుడు గణేష్ ఘాట్, అంగనేశ్వరుడు గణేష్ ఘాట్, ఉపస్థానేశ్వరుడు గణేష్ ఘాట్, పరమేశ్వరుడు శంక్తా ఘాట్,హరిశ్చంద్రేశ్వరుడు శంక్తా జీ, వశిష్టేశ్వరుడు శంక్తా జీ, కేదారేశ్వరుడు కేదార్ ఘాట్, నీల కంఠేశ్వరుడు నీల కంఠా, ఓంకారేశ్వరుడు చిట్టన్ పురా, కాశేశ్వరుడు త్రిలోచన్, శ్రీ మహా మృత్యుంజయుడు మైదాగిన్, శుక్రేశ్వరుడు కాళికా గలీ, వారాణసిని ఇతిహాస పురాణాలలో అవిముక్తక.. ఆనందకాతనన.. మహాస్మశాన.. సురధాన.. బ్రహ్మావర్ధ.. సుదర్శన.. రమ్య.. కాశి..అనే వివిధ నామాలతో ప్రస్తావించారు. ఋగ్వేదంలో ఈ నగరాన్ని 'కాశి', 'జ్యోతి స్థానం' అని ప్రస్తావించారు.

స్కాంద పురాణంలోని కాశీఖండంలో 'కాశీ నగర' మహత్త్య వర్ణన

ఒక శ్లోకంలో శివుడు ఇలా అన్నాడు. ముల్లోకాలు నాకు నివాసమే. అందులో కాశీ క్షేత్రం నా మందిరం. గంగా హారతి. గంగామాతకు నదీతీర క్షేత్రాలలో నిర్వహించే ఈ హారతి పవిత్ర కాశీలో కూడా ఘనంగా ప్రతిరోజూ నిర్వహిస్తుంటారు. ఈ హారతి దృశ్యాలను ప్రతిరోజూ వేలాది మంది తిలకిస్తుంటారు. వీరిలో విదేశీయులు అధికంగా ఉండడం ఒక ప్రత్యేకత. ఈ హారతులను దశాశ్వమేధ్ ఘాటులో నిర్వహిస్తారు. కనుక యాత్రికులు దశాశ్వమేధ ఘాటుకు చేరుకోవడం అవసరం. అయోధ్య, మథుర, గయ, కాశి, అవంతిక, కంచి, ద్వారక నగరాలను సప్తముక్తి పురాలని హిందువుల విశ్వాసం. 'కాశి, కాంచి, మాయ, ఆయోధ్య, ఆవంతిక, మథుర, ద్వారవతి'లు సప్త మోక్షపురులు గా పేర్కొనబడ్డాయి. కాశి, ఆయోధ్య, మథుర మోక్ష క్షేత్రాలు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నాయి. ద్వారవతి(ద్వారక) మోక్షపురి గుజరాత్ రాష్ట్రంలోనూ, మాయ(హరిద్వార్) మోక్షపురి ఉత్తరాఖండ్ లేక ఉత్తరాంచల్ రాష్ట్రంలోనూ, ఆవంతిక (ఉజ్జయిని)మోక్షపురి మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోనూ, కంచి మోక్షపురి తమిళ నాడు రాష్ట్రంలోనూ ఉన్నాయి.కాశి, మాయ, ఆయోధ్య, ఆవంతిక, మథుర, ద్వారవతి మోక్షపురులు ఉత్తర భారతదేశంలో ఉన్నాయి. కాంచి మోక్షపురి దక్షిణ భారతదేశంలో ఉంది. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక మోక్షపురి కాంచీపురం.

– శ్రీరామ్, హైదరాబాద్.

చండాలుడు అని ఎవరెవరిని అంటారు..?



చాణక్యం

శ్లో౹౹ తైలాంభ్యంగే చితా ధూమే మైథునే క్షౌరకర్మణి।
తావద్భవతి చాండాలో యానత్స్నానం న చాఽఽచరేత్౹౹

తలంటు స్నానం చేయడానికి నలుగు పెట్టిన శరీరం గలవాడు, స్మశానంలో శవదహన సమయాన పొగ వ్యాపించిన శరీరం గలవాడు, సంభోగం చేసిన వాడు, క్షౌరం చేయిచుకొన్నవాడు, స్నానం చేయనంతవరకు చండాలుడుగానే వ్యవహరించబడతాడని చాణుక్యుల వారు తమ నీతిశాస్త్రంలో తెలియచేస్తున్నారు. మనుష్యుడు శుద్ధి గురించి పై శ్లోకంలో తెలియచేస్తున్నారు. ఇక్కడ సందర్భం పూర్తిగా శుద్ధి కలగకుండా ఉండేవారిని గురించి తెలియచేస్తూ మనం కనీసం రెండు రోజులకోసారిగాని, ఇప్పటి కాలం ప్రకారం వారం రోజులకోసారిగాని స్నానం ఆచరిస్తుంటాం. ఒకోసారి వారం రోజులు కాకుండా నెలవరకైనా పట్టవచ్చు. ఎందుకంటే ఇప్పుడు నీటి ఎద్దడి కారణంగా ఈ పరిస్థితి ఏర్పడవచ్చు. రోజువారి స్నానం అంటే సబ్బుతో రుద్దుకుని రెండు చెంబులు నీళ్లు పోసుకుని తెమిలిపోతుంటాం. కానీ వారానికో, నెలకో చేసే స్నానాన్ని అభ్యంగన స్నానమంటాం. అప్పుడు తలంటు పోసుకోవడం, లేదా నలుగు పెట్టి అంటే శరీరమంతటా నువ్వుల నూనె పట్టించి తదుపరి సున్నిపిండి లేదా పెసరపిండిని పట్టించుకుని ఆరిన తర్వాత నలుగుపెట్టడం ద్వారా శరీరానికున్న మురికి అంతా పోయి దేహం కాంతిమంతం అవుతుంది. ఇక్కడ నలుగుపెట్టినంత మాత్రాన శరీరం శుభ్రపడదు. అలాగే స్మశానానికి వెళ్లిన సందర్భంలో శరీరానికి శవదహనమప్పుడు వెలువడే పొగ పట్టినప్పుడు, స్త్రీని సంభోగించిన వాడు, క్షవరం చేసుకున్నవాడు పూర్తిగా శుద్ధి చేసుకోకుండా ఉన్నవాడు చండాలుడుగానే పరిగణించాలంటున్నారు. పూర్తిగా తలస్నానం చేసి శుభ్రంగా ఉన్నవాడినే శుద్ధిగలవాడని ప్రస్తావిస్తున్నారు.

– యామిజాల సుబ్రహ్మణ్యం



త్రిపురసుందరి దేవి

త్రిగుణాత్మక స్వరూపిణి

నా సంకల్పం నీవే. నాకు ప్రాణవాయువును ఇచ్చి నా భావ ప్రకటనలతో నన్ను వికసింపజేసినందుకు 'హృదయస్థా'గా నన్ను పరిపాలిస్తున్నందుకు నీకు ఋణపడి ఉంటాను. నీ భక్తి పారవశ్యంలో అవకాశాల ప్రయత్నాలను ఊపిరిలా పీలుస్తూ, మోక్షాన్ని సైతం కాదనగల స్థితికి నన్ను తీసుకొని వెళ్ళావు. నా ఉనికిని నీ పాదపీఠం మీద హృదయకమలంగా అర్పించేలా అనుగ్రహించు. వరాభీష్టములనివ్వు. రాజ రాజేశ్వరివై, భువనేశ్వరివై, శ్రీమహాలక్ష్మివై, బాలత్రిపుర సుందరివై, శరీర దోష, జాతకదోష, జన్మ గ్రహ దోషాలను, కన్నీళ్ళను, కష్టాలను నిశ్శేషంగా నిర్మూలించు. తులసీదళంతో రుక్మిణీదేవి శ్రీకృష్ణుడిని గెలిచినట్లుగా భక్తి, ప్రేమతో నా భర్త హృదయాన్ని గెలిచే దీవెనలు ఇవ్వు. ఆ త్రిపుర సుందరీదేవి అనంతకోటి సూర్యకిరణాల ఉజ్వల ప్రకాశాన్ని, అగ్ని తేజస్సుని, చంద్రుని చల్లదనాన్ని మేళవించి ఆశీర్వదించింది. ఈ అక్షరాలు ఆ అమ్మ అనుగ్రహమే! నా భావ ప్రకటనలు హంసినీ రూపిణిగా మనోవాక్కాయకర్మగా విధిపూర్వక ప్రదక్షణం గావించి నీతో మమైక్యం కాగలిగిన ఈ ప్రయత్నానికి జన్మజన్మలూ ఋణపడి ఉంటాను. ఈ యోగ్యత ఇచ్చినందుకు సదా నీకు దాసినిని. నేను నీ దాన్ని. నీతో స్నేహం చేయాలని ఉవ్విళ్ళూరుతున్న దానిని. అరవై ఏళ్ళు దాటిన బాలగా నిన్ను వెతుక్కునే ప్రయత్నమే ఒక ఆటగా ఆనందిస్తున్నాను. మరి, అన్ని అడ్డంకులనూ నా చేయి పట్టుకొని దాటించు.

జీవిత రహస్యాలలోని వేదాంత సారాన్ని నాతో ఔపాసన పట్టించి, నా జీవితంలోని ప్రతి అడుగూ నీవు వేయించినదే కావాలి. నా ప్రతి ఊపిరి నీ అనుగ్రహమే. శ్రీచక్రనవావరణలో అతిరహస్యంగా దాక్కొని ఉన్న నీవు నన్ను కరుణించి 'ఆటలో అరటిపండు' లాగా నాకు కనిపించు. మిత్ర ధర్మాన్ని ప్రకటించు. త్రిపుర ధర్మంగా (త్రికోణ ధర్మంగా) రహస్యమైన ఓ పరాదేవతా! మన ఏక స్వరూపమే ఆనంద, అద్భుత, సందర్భమని నిరూపించు. స్నేహానురాగాలతో నువ్వు నా పక్కన ఉంటే చాలు. ఇంతటి అనుగ్రహాన్ని నా మీద వర్షించినందుకు కృతజ్ఞురాలిని.



–సి. విజయలక్ష్మీ రాజం


గ్రహం అనుగ్రహం



మేషం

కుటుంబ సభ్యులు జీవితంలో ఇంకా స్థిర పడలేదని కొంత విచారం కలుగుతుంది. భగవంతుడి అనుగ్రహం చేత త్వరలో స్థిరపడి పోతారు. నూతన గృహప్రవేశ కలలు త్వరలోనే సాకారం అవతాయి. దంపతుల మధ్య ఉన్న మనస్పర్ధలను పరిష్కరించుకోవడం మంచిది. వ్యక్తిగత జీవనంలో కొంత చెడు దృష్టులు మిమ్మల్ని ఇబ్బంది పెట్టె అవకాశం వున్నది. ఆధ్యాత్మిక జీవనంలో సంతోషాలు పెరుగుతాయి. పలు శుభకార్యాల్లో పాల్గొంటారు. ఖర్చులు పెరిగే సూచనలు వున్నాయి.


పరిహారం: పార్వతి అమ్మవారిని దర్శనం చేసుకోండి.



వృషభం

ముఖ్య విషయాల పట్ల మీ మనసును సిద్ధం చేసుకోవాలి. కుటుంబ సభ్యులతో వాద్వివాదాలు తప్పకపోవచ్చు. కొన్ని ముఖ్యమైన అవకాశాలు వస్తాయి. సద్వినియోగం చేసుకోండి. స్త్రీల పట్ల జాగ్రత్తగా వ్యవహరించండి. స్వల్పమైన కడుపు నొప్పులు బాధిస్తాయి. విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రయత్నకార్యాలు సులభంగా పూర్తి అవుతాయి. కుటుంబపరంగా తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.

పరిహారం: విష్ణు సహస్రనామం పారాయణ చేయండి.



మిథునం

ఈ రాశి వారు వారంలో ఇంటిలో కలహాలతో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొనే సూచనలు వున్నాయి. గృహ నిర్మాణాది విషయాల్లో బ్యాంకు పరమైన ఋణములకోసం ప్రయత్నాలు ఎక్కువ చేయవలసి వస్తుంది. వివాహం కాని వారికి త్వరలో శుభవార్తలు వుంటాయి. విద్యార్థులు కొత్త చదువులు చదవాలనిపించినా పరిస్థితులు అనుకూలించక పోవచ్చు. కార్యాలయాలలో మీ పై అధికారులలో స్త్రీలు ఉన్నట్లైతే చాలా లాభం ఉన్నది! ఆకస్మిక ధనలాభం కనిపిస్తున్నది.


పరిహారం: శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం మంచిది.



కర్కాటక

విందు కార్యాల్లో పాల్గొంటారు. ఇతర వ్యాపకాలు తగ్గించి వ్యక్తిగత అభివృద్ధి కోసం శ్రద్ధను పాటించడం మంచిది. ప్రయాణాలలో చాలా జాగ్రత్త వహించాలి. ధన కనక వస్తు వాహనాలు విరివిగా ఉన్నవి. బంధువులు దగ్గరవుతారు. జీవిత భాగస్వామి ఆరోగ్యం పట్ల నిర్లిప్తత తగదు. పెట్టుబడులు కొద్ది కాలం ఆపండి. భూములను అమ్మవద్దు. వారాంతంలో తీర్థ యాత్రలు ఉంటాయి జాగ్రత్తగా వెళ్లి రండి. వాహనాలు నడిపే వారు తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.


పరిహారం: సుబ్రమణ్య స్వామిని దర్శించి పూజించండి



సింహం

ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించవలసి ఉంటుంది. దైవ చింతనతో పాటు దానధర్మాలు చేయించండి. చాలా వరకు మేలు జరుగుతుంది. కొన్ని విషయాల్లో కుటుంబ పెద్దలు ముఖ్యమైన బాధ్యతలు చేపట్ట వలసి వస్తుంది. విదేశీయానం దగ్గరకు వస్తుంది. క్రయ విక్రయాలలో జాగ్రత్తలు పాటించండి. అవసరానికి కావలసిన డబ్బు అదే వస్తుంది. నిరుద్యోగుల సమస్యలు త్వరలో పరిష్కారం అవుతాయి. పరిక్షలకు సిద్ధం కావలసి వుంటుంది.

పరిహారం: దుర్గా అమ్మవారి దర్శనం శుభం కలిగిస్తుంది.




కన్య

ముఖ్యవిషయాల్లో ఆచితూచి వ్యవహరించండి. అవకాశాలను సద్వినియోగం చేసుకోండి. రాజకీయపరమైన లావాదేవీలు లాభిస్తాయి. గతంలో తీసుకున్న తప్పుడు నిర్ణయాలు ఇప్పుడు వెలుగులోకి వస్తాయి. విచారించకండి. అనారోగ్యాలు ఉన్నవారు జాగ్రత్త వహించాలి. గృహం మారే అవకాశమున్నది. పిల్లలు చదువులలో రాణిస్తారు. ఆర్థిక నిర్ణయాలు కొన్ని ఇబ్బంది పెట్టవచ్చు, జాగ్రత్తలు తీసుకోండి.

పరిహారం: వరసిద్ధి వినాయక స్వామిని పూజించండి.



-రాయప్రోలు మల్లికార్జున శర్మ
99890 77388



తుల

ఈ వారం మీరు జీవితంలో మరువలేని కొన్ని సంఘటనలు చోటుచేసుకునే అవకాశాలున్నాయి. మీరు తలపెట్టిన కొన్ని పనులు పెద్దల సహకారంతో పూర్తి అవుతాయి. మీరు చేయని పనులకు కీర్తి, మంచి చేసిన చోట అపకీర్తి కలిగే సూచనలున్నాయి. మిశ్రమ ఫలితాల విషయంలో ఆందోళన చెందవద్దు. వ్యాపార వ్యవహారాల్లో నైపుణ్యాన్ని పాటించాలి. కొన్ని ఒప్పందాలను కుదుర్చుకుంటారు.


పరిహారం: శ్రీ విష్ణు సహస్రనామార్చన మేలును కలిగిస్తుంది.



వృశ్చికం

కళాకారులు ముఖ్య అవకాశాలను అందిపుచ్చుకుంటారు. కుటుంబ సభ్యుల పట్ల శ్రద్ధ చూపించాలి. మాట్లాడే తీరులో జాగ్రత్తలు అవసరం లేనట్లయితే సమస్యలు కొని తెచ్చుకుంటారు. జాగ్రత్త వహించాలి. వాహనం మార్చాలనుకుంటే ఇది సరైన సమయం. కొన్ని విషయాల్లో వైరాగ్యం కలుగుతుంది. ఆస్తులు కలసి వస్తాయి. వారాంతంలో క్రియాశీలులు అవుతారు. కొద్దిపాటి అప్పులు చేసేస్తారు. స్టాక్‌మార్కెట్‌లో ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి.


పరిహారం: శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించి బిల్వమాలను సమర్పించండి.



ధనుస్సు

పరిస్థితుల ప్రభావంచేత కొన్ని అనుకోని మార్పులు చేర్పులు సంభవిస్తాయి. మిమ్ములను మెచ్చే వారు చాలామంది ఉన్నారు. విదేశాలలో చదువుకోవాలనుకున్న వారికి మంచి సమయం. ప్రేమ వివాహాలు ఇబ్బందులు కలిగిస్తాయి. విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరచుకోండి. ఎదో తెలియని ఆవేదనలు ఉండే అవకాశముంది. దైవ చింతనతో అంటా సర్దుకుంటుంది. జీవిత భాగస్వామి వలన చాలా సహకారం అందుతుంది.

పరిహారం: దుర్గా సప్తశ్లోకి పారాయణం మంచిది



మకరం

వారం ఆరంభం చికాకుగా ఉన్నా తరువాత ఉల్లాసంగా ఉంటుంది. ఆశ్చర్యకరమైన ఘటనలు ఎదురవుతాయి. మీరూ అందరినీ ఆశ్చర్య పరుస్తారు. ఉద్యోగంలో మార్పులు లేదా బదలీలు అయ్యే సూచనలు. దీర్ఘ కాలంగా పరిష్కారం కాని సమస్యలు ఈవారం తొలగే అవకాశం. చర్మ సంబంధ రోగాలు కనబడుతున్నాయి. జాగ్రత్త వహించాలి. షేర్లు, పెట్టుబడుల విషయంలో ఆసక్తి పెరుగుతుంది. రియల్ ఎస్టేటు వ్యాపారాలు కొద్దిగా జాగ్రత్తగా నిర్వహించండి.


పరిహారం: లక్ష్మీ అమ్మవారిని దర్శించండి.



కుంభ

ఈ రాశి వారికి పురోగతి చాలా బాగున్నది. సమస్యలు సమసిపోగలవు. ఉత్తమమైన అవకాశాలు రాగలవు. రాజకీయాలలోని వారు విచిత్రంగా రాణిస్తారు. ఆదాయం బాగుంది. ప్రజా రంజకమైన ప్రక్రియలను చేబట్టి ఆకర్షిస్తారు. శత్రువులు ఓటమి పాలవుతారు. అనుకోని బాధ్యతలు పెరుగుతాయి. బంధువర్గంతో విభేదాలు తలెత్తనున్నాయి. పట్టుదలతో ముందుకు వెళతారు. సంతాన పురోగతి బాగుంటుంది. ముఖ్యులను కలుస్తారు.

పరిహారం: మహా గణపతిని సేవించండి.



మీనం

దాంపత్య జీవితంలోని పలు విషయాలు ముందుకు రాబోవుతున్నాయి. వాహనాలు మార్చాలన్న తపన బాగా పెరుగుతుంది. గృహాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు ప్రారంభిస్తారు. పలుకుబడి పెరుగుతుంది. మిత్రులు సహాయం చేస్తారు. మార్కెటింగ్ రంగాల వారికి మంచి సమయం. ఋణాలను తీర్చివేయగలరు. సాంఘీక జన సంక్షేమ కార్యాల్లో పాల్గొంటారు. హనుమాన్ చాలీసా పారాయణ చేయండి. ఖర్చులు పెరుగుతాయి.

పరిహారం: శ్రీ లక్ష్మీ హయగ్రీవ పూజ శుభం కలిగిస్తుంది.

ఓటు బ్యాంకుగా కేంద్ర బడ్జెట్ : జూలకంటి

విజయక్రాంతి, మిర్యాలగూడ: రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటుబ్యాంకు బడ్జెట్‌గా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతులతో పాటు, పేద ప్రజలకు లాభం చేకూర్చే విధంగా లేదని ఆరోపించారు. ఎన్నికలు వస్తున్నందున కంటి తుడుపు చర్యగా బడ్జెట్ ప్రవేశపెట్టి ఓట్లు దండుకో వాలని చూస్తున్నదని విమర్శించారు. గత నాలుగున్నరేళ్లుగా ఎన్నడూ ప్రజల కోసం పట్టించుకోలేదన్నారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు.

ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి



విజయక్రాంతి, అంబర్‌పేట్: గోల్నాక డివిజన్ నెహ్రూనగర్ గ్రౌండ్‌లో అంబర్‌పేట్ నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక డివిజన్ కార్పొరేటర్ కాలేరు పద్మతో కలిసి ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఓటరు నమోదు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లోకనాథం, డి.భారత్‌రాజ్‌ముదిరాజ్, కాలేరు రామకృష్ణ, కాలేరు రాజు, ఆర్.కె.బాబు, ఆర్.రామ, కాలేరు శ్రవణ్, బి.శ్రీకాంత్, దాడిగె జగన్‌యాదవ్, వి.లక్ష్మి రాజ్యలక్ష్మి పి.సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసేందుకు పోలీసులు సిద్ధంగా ఉండాలి



విజయక్రాంతి, కరీంనగర్: రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డవారికి చికిత్స నిమిత్తం రక్తం అవసరం అయితే పోలీసులు రక్తదానం చేసేందుకు సిద్ధంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి.బి కమలాసన్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో శనివారం హైవే పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి మొదట ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రులకు తరలించాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో గస్తీ ఎక్కువగా నిర్వహించాలని అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన రక్తస్రావం ఎక్కువగా జరిగినట్లయితే సదరు వ్యక్తులను గంటలోపు మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రులకు తరలించినట్లయితే 90 శాతం ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. హైవే పెట్రోలింగ్ సిబ్బందికి ప్రథమ చికిత్స నిర్వహణపై ఒకరోజు పూర్తి స్థాయిలో శిక్షణ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తన దృష్టికి రాకుండా హైవే పెట్రోలింగ్ విధుల్లో ఉన్న పోలీసులను మార్పుకూడదని అధికారులను ఆదేశించారు. పోలీసు కుటుంబాలకు ఈ నెల ఉచిత వైద్యపరీక్షలు చేయిస్తామని అన్నారు. పోలీసు సిబ్బంది తమ షిఫ్టుల్లో రెండు సార్లు ప్రజలతో సమావేశాలు నిర్వహించి పోలీస్‌శాఖ ప్రజా భద్రత, రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను వివరించాలని, పోలీస్‌శాఖ ప్రతిష్టను పెంపొందించేందుకు లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అడిషినల్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ శివభాస్కర్, సీఐ తిరుమల్, ఆర్ఐ మల్లేశం, శేఖర్, కిరణ్, ఐటీ కోర్‌టీం ఇంచార్జి యంఎస్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్మతిలో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ



విజయక్రాంతి, కరీంనగర్: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాల, ఎల్ఎండీ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హెల్మెట్ వినియోగంపై అవగాహ ర్యాలీ నిర్వహించారు. జ్యోతిష్మతి కళాశాల నుండి ప్రారంభం అయిన ఈ ర్యాలీ తిమ్మాపూర్ కమాన్ వరకు సాగింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు మాట్లాడుతూ రాజీవ్ రహదారి మార్గంలో ఇంజనీరింగ్ యువత ప్రతినిత్యం వందలాదిగా వస్తుంటారని, ప్రతీ ఒక్క యువతీ, యువకులు హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే పోలీస్ కమిషనర్ కమలాసన్‌రెడ్డి నిబంధన విధించడం హర్షనీయమని అన్నారు. విద్యార్థులు బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గత 8 సంవత్సరాలుగా తమ కళాశాలలో హెల్మెట్ ధారణ తప్పనిసరి విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, ప్రస్తుతం జిల్లా అంతటా విస్తరించడం హర్షనీయమని అన్నారు. తిమ్మాపూర్ సీఐ కరుణాకర్, ఎస్ఐ నరేష్‌రెడ్డిలు మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధారణ వల్ల ప్రమాదాల బారిన పడ్డప్పుడు 90 శాతం ప్రమాదబారి నుండి తప్పించుకోవచ్చని అన్నారు. చిన్న పాటి నిర్లక్ష్యం నిండు జీవితాన్ని బలి తీసుకుంటుందని, హెల్మెట్ ధారణను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.

రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు

విజయక్రాంతి, కరీంనగర్: రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో రహదారి భద్రతపై వాహనదారులకు వారం రోజుల పాటు అవగాహ౦న కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కరీంనగర్ డిప్యూటి ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రహదారి భద్రత–జీవితానికి రక్ష అనే నినాదంతో ఈ నెల 4వ తేదీ నుండి 10వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే కళాశాల విద్యార్థులకు, వాహనదారులకు, బస్సు డ్రైవర్లకు హెల్త్‌క్యాంపులు, ఐసెంటర్లు, సీటుబెల్టులు, హల్మెట్‌పై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే నిత్యం వాహనాలు తనిఖీలు చేపట్టడంతో పాటు ఓవర్‌లోడ్ తనిఖీలు చేపడుతూ అన్ని విధాల జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రహదారి నియమాలను ప్రతీ ఒక్కరు పాటించాలని, రహదారి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేనియెడల చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రతీ ఒక్కరు రహదారి నియమాలు పాటించి ప్రమదాలను అరికట్టాలని కోరారు.



విజయక్రాంతి, అంబర్‌పేట్: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలేండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్. ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాసులు, టి.నారాయణ, బి.రమేష్, వై.శివానందమ్, బి.వెంకటేష్, రవీందర్‌లు పాల్గొన్నారు.

పల్లె పీఠంపై కొత్త పాలకులు

- కొలువు దీరిన కొత్త సర్పంచులు
- కొత్త పంచాయతీలకు వసతి సమస్య
- 29 అధికారాల్లో 13 బదలాయింపు
- భర్తీ కాని కార్యదర్శుల పోస్టులు



విజయక్రాంతి,సంగారెడ్డి: ఆరు నెలలుగా ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్న పంచాయతీలో కొత్త పాలక వర్గాలు కొలువు దీరాయి. శుక్రవారంతో ప్రత్యేకపాలనకు తెరపడి, శనివారం నుంచి ప్రజాప్రతినిధుల పాలన షురూ కావడంతో పల్లెల్లో పండగ వాతావరణం నెలకొంది. శనివారం సర్పంచ్, వార్డు సభ్యులతో పంచాయతీ కార్యదర్శి ప్రమాణస్వీకారం చేయించిన అనంతరం సర్పంచ్ అధ్యక్షతన మొదటి సమావేశం నిర్వహించడంతో కొత్త పాలక వర్గాలు అధికారికంగా కొలువుదీరినట్లు అయింది. ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి ఐదేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు.

2024 ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఈ పాలక వర్గాల గడువు ఉంటుంది. ఇదిలా ఉండ గా...ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా మూడు విడతల్లో గ్రామపంచాయితీలకు ఎన్నికలు నిర్వహించారు. జనవరి 21వ తేదీన తొలి విడత 25వ తేదీన రెండవ విడత, 30 వతేదీన మూడవ విడతతో పంచాయతీ ఎన్నికలు ముగిసాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,615 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు.

ఎటువంటి ఆటు పోట్లు, గొడవలు లేకుండా అధికారులు పంచాయతీ పోరు ముగిసేలా చర్యలు తీసుకున్నారు.

సమస్యల స్వాగతం...

కొత్తపాలక వర్గాలకు గ్రామాల్లో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ప్రధానంగా ఆదాయ వనరులు లేకపోవడంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు పడకేసాయి. ఏటా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే పంచాయితీలు నడుస్తున్నాయి. తెలంగాణ పంచాయితీ రాజ్ చట్టం 2018 లో ప్రతీ పంచాయతీకి 5 లక్షల ప్రత్యేక నిధులు ఇస్తునట్లు పేర్కొనడం కొంత ఊరట నిచ్చింది.

పంచాయతీ కార్యదర్శుల ఖాళీలు

ప్రతీ గ్రామ పంచాయితీకి ఒక కార్యదర్శి ఉండాలని ప్రభుత్వం నియామక ప్రకటన చేసింది. నియామక ప్రక్రియ పూర్తై ఉత్తర్వులు అందించే క్రమంలో కొన్ని సాంకేతిక కారణాలతో అది వాయిదా పడింది. దాంతో కొత్త పంచాయతీలకు కార్యదర్శులు లేకుండా పోయారు. శనివారం కొత్త పంచాయతీల్లో పాలక వర్గాలు ప్రమాణ స్వీకారం చేయించడానికి కూడా కార్యదర్శులు అందుబాటులో లేని పరిస్థితి.

పక్కా భవనాలు లేవు...

కొత్త పంచాయతీల్లో కార్యాలయాలకు పక్కా భవనాలు లేవు. ప్రభుత్వ భవనాలు, ఇతర కార్యాలయాల్లో తాత్కాలికంగా పాలన చేయడానికి ఏర్పాట్లు చేశారు. అవి కూడా అందుబాటులో లేని గ్రామాలలో అద్దె భవనాలలోనే కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. పాత పంచాయితీల్లోనూ పలు చోట్ల కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. వాటికే మరమ్మత్తులు చేసుకుంటున్నారు.

కొలిక్కి వచ్చిన కోకాపేట భూముల వివాదం

- సుప్రీంకోర్టు తీర్పుతో హెచ్ఎండీఏకు రూ.800కోట్లు లబ్ధి

విజయక్రాంతి, హైదరాబాద్: కోకాపేట వేలం భూముల డబ్బులు తిరిగి ఇచ్చే వివాదం పరిష్కారం అయయ్యింది. యాజమాన్య హక్కు లను సవాల్ చేస్తూ కొందరు బిడ్డర్లు వేసిన కేసులో హెచ్ఎండీఏ గెలిచింది. దాంతో ఆర్థికంగా గడ్డు కాలాన్ని ఈదుతున్న సంస్థ కు భారీ ఊరట లభించింది.

నిధుల సమీకరణ కోసం కోకాపేట గ్రామంలోని కొన్ని భూములను రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏ (హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ) కు కేటాయించింది. దీంతో 2000 నుంచి 2006 ల మధ్య హెచ్ఎండీఏ ఆ భూములలో కొన్నింటికి వేలం నిర్వహించింది. హుడా (హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) /హెచ్ఎండీఏ ద్వారా గోల్డెన్ మైల్ I, II & III మరియు ఎంపైర్I & II పేరిట 166 ఎకరాల భూమిని 2006 నుంచి 2008 మధ్యకాలంలో వేలం ద్వారా విక్రయించడం జరిగింది. 12 మంది బిడ్డర్లు(వేలంలో పాల్గొన్న కొనుగోలుదారులు) సదరు 166 ఎకరాల భూమిని రూ.1755.51 కోట్లకు వేలం లో సొంతం చేసుకున్నారు. వేలం పాటలో ఎకరానికి ధర రూ.6.10 కోట్ల నుంచి రూ. 14.45 కోట్లు పలికింది. వేలం పాట దారులు (బిడ్డర్లు)వెంటనే ఈఎండీ చెల్లించడంతో పాటుగా రెండు, మూడు విడుతలుగా 10 నుంచి 70 శాతం ధరను కూడా చెల్లించారు. కాగా కొనుగోలు దారులు చెల్లించిన మొత్తం 200708 వరకు రూ. 687 కోట్లకు చేరింది. కాని వేలంలో పాల్గొన్న కొనుగోలుదారులు నియమాలకు అనుగుణంగా నిర్ధారిత సమాయానుసారం మిగిలిన సొమ్మును చెల్లించలేదు. మిగిలిన రూ.1068 కోట్లు చెల్లించాలంటూ హెచ్ఎండీఏ కనుగోలు దార్లకు నోటీసులు ఇవ్వడం జరిగింది. దాంతో కొనుగోలుదారులు హైకోర్టులో వాజ్యం వేశారు. ఆ తరువాత సుప్రీంకోర్టులో కూడా ఆ భూముల యాజమాన్య హక్కులు వివాదంలో ఉన్నాయంటూ వాజ్యం వేశారు. సుప్రీంకోర్టు ఇరు పక్షాల వాదనలు విన్న తరువాత అక్టోబర్, 2017లో ఆ వేలం వేసిన భూములపై యాజమాన్య హక్కులు ఉన్నవని, హెచ్ఎండీఏ కు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఆ తరువాత 2019, జనవరి 8 న సుప్రీం కోర్టు వేలంలో భూమి కొనుగోలు చేసిన వివాదంలో తీర్పునిస్తూ, కొనుగోలుదారులు కోరితే, వారు చెల్లించిన నిధుల ప్రకారం ప్రోరేటా పద్ధతిన భూమిని కేటాయించాలని, పూర్తిగా నిధులు (మిగిలిన నిధులు) 8 వారాలలో చెల్లించేందుకు సిద్ధపడితే, అందుకు అనుగుణంగా వారికి సదరు భూమిని కేటాయించాలని తీర్పు నిచ్చింది. కాగా 2 బిడ్డర్లు(కొనుగోలు దారులు) ప్రో రెటా పద్ధతిన వారు చెల్లించిన నిధులకు గాను భూమిని తీసుకోవాడానికి సిద్ధపడ్డారు. మిగతావారు 8 వారాలలో మిగిలిన నిధులు చెల్లించి మొత్తం భూమిని తీసుకోవడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఒక బిడ్డరు (కొనుగోలుదారుడు) మాత్రమే కేసు వాయిదా కోరడం జరిగింది. సుప్రీంకోర్టు తీర్పు వల్ల హెచ్ఎండీఏ కు సుమారు రూ.800 కోట్ల రూపాయలు సమకూరనున్నట్లు అధికారులు తెలిపారు. వేలం వేసిన భూముల స్థలాలకు హద్దులను అందుకు అనుగుణంగా నిర్ణయించడం జరిగిందని వివరించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తా



విజయక్రాంతి, ఎల్బీనగర్: గడ్డిఅన్నారం డివిజన్‌లోని పటేల్‌నగర్‌లోని ఉమ్మెన్స్ వరల్డ్ వారు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి హాజరై ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఉమ్మెన్స్ వరల్డ్ బిల్డింగ్ నందు వైద్య సేవలు అందించడానికి అదనపు అంతస్తు నిర్మించి ఇవ్వాలని, రేషన్ కార్డ్స్, పించన్లు, డబ్బుల్‌బెడ్‌రూం ఇండ్లు గురించి కోరారు. దానికి స్పందిస్తూ తప్పకుండా అర్హులు అయిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిచేనేపల్లి వెంకటేశ్వర్లు, రమేష్‌ముదిరాజ్, ప్రతిక్, రవీందర్‌రెడ్డి, నరేందర్, బాబుగౌడ్, బుచ్చయ్య, అనీల్‌గౌడ్, మహిళ సభ్యులు ఇందర, ప్రేమలత, సంయుక్త, రాధా తదితరులు పాల్గొన్నారు.



విజయక్రాంతి, ఎల్బీనగర్: రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు, ఎంపీ గుత్త సుఖేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వార్డు, ఏరియా కమిటీ సభ్యుడు, మహిళ నాయకులతో కలిసి ఎంపి నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతు ఘనంగా సన్మానించారు.

రాబోయే బడ్జెట్ అద్భుతంగా ఉంటుంది



విజయక్రాంతి, నిజామాబాద్: నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్ ట్రైలర్ మాత్రమేనని.. జూలైలో ఎన్‌డీఏ హయాంలో వచ్చే బడ్జెట్ మరింత అద్భుతంగా ఉంటుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్ అన్నారు. శనివారం నిజామాబాద్ నగరంలోని బస్వా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఐదు పార్లమెంట్ నియోజ కవర్గాల సన్నాహక సదస్సులో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన బీజేపీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు రెండు నెలల దూరం లో ఉన్నాయని, ఎన్నికల కోసం దేశ వ్యాప్తంగా సన్నాహక సమావేశాలు చేపట్టామని చెప్పారు. ఐదు నియోజక వర్గాలకు కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో పార్టీ ప్రదర్శన ఆశించినంతగా లేదన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. పార్లమెంట్‌తో పాటు శాసన సభకు ఎన్నికలను ఒకే సారి నిర్వహించాలని చెప్పిన కేసీఆర్ రాజకీయ కారణాలతో ముందస్తు ఎన్నికలకు వెళ్లారని ఇది కొంత మేరకు పార్టీకి నష్టం కల్గించిందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికలతో పాటు శాసన సభకు ఎన్నికలు జరిగితే మోడీ చరిశ్మతో ఫలితాలు మరో రకంగా ఉంటాయన్న ఆలోచనతో కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్లి ఉండవచ్చనే అనుమానాలు ఆయన వ్యక్తం చేశారు.

ఈ బడ్జెట్ ట్రైలర్ మాత్రమే..

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌తో దేశంలో 50 శాతం మంది ప్రజలకు మేలు చేసే విధంగా ఉందన్నారు. మధ్యంతర బడ్జెట్ ఇలా ఉంటే జూలైలో రానున్న బడ్జెట్ ఇంకెలా ఉంటుదోనని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. రైతులు, మధ్య తరగతి, ఉద్యోగులకు బడ్జెట్‌తో ప్రయోజనం పొందనున్నారన్నారు. అసంఘటిత రంగంలో కార్మికులకు పెన్షన్ స్కీంను తెచ్చిన ఘనత మోడీకే దక్కుతుందన్నారు. ఆర్థిక వ్యవస్థ చక్కదిద్దడం వల్లే ఇలాంటి నిర్ణయాలు తీసుకోగలిగిందన్నారు.

పటిష్టమైన ఆర్థిక పునాదులపై దేశం నిలబడటం వల్లే సర్కార్ ఇలాంటి నిర్ణయాలు తీసుకుందన్నారు. స్వతంత్ర్య భారతదేశంలో మొట్ట మొదటి సారిగా రక్షణ రంగానికి 3 లక్షల కోట్లు ఖర్చు పెట్టిందని పేర్కొన్నారు. ప్రజలపై అదనపు భారం పడకుండా, ఎవరిపై ట్యాక్స్‌లు వేయకుండా ఈ బడ్జెట్ రూపొందించడం మోడీకే సాధ్యమైందన్నారు.

మోడీ చరిష్మాను తట్టుకోలేకే ఫ్రంట్‌లు..

దేశంలో చాలా పార్టీలకు నాయకులు లేకుండా పోయారని నరేంద్ర మోడీని అడ్డుకునేందుకు ఫ్రంట్‌లు ఏర్పాటు చేస్తున్నారని రాం మాధవ్ ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో మోడీ చరిష్మా ముందు నిలబడే నాయకులు లేరన్నారు. దేశ ప్రజలు మరో సారి మోడీని ప్రధాని చేయాలని ఉత్సుకతతో ఉన్నారని తెలిపారు.

కేంద్ర నిధులతోనే పోలవరం..

ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టును నూటికి నూరు శాతం కేంద్రం నిధులతోనే పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తున్నామని మాధవ్ తెలిపారు. ఏపీ నాయకులు, చంద్రబాబు నాయుడుకు విమర్శలు చేయడం తప్ప మరేం లేదన్నారు. రాష్ట్రాలు తమకేం కేటాయించలేదని మాట్లాడటం మానుకోవాలని, ఇది మధ్యంతర బడ్జెట్ అనేది గ్రహించాలన్నారు. రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని మాట్లాడటం సరికాదన్నారు. ఇది మధ్యంతర బడ్జెట్ మాత్రమేననే విషయాన్ని గుర్తించాలన్నారు. రాబోయే బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాలు కోరుకున్న విధంగా బడ్జెట్ ఉంటుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఐదేళ్ల కాలంలో మోడీ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. తెలంగాణ నుంచి పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధిస్తామన్నారు.

అమిత్ షా, గడ్కరి రాక..

రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక కార్యక్రమాలకు బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్ షా, కేంద్ర మంత్రి గడ్కరి వస్తున్నట్లు డాక్టర్ లక్ష్మన్ వెల్లడించారు.

ఈనెల 13న నిజామాబాద్‌లో జరిగే ఐదు నియోజకవర్గాల సమ్మేళననానికి బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్ షా, ఈనెల 5న హైదరాబాద్‌లో జరిగే సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల సమ్మేళనానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

సహకార కేంద్ర బ్యాంక్ మైక్రో ఏటిఎం సేవలు ప్రారంభం



విజయక్రాంతి, సంగారెడ్డి: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మెదక్ ద్వారా మైక్రో ఏటిఎం సేవలను ఆ బ్యాంక్ అధ్యక్షుడు రవీందర్‌రావు, బ్యాంక్ ఏండీ మురళీధర్, బ్యాంక్ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డిలు శనివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బ్యాంక్ ఆవరణలో సంయుక్తంగా సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బ్యాంక్ ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు బ్యాంక్ డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా బ్యాంక్ నగదు లావాదేవీలు కొనసాగించవచ్చని వారు పేర్కొన్నారు. ఈ సేవలు 38 సహకార బ్యాంక్ బ్రాంచ్‌లలో ఖాతా దారులకు సేవలు అందుతాయని వారు వెల్లడించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని కేంద్రాలలో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో నేడు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

విజయక్రాంతి, కరీంనగర్: జనవరి 1వ తేదీ 2019 సంవతసరం నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరు నేడు ఓటు నమోదు చేసుకోవాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. నూతనంగా ఓటు హక్కు నమోదు కోసం జిల్లాలోని ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాలతో సిద్దంగా ఉంటారని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ప్రధనొపాధ్యాయులు పోలింగ్ స్టేషన్‌ను గుర్తించి తరగతి గదిని తెరచి ఉంచాలని, బూత్ లెవల్ అధికారులకు సహకరించాలని అన్నారు. బూత్‌లెవల్ అధికారులు ఫారం–6,7,8, 8ఏ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు చిరునామాల మార్పులు చేర్పులకు సంబంధిత ధరఖాస్తులను పూరించి తీసుకోవాలని అనంతరం వాటిని బూత్ లెవల్ అధికారులు తప్పనిసరిగా ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పెట్టాలని సూచించారు.

విద్యార్థులు బాలల చలన చిత్రాలు తిలకించాలి...

జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న బాలల చలనచిత్రోత్సవాలను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులందరు తిలకించి బాలల చలనచిత్ర ప్రదర్శనలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. బాలలకు ఉపయోగపడే మంచి సందేశాత్మక చిత్రాలను నగరంలోనిఆరు సినిమా థియేటర్లలో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఆరో తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరు బాలల సినిమాలకు తిలకించేలా విధ్యాధికారులు చూడాలని అన్నారు. విద్యార్థుల్లో నిగూఢంగా దాడి ఉన్న శక్తియుక్తులను వెలికితీసేందుకు ఇలువంటి బాలల చలన చిత్రాల ప్రధర్శనలు దోహదపడతాయని విద్యాలందరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

న్యాయవాది రాసలీలలు–పట్టుకున్న భార్య

విజయక్రాంతి, హైదరాబాద్: న్యాయం తరుపున వాదించాల్సిన న్యాయవాది దారి తప్పాడు. భార్య ఉండగానే మరో మహిళతో రహస్యంగా కాపురం పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య ఇద్దరినీ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంది. పోలీసులు వివరాల ప్రకారం ఉప్పల్‌కు చెందిన కృష్ణమాచారి అనే క్రిమినల్ లాయర్ 2008లో వింధ్యారాణి అనే మహిళను వివాహం చేసుకున్నారు. . వింధ్యారాణి రాజస్థాన్‌లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. భార్య పంపిస్తున్న డబ్బులతో కొంత కాలంగా జల్సాలకు అలవాటు పడ్డ కృష్ణమాచారి మరో మహిళతో ఓల్ రామాంతపూర్లోని ఓ అపార్ట్‌మెంట్‌లో కాపురం పెట్టాడు. భర్తకు దూరంగా ఉండలేక స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకొని వింధ్యారాణి నగరానికి వచ్చారు. గత కొద్ది రోజులుగా భర్త ప్రవర్తనలో మార్పులు గమనించిన వింధ్యా అతడిని రహస్యంగా ఫాలో అవడం ప్రారంభించారు. మరో మహిళతో అక్రమసంబంధ ఉందని పసిగట్టిన వింధ్య స్థానికులు, బంధువుల సహాయంతో శనివారం వీరిద్దరూ ఇంట్లో కలసి ఉండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వీరిద్దరిని స్థానికులు సహాయంతో షీ టీమ్ అధికారులకు అప్పగించారు. పోలీసుల విచారణలో లాయర్ కృష్ణమాచారి పెళ్లి పేరుతో అనేక మంది మహిళలను మోసం చేసినట్లు తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ బల్దియా అధికారులు



విజయక్రాంతి, హైదరాబాద్: లంచం తీసుకుంటూ జీహెచ్ఎంసీ అధికారులు ఇద్దరు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. నగరంలోని మల్కాజ్‌గిరి జీహెచ్ఎంసీ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడి చేశారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నగేశ్, శ్రీనివాస్‌లు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఓ న్యాయవాది నుంచి రూ. 80 వేలు లంచం తీసుకుంటూ అధికారులు పట్టుబడ్డారు.

నేడు కేయూకు రుసా నిధుల డిజిటల్ లాంచింగ్

విజయక్రాంతి, వరంగల్: కాకతీయ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మక రుసా నిధులను పొందింది. దీనిలో భాగంగా ఫిబ్రవరి 3వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎస్‌కెఐసీసీ(షేర్ ఇ కాశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్), శ్రీనగర్, జమ్మూ కాశ్మీర్ నుంచి ఈ డిజిటల్ లాంచింగ్‌ను ప్రారంభిస్తారు. ఉన్నత విద్య అభివృద్ధిలో భాగంగా మానవ వనరుల మంత్రిత్వశాఖ దేశ వ్యాప్తంగా ఒక మహిళా విశ్వవిద్యాలయం, 70 కొత్త మోడల్ డిగ్రీ కాలేజీలను , 11 వృత్తివిద్యా కళాశాలను, 66 ఎంట్రిప్రిన్యూర్‌షిపఖ్, ఇన్నోవేషన్ మరియు కారియర్ హబ్‌లను ఎంపిక చేశారు. కాకతీయ యూనివర్సిటీ 66 ఎంట్రిప్రిన్యూర్‌షిష్, ఇన్నవేషన్ మరియు కారియర్ హబ్ నందు రుసా నిధులు రూపాయలు 50కోట్లు పొందనుంది. ఎన్ఎఎసి గ్రేడ్ స్కోర్ వలన కేయూ దేశవ్యాప్తంగా 12వ స్థానంలో వుండటంవలన నిధులను పొందినట్లు కేయూ వీసి ప్రొ. సాయన్న తెలిపారు.

ఎస్‌బీఐలో భారీ కుంభకోణం

విజయక్రాంతి, హైదరాబాద్: పరకాల మండలం కంతాత్మకూర్ ఎస్‌బీఐలో భారీ కుంభకోణం వెలుగు చూసింది. పరకాల ఎస్బీఐ బ్యాంకులో విలీనానికి ముందు రూ.2.15కో ట్లు దారి మళ్లించినట్లు తాజాగా అధికారులు గుర్తించారు. ముద్ర, స్టాండప్ ఇండియా రుణాల పేరిట రూ.2.15కోట్లు స్వాహా చేశారు. బోగస్ సంస్థల పేరిట రుణాలు మంజూరైనట్లు ఎస్బీఐ అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు సీబీఐ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బ్యాంకు మాజీ మేనేజర్ ఎ.నరేన్ చౌదరితో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. మధ్యవర్తులు మర్రిశెట్టి రాజేష్‌కుమార్, బొంతల శ్రీనివాస్‌పై కూడా కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

వాహన చోదకులకు గులాబి పువ్వు...!

విజయక్రాంతి, రామగుండం: పారిశ్రామిక ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలను నిబద్ధతతో పాటించాలని... హెల్మెట్ దరించాలని వాహన చోదకులకు ట్రాఫిక్ పోలీసులు ప్రచారం నిర్వహించారు. గోదావరిఖని నగరంలో అవగాహణను కల్పించారు. హెల్మెట్ దరించని వాహన చోదకులకు ఈ చాలన్‌తో జరిమానా విదిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబందనలను పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు ప్రధాన కూడళ్ళలో హెల్మెట్ దరించిన వాహన చోదకులకు గులాబి పువ్వునిచ్చి ట్రాఫిక్ పోలీసులు అభినందించారు. రామగుండం ట్రాఫిక్ సిఐ బిల్లా కోటేశ్వర్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది బాయి శ్రీనివాస్, హైదరాబాద్ రవీందర్, శంకరాచారి తదితరులు ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. కాగా, ఈ ప్రాంత అనేక కూడళ్ళలో రోడ్డు ప్రక్కన వ్యాపారాలు నిర్వహించే చిరు వ్యాపారులకు అవగాహణ కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డు ప్రక్కన, మధ్యలో ఈ చిరు వ్యాపారాన్ని నిర్వహించడం వలన ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఇబ్బందులు ఎదురవుతాయని... ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

శేరిలింగంపల్లిని అభివృద్ధి చేస్తాం–ఎమ్మెల్యే గాంధీ

విజయక్రాంతి, శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని, తాము గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం జరుగుతుందని స్థానిక శాసన సభ్యులు అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గంలోని మియాపూర్, చందానగర్ డివిజన్లలో సుమారు రూ. 2 కోట్ల తో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన స్థానిక కార్పొరేటర్లు మేకక్రీనివాస్, నవతారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మియాపూర్ జెపిఎనగర్ లో చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను నేటితో పరిష్కారం అవుతుందని అన్నారు. అందర్గత రహదారులను సీసీ రోడ్లుగా మార్చడం జరుగుతుందని, అంతేకాకుండా యూజీడీ పైప్‌లైన్ నిర్మాణ పనులు కూడా ప్రారంభంతో మురుగునీటి సమస్య ఉండదని పేర్కొన్నారు.

వాతావరణ వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియచేయాలి

- సమీక్షలో సి.ఎస్. ఆదేశం

విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో 924 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు ఉన్నాయి. ఈ స్టేషన్ల ద్వారా ప్రతి రోజు రాష్ట్రములోని అన్ని ప్రాంతాల యొక్క వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు రికార్డు చేసి, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ, యొక్క అధికార వెబ్ సైట్ మరియు మొబైల్ యాప్ ద్వారా వర్ష పాతము, ఉత్తర్లు ఉష్ణో గ్రతలు, అధిక ఉష్ణోగ్రతలు, గాలిలోని తేమ మొదలయిన అన్ని రకాల సమాచారం వాతావరణ వివరాలను ప్రజలకు మరియు అధికారులకు అందుబాటులో ఉండడము జరుగుతున్నది. అంతే కాకుండా, ప్రతి జిల్లా కలెక్టరు కార్యాలయములలో నగరపాలక సంస్థ జోనల్ కార్యాలయములలో లెడ్ డిస్ ప్లే బోర్డు లను కూడా ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రజలకు మరియు అధికారులకు వాతావరణ స్థితిగతులను తెలియజేయుటకు సంకల్పించినది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర సచివాలయములో ఏర్పాటు చేసిన లెడ్ డిస్ ప్లే బోర్డు లను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి ప్రారంభించినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రములో ఏర్పాటు చేసిన ఈ లెడ్ డిస్ ప్లే బో ర్డు ల ద్వారా ప్రతికూల వాతావరణ పరిస్థితులలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్త లను గురించి హెచ్చరికలను సంబంధిత జిల్లా అధికారులు జారీచేస్తారని,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలియజేశారు. ఈ లెడ్ డిస్ ప్లే బోర్డు ల వలన రాష్ట్రములో నెలకొన్న ప్రస్తుత వాతావరణ పరిస్థితిలే కాకుండా రాగల మూడు రోజులకు ముందస్తు వాతావరణ సూచనలను ప్రజలకు మరియు అధికారులకు తెలియజేయడానికి వీలవుతుందని తెలిపారు. ఈ కర్యక్రమములో ఆర్థిక మరియు ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ, ముఖ్య కార్య నిర్వహణ అధికారి షేక్ మీరా పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ల నిర్వహణకు వివిధ శాఖల అనుమతి తప్పనిసరి



- సిటీ సమన్వయ సమావేశంలో నిర్ణయం*

విజయక్రాంతి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ఇక నుంచి ఏవిధమైన ఎగ్జిబీషన్లు, వస్తు ప్రదర్శనలు జరిపే నిర్వాహకులైనా ఖచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందే.తాజాగా జరిగిన నుమాయిష్ ప్రమాదం తో అధికారులు అప్రమత్తం అయ్యారు. తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ నుంచి ఎన్వోసీతో పాటు ప్రదర్శనలో ఏర్పాటుచేసే దుకాణాలకు సంబంధించి లేఅవుట్ను జీహెచ్ఎంసీ నుంచి అనుమతి పొందేవిధంగా నిబంధనలు కఠినతరం చేయాలని సిటీ సమన్వయ సమావేశం నిర్ణయించింది. శనివారం జలమండలి కార్యాలయంలో వివిధ విభాగాల అధిపతులతో హైదరాబాద్ సిటీ సమన్వయ సమావేశం జరిగింది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఎం.దానకిషోర్ ఆధ్వర్యంలో జరిగిన సిటీ సమన్వయ సమావేశానికి సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు వి.సి.సజ్జనార్, మహేష్భగవత్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ లోకేష్కుమార్, హైదరాబాద్ ఇన్చార్జి కలెక్టర్ రవిలతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇక నుంచి నగరంలో ఏ ప్రాంతంలోనైనా ఎగ్జిబిషన్లు నిర్వహిస్తే తప్పనిసరిగా అగ్నిమాపక, పోలీసు శాఖల నుంచి ఎన్.ఓ.సిలను తీసుకోవడంతో పాటు ఎగ్జిబిషన్ లేఅవుట్ పై జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతి తీసుకునేలా నిబంధనలు మార్చనున్నట్టు జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిషోర్ తెలిపారు. అదేవిధంగా ఈ ఎగ్జిబిషన్ల ఏర్పాటుకు సమీపంలో జలమండలి వాటర్ ట్యాంకర్లు కూడా అందుబాటులో ఉండేలా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని నిర్ణయం చేశారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో దుకాణాలు ఏర్పాటుచేసిన మార్గాల్లో అంతర్గతంగా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకునేలా వాటర్ పైప్లైన్లు వేయాలని ఎగ్జిబిషన్ సొసైటికి సూచించారు. వర్షాకాలంలో డ్రెయిన్లు పొంగి కలుషితనీరు వర్షపునీరు కలిసి రహదారులపైకి రాకుండా ఉండేందుకుగాను నగరంలో సీవరేజ్, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లకు వేర్వేరు లైన్లు నిర్మించాలని నిర్ణయించినట్టు దానకిషోర్ తెలిపారు. ఇందుకుగాను మొదటి దశలో 87 ప్రధాన ప్రాంతాల్లో దాదాపు రూ. 18.50 కోట్ల వ్యయంతో వర్షపునీటికి, మురుగునీరు పారేందుకు వేర్వేరుగా డ్రెయిన్లను నిర్మించనున్నట్టు కమిషనర్ దానకిషోర్ వెల్లడించారు. ఇందుకుగాను జలమండలి ఆధ్వర్యంలో 67 ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్మాణం రూ. 15కోట్లతో చేపట్టనున్నామని, జీహెచ్ఎంసీ ద్వారా 27 ప్రాంతాల్లో రూ. 3.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్నామని, ఈ పనులకు ఫిబ్రవరి 15లోగా టెండర్ ప్రక్రియ పూర్తిచేసి మూడు నెలల్లో నిర్మాణాలు పూర్తిచేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేశామని తెలిపారు. ఈ డ్రెయిన్ల నిర్మాణం వల్ల హైదరాబాద్ నగర శివారులు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతూ పలు రహదారుల్లో ట్రాఫిక్ పెరిగినందున ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేయాలని సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లు కోరారు. హైదరాబాద్ నగరంలో రోడ్డు ప్రమాదాలు తరచుగా జరిగే 80 బ్లాక్ స్పాట్లను గుర్తించామని, ఈ ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ తదితర చర్యలను వెంటనే చేపట్టాలని జీహెచ్ఎంసీ, హైదరాబాద్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్లను కోరారు. ఎన్టీఆర్ మార్గ్లో ఉన్న హుస్సేన్ సాగర్ చుట్టూ రేలింగ్ను ఏర్పాటు చేయాలని, రేలింగ్ లేనందున ఇటీవల ఒక కారు హుస్సేన్ సాగర్లో ప్రమాదవశాత్తు పడిన విషయాన్ని హైదరాబాద్ పోలీస్ అడిషనల్ కమిషనర్ చౌహాన్ గుర్తు చేశారు.

మధ్యతరగతి ప్రజలు మెచ్చిన, పేదలు నచ్చిన బడ్జెట్

విజయక్రాంతి, వరంగల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్పై వరంగల్ జిల్లాలో హర్షాతిరేకలు వెల్లువెత్తుతున్నాయి. మోదీ పాలనలో మధ్యతరగతి ప్రజలు మెచ్చిన, పేదలు నచ్చిన బడ్జెట్ ప్రవేశపెట్టడం ఎంతో గర్వించదగిన విషయమని బీజేపీ వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మాఅమరేందర్రెడ్డి అన్నారు. శనివారం రోజు హన్మకొండ చౌరస్తాలో రావు పద్మా అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఇంధన పొదుపులో ఆర్టీసీ మిన్న:ఎండీ సునీల్ శర్మ



విజయక్రాంతి, హైదరాబాద్: ఇందన పొదుపు చేయడంలో ఆర్టీసీ మెరుగైన స్థానం పొందుతోందని ఎండీ సునీల్ శర్మ తెలిపారు. రాష్ట్ర, రీజియన్ స్థాయిలో ఇందనం పొదుపు చేయడం ద్వారా ఉత్తమ డ్రైవర్లు, ఉత్తమ మెకానిక్లుగా ఎంపికైన 1468 మందిని శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారిని ఎండీ అభినందించి మాట్లాడారు. 10 వేలకు పైగా బస్సులు నడిపిస్తున్న ఆర్టీసీ ఏటా 22.66 కోట్ల లీటర్ల డీజిల్ వినియోగిస్తోందని తెలిపారు. ఇది ఆర్టీసీ వ్యయంలో 22.66 శాతంగా ఉందన్నారు. ప్రస్తుతం 5.14 కేఎంపీఎల్ సాధించగలిగామని, ఇది 5.30 సాధించగలిగితే రూ. 43 కోట్లు ఆదా అవుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏడీ ఎం రవీందర్, హెచ్పీసీఎల్సీ జీఎం శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నా దేశ సోదర, సోదరీమణులకు
పౌరసత్వం ఇవ్వాల్సిందే

(మొదటిపేజీ తరువాయి) దుర్గాపూర్‌లో జరిగిన బహిరంగసభల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఇందిరాగాంధీ కుటుంబంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. శారద చిట్‌ఫండ్ కుంభకోణం, అగస్టా కుంభకోణాన్ని ఆయన ప్రస్తావించారు. రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోకుండా.. హింసకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ మద్దతుదారులపై దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. 'దీదీ (సీఎం మమతా బెనర్జీ), ఆమె పార్టీ రాష్ట్రంలో హింసను ఎందుకు ప్రేరేపిస్తున్నారంటే.. మీరు బీజేపీపై ఆదరణ, ప్రేమ చూపిస్తున్నారు. ఇది ఆమెకు ఆందోళన కల్గించింది. అందుకే హింసను ప్రేరేపిస్తూ హత్యలకు పాల్పడుతున్నారు. ఈ కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.' అని ఆరోపించారు. రాష్ట్రంలో మమతా ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి.. వ్యక్తిగత రాజకీయాలకు ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు.

బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారు...

రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. ప్రజలు కోరుకుంటున్న మార్పు వచ్చే ఎన్నికల్లో సాకారం అవుతుందని చెప్పారు. కోల్‌కతాలో ఇటీవల ప్రతిపక్షాలు నిర్వహించిన బహిరంగసభ గురించి ప్రస్తావిస్తూ.. నాలుగేళ్ల క్రితం ఒకరి ముఖాలు చూసుకొని వాళ్లు.. జైళ్లకు పంపించుకోవాలని చూసిన వాళ్లు.. ఈనాడు బీజేపీని అధికారంలో నుంచి తప్పించాలని ఒక్కటయ్యారని విమర్శించారు. సీఎం మమతా బెనర్జీ, రాహుల్‌గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి విమర్శలు చేస్తూ.. 'చిట్‌ఫండ్ నిధులను దోచుకున్నవారు. రక్షణ ఒప్పందాల ద్వారా అవినీతికి పాల్పడ్డవారు.. చౌకీదారుడిని (కాపలాదారుడిని) ఇష్టపడరు.' అని మోదీ వ్యాఖ్యానించారు. 'టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ నిర్వహించిన సభలో పాల్గొన్న 20 మంది నేతల ఫొటోలు చూడండి. వారంతా భయంతో ఉన్నట్టు కనబడుతున్నారు. ఒకరి కొడుకు. మరొకరి అల్లుడు. వీళ్లందరూ తప్పు చేసినట్టుగా కన్పిస్తూ కోల్‌కతాలో కలిశారు.' అని ఎద్దేవా చేశారు. 'మీ చౌకీదార్ (కాపలాదారుడు) అవినీతిని రూపుమాపుతూ, నల్లధనాన్ని అరికట్టడానికి భారీ ప్రయత్నాలు చేస్తున్నాడు. దేశంలో అంత్యంత శక్తివంతమైన ఒక కుటుంబం పన్ను ఎగవేత ఆరోపణలపై న్యాయస్థానాల చుట్టూ తిరుగుతోంది.' అని ఇందిరాగాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి మోదీ వ్యాఖ్యానించారు. ఇటీవలే తెచ్చిన పౌరసత్వ బిల్లు



గురించి ప్రస్తావిస్తూ నా సోదరీ, సోదరీమణులకు దేశ పౌరసత్వం ఇవ్వాల్సిందే అని స్పష్టం చేశారు. పొరుగు దేశాల్లో ఉన్న హిందువులు, సిక్కులు, పార్శీలు, క్రైస్తవులు అక్కడ ద్వితీయ పౌరులుగా ఎన్నో బాధలు అనుభవించారని తెలిపారు. వారు ఎక్కడికెళ్లాలో తెలియక.. భారత్‌కు వచ్చిన వారికి ఆపన్న హస్తం అందించడంలో భాగంగా పౌరసత్వం బిల్లు తీసుకొచ్చామన్నారు. ఈ బిల్లుకు మద్దతీయాలని టీఎంసీకి సూచించారు. తూర్పు పాకిస్థాన్ నుంచి 1950వ దశకంలో దాదాపు 30 లక్షల మంది పౌరులు పశ్చిమబెంగాల్‌కు వలసవచ్చారని తెలిపారు. ఉత్తర, దక్షిణ బెంగాల్‌లోని 24 పరగణాల జిల్లాల్లోని ఐదు లోక్‌సభ స్థానాల్లో ప్రభావం చూపే వీరు.. ఇప్పటివరకూ పౌరసత్వం పొందలేదని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ గురించి కూడా మోదీ ప్రస్తావించారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా.. రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు నిర్లక్ష్యానికి గురయ్యారని తెలిపారు. వారి సంక్షేమం కోసం ఈ బడ్జెట్లో చారిత్రక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. వారి సంక్షేమం కోసం ఇప్పుడు తీసుకున్నవి ప్రారంభ నిర్ణయాలేనని, ఎన్నికల తర్వాత ప్రవేశబెట్టబోయే బడ్జెట్లో మరిన్ని పథకాలు తీసుకొస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలో ఉండగా ఏనాడు రైతుల గురించి ఆలోచించలేదన్నారు. రుణమాఫీ అంటూ తప్పుడు వాగ్దానాలు ఇస్తున్నారని ఆరోపించారు. తాము పంట పెట్టుబడి ఇవ్వడానికి నిర్ణయం తీసుకుంటే.. ఇంత తక్కువ ఇస్తారా ..? అంటూ కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. తాము తీసుకున్న పంట పెటుబడి నిర్ణయం కారణంగా దేశంలో 12 కోట్ల మంది చిన్నకారు రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఏడాదిలో మూడు వాయిదాల్లో రూ. 6 వేలు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో వేస్తామని ఆయన ప్రకటించారు.

ఠాకూర్‌నగర్‌లో అపశృతి

మోదీ బహిరంగ సభ సందర్భంగా ఠాకూర్‌నగర్‌లో అపశృతి చోటు చేసుకుంది. సభకు హాజరైన వారు వేదిక వద్దకు వచ్చే ప్రయత్నం చేయగా.. గమనించిన మోదీ వారిని వారించారు. అయినప్పటికీ.. సభికులు వేదిక వద్దకు రావడానికి ప్రయత్నించడంతో తొక్కిసలాట జరిగింది. దీంతో పలువురు మహిళలు, పిల్లలు గాయపడ్డారు. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స జరిపించాలని వేదికపై నుంచే మోదీ ఆదేశించారు. ఈ ఘటనతో ఆయన తన ప్రసంగాన్ని కూడా అర్ధాంతరంగా ముగించారు.

బీజేపీ, టీఎంసీ కార్యకర్తల మధ్య ఘర్షణ

పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా బీజేపీ, టీఎంసీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మోదీ రాక సందర్భంగా బీజేపీ మద్దతుదారులు పలుచోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను టీఎంసీ మద్దతుదారులు తొలగించి సీఎం మమతా బెనర్జీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో రెండు పార్టీల మద్దతుదారుల మధ్య ఘర్షణ జరగడంతో పలువురు గాయపడ్డారు. ఈ సందర్భంగా బీజేపీ బెంగాల్ శాఖ ప్రధాన కార్యదర్శి శయంతన్ బసు మాట్లాడుతూ మా కార్యకర్తలను తృణమూల్ కార్యకర్తలు బెదిరించి దాడులు చేశారని ఆరోపించారు. మోదీ ఫ్లెక్సీలను చించి మమత ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే బీజేపీ నేతల ఆరోపణలను టీఎంసీ ఖండించింది. తాము ఎవరి పోస్టర్లు చించలేదని, బీజేపీ కార్యకర్తలే సీఎం మమత ఫొటోలపై నల్లరంగు పులిమారని ప్రత్యారోపణలు చేశారు. ఈ ఘటనలపై రెండు పార్టీల నేతలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

రామ మందిరంపై.. రాహుల్ మాటేమిటి?

(మొదటిపేజీ తరువాయి) అధ్యక్షుడు రాహుల్ గాంధీ సీరియస్‌గా ఉన్నట్లుగా ఉన్న ముఖ కవళికల ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఈనేపథ్యంలో దీనిపై అమిత్ షా చెణుకులు విసిరారు. "తరచూ 'గర్జించే' ప్రతిపక్ష నాయకులు శుక్రవారం పీయూష్ గోయల్ బడ్జెట్‌ను సమర్పిస్తున్నపుడు చాలా సీరియస్‌గా కనిపించారు. మీరు (రాహుల్) ఎందుకు అంత సీరియస్‌గా ఉన్నారో నాకు అర్థం కావడం లేదు. మీరు ఎందుకు చిరునవ్వు నవ్వలేకపోయారు? రైతుల కోసం చేసిన ప్రకటనలను ఎందుకు ప్రశంసించ లేదు?" అని అమిత్ షా ప్రశ్నించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరాఖండ్‌లోని అన్ని ఎంపీ స్థానాలూ బీజేపీ ఖాతాలో పడేలా చేయాలని పార్టీ కార్యకర్తలను అమిత్ షా కోరారు.

4న లేదా 10న అయోధ్యపై రాహుల్ ప్రకటన?

మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఈ నెల 4న లేదా 10న అయోధ్యలో రామ మందిరం నిర్మాణంపై కీలక ప్రకటన చేసే అవకాశముంది.

4న మౌని అమావాస్య సందర్భంగా రాహుల్, ప్రియాంక కుంభమేళాలో పాల్గొంటారని సమాచారం. ఒకవేళ 4వ తేదీన వీలుకాకుంటే 10వ తేదీన వసంత పంచమి రోజు వీరిద్దరు కుంభమేళాకు వెళ్లి పవిత్ర పుణ్య స్నానాలు ఆచరిస్తారిస్తారు. అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితమైన ప్రియాంక గాంధీ, తూర్పు ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరిస్తారు. లక్నోలో జరిగే ఈ కార్యక్రమంలో రాహుల్‌తో కలిసి మీడియా సమావేశంలో పాల్గొంటారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో యూపీ వేదికగా బీజేపీకి రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చే అవకాశముంది. అయోధ్యలోని రామాలయం నిర్మాణంపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సంధించిన ప్రశ్నకు రాహుల్ ఆ రోజు ధీటైన సమాధానం ఇస్తారని తెలుస్తోంది.

అయోధ్యపై త్వరలో కేంద్రం కీలక నిర్ణయం?

మరోవైపు అయోధ్యపై కేంద్రం తర్వలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. రామ మందిర నిర్మాణంపై శివసేన, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీతో పాటు పలు హిందూ సంస్థల నుంచి ఒత్తిడి పెరుగుతుండటమే దీనికి ప్రధాన కారణం. కుంభమేళా జరుగుతున్న ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో శుక్రవారం వీహెచ్‌పీ నిర్వహించిన ధర్మసంసద్‌లో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ చీఫ్‌కు రామాలయం సెగ తగిలింది. మోహన్ భాగవత్ ప్రసంగిస్తుండగా.. రామాలయం నిర్మించాలంటూ నినాదాలు మిన్నంటాయి. నిర్మాణం తేదీ చెప్పాలంటూ దేశం నలుమూలల నుంచి వచ్చిన సాధువులు, హిందూ సంస్థలకు చెందిన వారు డిమాండ్ చేశారు. సత్వరం మందిరం నిర్మించాలని నినాదాలతో హోరెత్తించారు. దీంతో ఎట్టి పరిస్థితుల్లోనూ నాలుగు నెలల్లో మందిర నిర్మాణం పనులు మొదలవుతాయని మోహన్ భగవత్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టకపోతే తామే రామాలయ నిర్మాణం పనులు చేపడతామన్నారు. బీజేపీ తీరుపై ఆయన స్పందిస్తూ.. 'ఓట్లు కోసమే కొందరు మందిరం మాట మాట్లాడుతున్నారు. అయితే హిందూ మత విశ్వాసాలను వాళ్లు పరిగణనలోని తీసుకుని మందిర నిర్మాణం జరపాలి. దీనిపై 34 నెలల్లో నిర్ణయం తీసుకున్నారో మంచిదే, లేదంటే నాలుగు నెలల తర్వాత మందిర నిర్మాణం పనులు ప్రారంభమవుతాయి' అని భాగవత్ అన్నారు. దీంతో జనమంతా ఒక్కసారిగా జై శ్రీరామ్ నినాదాలు చేస్తూ అయోధ్యలో రామాలయ నిర్మాణ ప్రారంభం తేదీ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఫిబ్రవరి 21నే రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని బుధవారం ఇదే వేదిక నుంచి శంకరాచార్య స్వరూపానంద సరస్వతి సంచలన ప్రకటన చేశారు. దీని కోసం బుల్లెట్లను ఎదుర్కోడానికైనా సరే తాము సిద్ధమేనన్నారు. హిందువులంతా ఒక్కొక్కరు నాలుగు ఇటుకలు పట్టుకుని ఫిబ్రవరి 21న అయోధ్యకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. వసంతపంచమి రోజైన ఫిబ్రవరి 10న సాధువులంతా అలహాబాద్ నుంచి అయోధ్యకు యాత్రను ప్రారంభిస్తారన్నారు. ప్రభుత్వం, సుప్రీంకోర్టు అంటే తమకు గౌరవం ఉందనీ, అయితే ఇప్పుడు తాము రామాలయ నిర్మాణం ప్రారంభించకపోతే ఇంకెప్పటికీ కుదరకపోవచ్చని శంకరాచార్య స్వరూపానంద సరస్వతి స్పష్టం చేశారు. సాధారణ ఎన్నికల వేళ మిత్రపక్షమైన శివసేనతోపాటు మాతృసంస్థ ఆర్ఎస్ఎస్, హిందూ సంస్థల నుంచి బీజేపీపై తీవ్ర వ్యతిరేక వ్యక్తమవుతోంది. ఈనేపథ్యంలో కేంద్రం అయోధ్యపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇందులో భాగంగానే అయోధ్యలో గతంలో సేకరించిన వివాదరహిత భూమి ని తిరిగి వాస్తవ యజమానులకు అప్పగిం చేందుకు అనుమతివ్వాలంటూ సుప్రీంకోర్టులో కేంద్రం పిటిషన్ వేసింది. దీనిపై సర్వోన్నత న్యాయం స్పందన కోసం ఎదురు చూస్తున్న మోదీ ప్రభుత్వం.. బడ్జెట్ సమావేశాల తర్వాత కీలక నిర్ణయం ప్రకటించే అవకాశముంది.

రాముడి వేషంలో.. రాహుల్ పోస్టర్

పాట్నా: రాముడి వేషంలో రాహుల్ గాంధీ పోస్టరు సంచలనం రేపుతోంది. బిహార్ రాష్ట్రంలో వెలుగుచూసింది. ఆదివారం పాట్నాలోని గాంధీ మైదానంలో జరిగే జన ఆకాంక్ష ర్యాలీలో రాహుల్ గాంధీ ప్రసంగించనున్న నేపథ్యంలో రాముడిలా రాహుల్ పోస్టరు ఏర్పాటు చేయడం కలకలం రేపింది.

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రాముడిగా ఉన్న ఈ పోస్టరులో యూపీఏ ఛైర్ పర్సన్ సోనియా గాంధీతోపాటు మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ , ఇతర ప్రముఖ కాంగ్రెస్ నేతల ఫోటోలు కూడా ఉన్నాయి. అధికార బీజేపీ పార్టీ నేతలు రామనామ జపం చేస్తుంటారు... కాని రాహుల్ రాముడిగా మారి జీవించాలని అందులో పేర్కొన్నారు. కాగా రాహుల్ ను రాముడిలా చూపించి బీహార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మదన్ మోహన్ తోపాటు మరో నలుగురిపై కొందరు ఫిర్యాదు చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీశారంటూ పాట్నా సివిల్ కోర్టులో రాహుల్ కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ చౌకబారు రాజకీయాలు చేస్తోందని బీహార్‌లోని అధికార జేడీయూ పార్టీ నేతలు ఆరోపించారు.

అందుకే రాముడికి వెక్కిళ్లు...

శ్రీరాముడుకి కూడా స్వర్గంలో వెక్కిళ్లు వచ్చాయట.. ఇందుకు కారణం ఏమై ఉంటుంది? అని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ప్రశ్నించారు. శనివారం గురుగ్రామ్ లో జరిగిన ర్యాలీలో బీజేపీని వ్యంగ్యంగా విమర్శించారు. 'రాముడికి స్వర్గంలో వెక్కిళ్లు వచ్చాయి. దీనికి కారణం ఏమిటని సీతమ్మ ఆయనను అడిగింది. ఎన్నికలు దగ్గరపడుతుండటంతో బీజేపీ తన గురించి ఆలోచిస్తోందంటూ రాముడు జవాబిచ్చాడు' అని తేజస్వి యాదవ్ బీజేపీపై వ్యంగ్యోక్తులు గుప్పించారు. సార్వత్రిక ఎన్నికలు వస్తుండటంతో రాజకీయ ప్రయోజనాల కోసం మళ్లీ సున్నితమైన రామాలయం అంశాన్ని బీజేపీ లేవనెత్తుతోందని ఆయన మండిపడ్డారు. మతపరంగా దేశాన్ని విడగొట్టే ప్రయత్నాలు చేస్తున్న బీజేపీతో తాము చేతులు కలపనందునే తన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్‌తోపాటు తమపై సీబీఐ, ఈడీలను బీజేపీ ఉసిగొలుపుతోందని ఆయన ఆరోపించారు. మోదీ కాపలాదారు అయితే దేశప్రజలు రక్షక భటులని తేజస్వి యాదవ్ అన్నారు.

మాజీ కార్పొరేటర్ నందరాజ్‌గౌడ్‌కు ఘన నివాళులు

విజయక్రాంతి, అంబర్‌పేట్: బీజేపీ నాయకుడు మాజీ కార్పొరేటర్ కే.శే.ఎం.నందరాజ్‌గౌడ్ 26వ వర్ధంతి సందర్భంగా అయ్యప్పగుడి రోడ్డులో ఉన్న ఆయన స్మారక స్థూపం వద్ద ఘనంగా సికింద్రాబాద్ ఎంపీ బండారు దత్తాత్రేయ, అంబర్‌పేట్ మాజీ ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి నివాళులర్పించారు. అంబర్‌పేట్ యువమోర్చ ఆధ్వర్యంలో సభ నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బీజేపీ చురుకైన నాయకుడు కే.శే.ఎం.నందరాజ్‌గౌడ్‌ను కొల్పవడం చాలా బాదకరమైన విషయమని ఈ సంఘటన వారి కుటుంబానికి తీరనిలోటని అన్నారు. తీవ్రవాదుల విషయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ మెతక వైకరివలన దేశంలో వారు పెట్రెగిపోయారని అన్నారు. బీజేపీ నరేంద్రమోడి ప్రభుత్వం ఏర్పాడిన తరువాత ఉక్కుపాదముతో తీవ్రవాదులను కాశ్మీర్ నుండి మొదలుకొని అన్ని ప్రాంతములలో అణిచివేయడం జరిగిందని అన్నారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తీవ్రవాదులకు మతం ముసుగులా మద్దతు పలికే మజ్లీస్ పార్టీతో జతకట్టి టీఆర్ఎస్ పార్టీకి ఎప్పటికైన భారీ మూల్యం చెల్లించక తప్పదని నందరాజ్‌గౌడ్ అడుగుజాడలలో కార్యకర్తలు ముందుకు వెళ్ళడమె వారికి ఘనమైన నివాళి అన్నా రు. అనంతరం అంబర్‌పేట్ మహంకాళి దేవాలయం గుడి వద్ద పెడూ రి కృష్ణగౌడ్, అలోక్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

భట్టి ముందే బాహాబాహీ..

(మొదటిపేజీ తరువాయి) కలిసి ఆందోళన చేపట్టాడు. వెంటనే వీహెచ్ తనకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

శ్రీకాంత్‌ను తొలగిస్తూ ఓబీసీ చైర్మన్ ఆదేశాలు

అనంతరం వీహెచ్ పై బేగం బజార్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇక ఈ గొడవ గురించి వీహెచ్ మాట్లాడుతూ...టికెట్ రానివారంతా ఇలా దాడులకు పాల్పడాలా అంటూ ప్రశ్నించారు. నాకు కూడా టికెట్ రాలేదు నేనేం చేయాలి అంటూ ఆవేధన వ్యక్తం చేశారు. ఇలా చేయడం పద్ధతి కాదన్నారు. ఈ విషయంపై క్రమశిక్షణ కమిటికి ఫిర్యాదు చేయడంతో నూతి శ్రీకాంత్‌ను తొలగిస్తూ టీపీసీసీ ఓబీసీ చైర్మన్ చిత్తరంజన్ దాస్ అదేశాలు జారీ చేశారు.

పదవులు పందేరం పై సీఎం కసరత్తు

(మొదటిపేజీ తరువాయి) రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలు అయినా భద్రాచలం, బాసర తదితర దేవాలయాలకు కూడా అర్హులు అయినా వారితో పాలకమండలలను నియమించాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు.

మూడోవారంలో శాసనసభ సమావేశాలు

రాష్ట్ర శాసన సభ ఈనెల మూడో వారంలో సమావేశం అయ్యే అవకాశం ఉంది. కేంద్ర పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశపెట్టనందున ఈ సమావేశాలలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ను ప్రవేశపెడతారు. ఈ మేరకు ఆర్థిక శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.రాష్ట్రం పూర్తిస్థాయి మంత్రివర్గం త్వరలో ఏర్పాటు అయితే అన్ని శాఖలకు నుంచి వివరాలు తెప్పించుకొని బడ్జెట్ లో పొందుపరుస్తారని ఉన్నతాధికారి ఒకరు తెలిపేరు.ఈనెల 18నుంచి 20వరకు రాష్ట్రంలో ఆర్థిక సంఘం అధికారులు పర్యటించనున్నారు. 18, 19న ఆర్థిక సంఘం రాష్ట్ర అధికారులతో సమావేశం కానుంది. 20న ప్రణాళిక సంఘం అధికారులు ప్రాజెక్టులను సందర్శించనున్నారు. అధికారులు చేసిన సూచనల మేరకు ప్రభుత్వం మూడో వారంలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలన్న ఆలోచనలకు వచ్చింది.

సీబీఐ కొత్త చీఫ్ రిషి కుమార్ శుక్లా

విజయక్రాంతి, న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ కొత్త చీఫ్‌గా ఐపీఎస్ అధికారి రిషి కుమార్ శుక్లా నియమితులయ్యారు. శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సీబీఐ నూతన డైరెక్టర్‌గా ఆయనను ఎంపిక చేసింది. సుప్రీంకోర్టు సీజే రంజన్ గొగోయ్, లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత మల్లికార్జున్ ఖర్గే కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. అయితే శుక్లా ఎంపికపై ఖర్గే అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ప్రధాని నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఆయన పట్ల మొగ్గుచూపింది. శుక్లా నియామకాన్ని కేబినెట్ నియామకాల కమిటీ కూడా ఆమోదించింది. మధ్యప్రదేశ్ కేడర్ 1983 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ ఆఫీసర్ రిషి కుమార్ శుక్లా, రెండేళ్ల పాటు సీబీఐ చీఫ్ పదవిలో కొనసాగనున్నారు. తాత్కాలిక డైరెక్టర్ ఎమ్. నాగేశ్వరరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. శుక్లా గతంలో మధ్యప్రదేశ్ డీజీపీగా పనిచేశారు. కాగా సీబీఐ డైరెక్టర్ పోస్టుకు 1984 బ్యాచ్‌కు చెందిన జావేద్ అహ్మద్, రజనీ కాంత్ మిశ్రా, ఎస్ఎస్ దేశ్వాల్ పేర్లు కూడా వినిపించినా సెలక్షన్ కమిటీ సీనియార్టీకే ప్రాధాన్యత ఇచ్చింది. గత నెల 24న ఢిల్లీలో ప్రధాని మోదీ నివాసంలో జరిగిన సెలక్షన్ కమిటీ మొదటి సమావేశం ఏ నిర్ణయం తీసుకోకుండానే అసంపూర్ణంగా ముగిసింది. దీంతో శనివారం జరిగిన రెండో సమావేశంలో సీబీఐ కొత్త బాస్‌పై కమిటీ తుది నిర్ణయం తీసుకుంది.

సీబీఐకు పూర్వ వైభవం పెద్ద సవాల్

వివాదాలతో మసకబారిన సీబీఐకు పూర్వ వైభవాన్ని తీసుకురావడం సీబీఐ కొత్త డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా ముందున్న అతి పెద్ద సవాల్. గత ఏడాది చివర్లో సీబీఐ మాజీ చీఫ్ అలోక్ వర్మ, జాయింట్ జాయింట్ డైరెక్టర్ రాకేశ్ అస్థానా మధ్య వివాదం జరగడంతో కేంద్రం కలగజేసుకొని వారిద్దరిని సెలవుపై పంపించింది. దీంతో అలోక్‌శర్మ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చినా కేంద్రం ఆయనపై బదిలీ వేటు వేసింది. సుప్రీం జోక్యంతో ఏర్పడిన సెలక్షన్ కమిటీ అలోక్ వర్మను ఫైర్ విభాగానికి డీజీగా బదిలీ చేసింది. అయితే ఆ బాధ్యతలు స్వీకరించడం ఇష్టం లేని అలోక్ వర్మ తన సర్వీసెస్‌కు రాజీనామా చేశారు. కాగా సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వరరావును మరోసారి నియమించడం కూడా వివాదానికి దారితీసింది.

దేశ అత్యున్నత దర్యాప్తు సంస్థను తాత్కాలిక డైరెక్టర్‌తో నడిపించడంపై శుక్రవారం సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే పూర్తి స్థాయి డైరెక్టర్‌ను నియమించాలని కేంద్రాన్ని ఆదేశించింది. దీంతో జనవరి 10 నుంచి ఖాళీగా ఉన్న సీబీఐ డైరెక్టర్ పదవికి శుక్లాను సెలక్షన్ కమిటీ ఖరారు చేసింది. ప్రధాని, సీజేఐ ఆమోదంతో 2–1 మెజారిటీతో రిషికుమార్‌ను సీబీఐ నూతన డైరెక్టర్‌గా రిషి కుమార్‌ను ఎంపిక చేసినట్టు కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది.

ఒక మోదీ... ముగ్గురు మహిళలు

(మొదటిపేజీ తరువాయి) ఇప్పటికే పలుమార్లు విపక్షాలతో చర్చలు జరిపిన దీదీ.. ఇటీవల బెంగాల్ వేదికగా విపక్ష పార్టీలతో భారీ బహిరంగ సభ నిర్వహించి బీజేపీకి అల్టిమేటం జారీ చేశారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి రావాలంటే బెంగాల్లో తృణమూల్ పార్టీని ఢీకొనక తప్పదు.దీంతో మమత నుంచి మోదీ గట్టి పోటీనే ఎదుర్కొంటున్నారు. బెంగాల్లో మొన్నటి వరకు వామపక్షాలు, తృణమూల్ మధ్య జరిగిన వార్ ఇప్పుడు బీజేపీ, తృణమూల్ మధ్య నువ్వా నేనా అనే విధంగా సాగుతోంది. బెంగాల్లో పట్టుసాధించాలంటే మమతకు చెక్ పెట్టాలని బీజేపీ భావిస్తోంది. మరోవైపు బీజేపీ లాంటి మతతత్వ పార్టీలకు బెంగాల్లో స్థానం లేదంటూ మమత విమర్శల దాడిని ఉధృతం చేశారు. ఫలితంగా బీజేపీ, తృణమూల్ మధ్య పోరు ఆసక్తిగా మారింది.

కీలక రాష్ట్రం యూపీలో చక్రం తిప్పుతున్న మాయా

ఎన్నికల వేళ బీజేపీకి సవాలు విసురుతున్న మరో బలమైన మహిళా నేత బీఎస్పీ అధినేత్రి మాయావతి. కీలకమైన రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్లో ఎస్పీ, బీఎస్పీలు పొత్తుపెట్టుకుని బీజేపీని ఢీకొనేందుకు సిద్ధమెయ్యాయి. దళితులు, బీసీల ఓట్ల శాతం ఎక్కువగా ఉన్న యూపీలో మాయావతి ప్రభావం చాలామేరకు ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వీరిద్దరూ కలవడం వల్ల బీజేపీకి కొంత నష్టం తప్పదని చెప్తున్నారు. యూపీలో పాటు, బెంగాల్, బిహార్ రాష్ట్రాల్లో బీఎస్పీకి కొంతపట్టుంది. దీంతో ఆయా రాష్ట్రాల్లో మాయావతిని బీజేపీ ఎదుర్కోవాల్సి ఉంటుంది. గత కొంతకాలంగా మోదీపై విమర్శల దాడి చేయడంలో మాయా, మమత తీవ్రంగా పోటీ పడుతున్నారు. జాతీయ స్థాయిలో వీరిద్దరు కలిస్తే మోదీకి కష్టమేనని విశ్లేషకుల మాట.

మెరుపులా వచ్చిన తురుపు ముక్క ప్రియాంక

ఇక లోకసభ ఎన్నికల ముందు మెరుపులా వచ్చిన కాంగ్రెస్ తురుపు ముక్క ప్రియాంక గాంధీ కూడా ఎన్నికల రణరంగంలో సై అంటున్నారు. జాతీయ రాజకీయాల్లో గాంధీ కుటుంబానికి విశిష్టమైన స్థానముంది. ఇందిరా, సోనియా తరువాత గాంధీ కుటుంబం నుంచి వచ్చిన మరో మహిళా నేత ప్రియాంక. కీలమైన ఎన్నికల వేళ కాంగ్రెస్ సంధించిన బాణంగా ప్రియాంక ఎంట్రీని విశ్లేషిస్తున్నారు. ఇప్పటివరకు రాహుల్, సోనియా సభల్లోనే పాల్గొన్న ప్రియాంక.. మోదీని ఢీకొట్టేందుకు ప్రత్యక్ష రాజకీయల్లోకి దూసుకువచ్చారు. కీలకమై యూపీలో పార్టీ బాధ్యతలను ఆమె చేపట్టనున్నారు. ఇలా ముగ్గురు బలమైన మహిళా నేతలను లోక్సభ ఎన్నికల ముందు నరేంద్ర మోదీ ఎదుర్కోవాల్సి ఉంది. ఈ ఎన్నికల్లో వారు ఏ మేరకు ప్రభావం చూపుతారో తేలాలంటే ఎన్నికల ఫలితాల దాకా ఆగాలి.

అంతర్జాతీయ సైన్స్ టెస్ట్‌కి ఎంపికైన ఆదర్శ విద్యాలయ హైస్కూల్ విద్యార్థినీ ఎస్.దుర్గాశ్రీ.



విజయక్రాంతి, రాజేంద్రనగర్: క్యానాలేడ్జ్ ఆప్టిట్యూడ్ టాలెం ట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయిలో రెండవ స్థానంలో నిలిచిన ఎస్.దుర్గాశ్రీని పాఠశాల యాజమాన్యం శనివారం శాలువతో ఘనంగా సన్మానించింది. రాజేంద్రనగర్‌లోని ఆదర్శ విద్యాలయ హైస్కూల్‌లో 9వ తరగతి చదివే ఎస్.దుర్గాశ్రీ చిన్నప్పటి నుంచి చదువుతో పాటు ఇతర అన్ని రంగాల్లో తన ప్రతిభను చాటుతుంది. హంకాంగ్‌లో జరిగే అంతర్జాతీయ పరిశోధన కేంద్రంలో జరిగే పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు.

పలు రైళ్ల రద్దు

విజయక్రాంతి, హైదరాబాద్: గూడూరు జంక్షన్ వద్ద నాన్ ఇంటర్‌లాకింగ్ వర్క్, ఫలక్‌నుమా – కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య వెల్డింగ్ పనుల నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేశారు. ఫిబ్రవరి 3న ఫలక్‌నుమా – కాచిగూడ స్టేషన్ల మధ్య ఆరు డెము, ఎంఎంటీఎస్ సర్వీస్‌లను రద్దు చేశారు. ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు గూడూరు – తిరుపతి డెము, బిట్రగుంట – చెన్నై సెంట్రల్, చెన్నై సెంట్రల్ – గూడూరు ప్యాసెంజర్‌లు రద్దయ్యాయి. ఫిబ్రవరి 4 నుంచి 6వ తేదీ వరకు తిరుపతి – గూడూరు మెము, గూడూరు – రేణిగుంట మెము, రేణిగుంట – గూడూరు మెము ప్యాసెంజర్‌లను పూర్తిగా రద్దు చేశారు. ఫిబ్రవరి 4 నుంచి 6వ తేదీ వరకు గూడూరు – విజయవాడ ప్యాసెజర్‌ను గూడూరు – బిట్రగుంటల మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

విజయక్రాంతి, శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 10 మందికి శనివారం ఎమ్మెల్యే గాంధీ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. త్వరలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామన్నారు.

నాణ్యతతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

- మేడ్చల్ శాసన సభ్యులు మల్లారెడ్డి



విజయక్రాంతి, బోడుప్పల్: నాణ్యతతో ఇళ్లను నిర్మించి ఇస్తే అదే వ్యాపార అభివృద్ధికి దోహదం అవుతుందని, ప్రజలకు నమ్మకం కూడా కలుగుతుందని మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం ఉప్పల్ డిపో పరిధిలో తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈస్ట్ హైదరాబాద్ ప్రాపర్టీ షోకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు నిర్మాణ రంగం మొత్తం కూడా ఈస్ట్ హైదరాబాద్ వైపు పరుగులు తీస్తుందని అన్నారు. వరంగల్ హైవే మరియు కరీంనగర్ హైవేలతో పాటుగా రింగ్ రోడ్లు అతీ సమీపంలో ఉండడం మూలాన ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. బిల్డర్స్ కూడా అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేరా చైర్మన్, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజేష్ తివారి మాట్లాడుతూ నిజాయితితో నిర్మాణాలు చేపడితే ప్రజలు ఆదరిస్తారని అన్నారు. కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు కె. జానార్ధన్‌రెడ్డి, స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ రవీందర్ గౌరవ్, జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణ మోహన్‌రెడ్డి, తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జె. వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎన్నికై అవార్డు అందుకున్న సందర్భంగా ఎంపీ కవితను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, సాంఘీక సంక్షేమ బోర్డు చైర్‌పర్సన్ రాగం సుజాత యాదవ్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. –విజయక్రాంతి, శేరిలింగంపల్లి

కాకినాడ టౌన్‌కు ప్రత్యేక రైళ్లు

విజయక్రాంతి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ నుంచి కాకినాడటౌన్‌కు ప్రత్యేక రైళ్లను నడుపనుంది. సికింద్రాబాద్–కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఫిబ్రవరి 7, 9, 15, 21 తేదీల్లో సికింద్రాబాద్ నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6. 25 గంటలకు చేరుకుంటుంది. కాకినాడ టౌన్ – సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఫిబ్రవరి 8, 10, 17, 24 తేదీల్లో రాత్రి 10.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుటుంది. హైదరాబాద్ –కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఫిబ్రవరి 5న హైదరాబాదు నుంచి సాయంత్రం 6. 50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. కాకినాడ టౌన్ – హైదరాబాద్ ప్రత్యేక రైలు కాకినాడ టౌన్ నుండి రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.15 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. మార్గంమధ్యలో ఈ రైళ్లు కాజీపేట్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లి గూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, సామల్లకోట స్టేషన్‌లలో ఆగుతుంది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



విజయక్రాంతి, ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజక వర్గంలోని గాంధీనగర్, అడిక్‌మెట్ డివిజన్‌లో బాపునగర్, పద్మకాలనీలో సీసీ రోడ్డు పనులు, కమిటీహాల్ మొదటి అంతస్తుకు శనివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ శంకుస్థాపన చేసారు. కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఓటు నమోదును పరిశీలించిన డిప్యూటీ కమిషనర్



విజయక్రాంతి, మెహిదిపట్నం: నాంపల్లి నియోజకవర్గంలో ఓటు నమోదు చేసుకొన్న వారి వివరాలను సర్కిల్ 12 డిప్యూటీ కమిషనర్ ఇన్‌కేషాత్ అలీ ఇంటింటికీ తిరిగి దరఖాస్తులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదు కార్యక్రమంలో ఓటరు నమోదు చేసుకున్న వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ విజయ్‌కుమార్, బీఎల్‌ఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై రాజకీయ పార్టీలతో సమావేశం

విజయక్రాంతి, మెహిదిపట్నం: రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటు నమోదు కార్యక్రమం, బోగస్ ఓట్ల తొలగింపు, ఇతర సమస్యలపై జీహెచ్‌ఎంసీ సర్కిల్ 13 డిప్యూటి కమిషనర్ సుదామ్ష రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 3 వ తేదిన ఓటు నమోదు పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ 13 ఎఎంసీ గోపి, జగన్, సత్యనారాయణ, ఇతర సిబ్బందితో పాటు పలు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు హాజరయ్యారు.



నిరుద్యోగులకు నిరాశే...

గత 45 ఏళ్లలో ఎన్నడూ లేనంత గరిష్ట స్థాయికి దేశంలో నిరుద్యోగ సమస్య చేరుకుందని, 2017–18 ఆర్థిక సంవత్సరంలో నిరుద్యోగ సమస్య 6.1 శాతానికి చేరుకుందని నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ నివేదిక వెల్లడించింది. ఈ సమస్య 2019 సంవత్సరానికి ఎనిమిది శాతానికి కూడా చేరవచ్చని సర్వే అంచనా వేసింది. దేశంలో యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నరేంద్ర మోదీ హామీ ఇవ్వడంతో ఎక్కువ మంది నిరుద్యోగ యువత నాడు ఆయన పార్టీకే ఓటు వేసింది. ముఖ్యంగా మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్న 15 కోట్ల మందిలో ఎక్కువ శాతం మంది బీజేపీకి ఓటు వేయడం వల్ల ఆ పార్టీకి 31 శాతం ఓట్లు వచ్చాయి. 2019 ఎన్నికల్లో 13 కోట్ల మంది మొదటిసారి ఓటు వేయబోతున్నారు. గ్రామీణ ప్రాంతాలకన్నా పట్టణ ప్రాంతాల్లో స్త్రీ, పురుషుల్లో నిరుద్యోగ శాతం గణనీయంగా పెరిగింది. పురుషుల్లో నిరుద్యోగుల సంఖ్య 18.7 శాతానికి చేరుకోగా, మహిళల్లో ఏకంగా 27.2 శాతానికి చేరుకుంది. గతేడాది రైల్వేలో 63 వేల దిగువ, మధ్య స్థాయి ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానించగా ఏకంగా కోటీ 90 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో పీహెచ్‌డీలు కూడా చేసిన నిరుద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉండడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిరుద్యోగ సర్వే వివరాలను బహిర్గతం చేసేందుకు అనుమతించలేదు. అనధికారికంగా నివేదికలోని అంశాలు వెలుగు చూశాయి. మోదీ ప్రభుత్వం కొత్తగా పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రతిపాదనల్లో రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వివిధ వర్గాలను మెప్పించేందుకు ప్రయత్నించింది. అయితే ఆ ప్రతిపాదనల్లో నిరుద్యోగుల ఊసు లేకపోవడం శోచనీయం. ఈ నేపథ్యంలో 2014లో మొదటిసారి ఓటు హక్కును వినియోగించిన నిరుద్యోగుల్లో, 2019లో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకుంటున్న నిరుద్యోగుల్లో ఎంత మంది బీజేపీ పార్టీకి ఓటు వేస్తారో చూడాలి.

ఋణ మాఫీనా లేక నగదు సాయమా?

దేశ వ్యాప్తంగా రైతు ఋణ మాఫీ ఒక ఎన్నికల అస్త్రంగా మారిన సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ తన బడ్జెట్‌లో ఈ ప్రస్తావనను తేకపోవడం చాలా మంది రాజకీయ పండితులను నివ్వెరపరచింది. ఓట్లు దండుకునే సాధనమైన ఋణ మాఫీ జోలికి వెళ్లకుండా ఉండటానికి చాలా దుస్సాహసం కావాలి. నిజానికి ప్రధాని తొలి నుంచీ రైతు ఋణ మాఫీ నిష్ప్రయోజకమని వాదిస్తూనే ఉన్నారు. ఇటీవల వార్తా సంస్థ ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ ఆయన ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు. దీనికి అనుగుణంగానే ఆయన తాజా బడ్జెట్ లో ఋణమాఫీ జోలికి వెళ్లలేదు.

నిజానికి చాలా మంది నిపుణులు రైతుల సమస్యలు తీర్చాలంటే ఋణమాఫీ ఒక్కటే మార్గమని వాదిస్తూ ఉంటారు. ఋణమాఫీ మంచిదా లేక ప్రత్యక్ష నగదు సాయం మంచిదా అన్న విషయంపైనా ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి తన తాజా బడ్జెట్ లో ఋణ మాఫీ బాట పట్టకుండా ప్రత్యక్ష నగదు మార్గాన్ని ఎంచుకోవడం గమనార్హం. నిజానికి జాతీయ స్థాయిలో గుండుగుత్త ఋణమాఫీ మన దేశంలో రెండు సార్లు జరిగింది. రెండవ సారి ఋణమాఫీ 2008లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ చేశారు. దాదాపు 56000 కోట్ల రూపాయలను దీనికోసం కేటాయించారు. అయితే ఈ ఋణ మాఫీ ఫలితాలెలా ఉన్నాయన్నది ఇటీవలే వ్యవసాయ గ్రామీణాభివృద్ధి జాతీయ బ్యాంక్ (నాబార్డ్) అంచనా వేసింది. దేశ వ్యాప్తంగా 92 జిల్లాలలోని 900 బ్యాంకుల నుంచి ఋణాలు తీసుకున్న 90000 మంది రైతులపై నాబార్డ్ ఈ సర్వేను నిర్వహించింది. 2016–17 లో జరిగిన ఈ అధ్యయనం ప్రకారం ఋణ మాఫీ కేవలం 30 శాతం మంది రైతులకు మాత్రమే మేలు చేయగలిగింది. రెండవ ప్రధాన అంశం ఏమిటంటే ఋణమాఫీ పెద్ద కమతాలున్న ధనిక రైతులకు మాత్రమే ఉపయోగపడుతుంది. పేద రైతులకు దీని వల్ల పెద్దగా లాభం ఉండదు. దేశంలో ఇప్పటి వరకూ జరిగిన అన్ని ఋణమాఫీల వల్లా జరిగింది ఇదేనని అధ్యయనాలు తెలుపుతున్నాయి. ధనిక రైతుల లాబీ ఓట్లను ప్రభావితం చేస్తుంది కాబట్టి వారికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ఈ మాఫీలు అమలవుతున్నాయి. ధనిక రైతు ఆదాయం కన్నా ఋణ భారం తక్కువ. కానీ పేద రైతు ఆదాయం కన్నా ఋణభారం తలకు మించిదనవుతోందని నాబార్డ్ నివేదిక స్పష్టం చేసింది. దీని వల్లే ఋణమాఫీలు చేసినా పేద రైతుల ఆత్మహత్యలు ఆగడం లేదన్న విషయాన్ని నివేదిక ప్రస్తావించింది. యూపీఏ హయాంలో ప్రకటించిన ఋణమాఫీ వాస్తవానికి క్షేత్రస్థాయిలో పెద్దగా మేలు చేయలేదని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ నివేదికలు కూడా తెలియచేస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో రైతులకు ఆశించనంత లబ్ధి చేకూరలేదు. అన్నిటికీ మించి బ్యాంకుల నుంచి పంట ఋణాలు తీసుకునే వారు కేవలం 30 శాతం మందేనని నాబార్డ్ సర్వే గుర్తించింది. ఫలితంగా వడ్డీ వ్యాపారులు, ఇతరుల నుంచి ఋణం తీసుకునే 70 శాతం మంది రైతులకు ప్రభుత్వం ప్రకటించే ఋణ మాఫీ ఊరట పొందే వీలే ఉండదు. 30 శాతం మంది రైతులకే వర్తించే, అందునా వారిలోని పెద్ద రైతులకే మేలు చేసే ఋణమాఫీ వల్ల లాభం ఏమిటన్నదే అసలు ప్రశ్న. పైగా ఋణమాఫీ సదుపాయం పొందడం ఆలస్యం కావడం వల్ల రైతులకు కొత్తగా బ్యాంకుల నుంచి ఋణాలు లభించవు. ఇలాంటి నిర్భాగ్య రైతుల సంఖ్య బీహార్, ఆంధ్రప్రదేశ్ లలోనే ఎక్కువగా ఉందని నాబార్డ్ సర్వే పేర్కొన్నది.

నిజానికి రైతుల సమస్యలు తీర్చాలంటే ఇన్ పుట్ మార్కెట్ రెగ్యులేషన్, అవుట్ పుట్ మార్కెట్ రెగ్యులేషన్ అంటే వ్యవసాయ పెట్టుబడి నియంత్రణ, వ్యవసాయోత్పత్తుల అమ్మకాల నియంత్రణ వ్యవస్థలు సజావుగా ఉండాలి. ప్రధాని నరేంద్ర మోదీ గత నాలుగు సంవత్సరాల్లో ఈ పనిపై శ్రద్ధ పెట్టారు. ఫలితంగా నాణ్యమైన విత్తనాలు, కల్తీ లేని ఎరువుల లభ్యత పెరిగింది. యూరియా బ్లాక్ మార్కెట్‌లోకి పోకుండా ఆపడం సాధ్యమైంది. రైతులకు ఋణ సదుపాయాన్ని సమర్థవంతంగా అందించే దిశగా చర్యలు చేపట్టడం జరిగింది. భూసార పరీక్షల నుంచి, కిసాన్ క్రెడిట్ కార్డు దాకా చేపట్టిన చర్యలు వ్యవసాయ పెట్టుబడుల నియంత్రణ సాధించగలిగింది. అదే విధంగా ఈ– మార్కెట్ వంటి వ్యవస్థల ద్వారా వ్యవసాయోత్పత్తుల అమ్మకాలలో మధ్యదళారీలను నియంత్రించ గలిగింది. కనీస మద్దతు ధరను పంట పెట్టుబడికి రెండున్నర రెట్లు ఉండేలా చేయడం కూడా ఒక విప్లవాత్మక చర్యే. నిజానికి రాష్ట్రాల్లో ఉన్న లాబీలు ఈ పనిని అడ్డుకునేందుకు శతథా ప్రయత్నించాయి. కానీ మోదీ దీనిని సాహసోపేతంగా, పట్టుదలతో చేయగలిగారు.

ఈ రెండింటి వల్ల భారత చరిత్రలో తొలిసారి రైతుకు ఆదాయం పెరుగుతున్నా వినియోగదారులకు వస్తువులు తక్కువ ధరలకు లభ్యం అవుతున్నాయి. ఇది నిజానికి చాలా మంది నిపుణులు గుర్తించని ఘన విజయం. ఈ సంతులనాన్ని సాధించడం భారత దేశంలో దాదాపు అసాధ్యమనే అంతా భావించారు. అలాంటిది దీన్ని మోదీ చేసి చూపించగలిగారు.

నిజానికి ఇప్పుడు రైతుల ఖాతాలో నేరుగా రూ. 6000 వేయబోతున్నట్టు ప్రధాని మోదీ చేసిన ప్రకటన కూడా ఇన్ పుట్ మార్కెట్ రెగ్యులేషన్ పరిధిలోకే వస్తుంది. ఈ పథకం అయిదు ఎకరాలకు లోబడి ఉన్న కమతాలకే వర్తింప చేయడం ద్వారా తొలిసారి మోదీ రైతాంగంలోని క్రీమీలేయర్‌కి అనవసర ప్రయోజనం కలగకుండా చూశారని చెప్పాలి. పేద రైతులకు పంట పెట్టుబడి సాయంగా ఈ మొత్తం పనికి వచ్చేలా ఆయన ప్రయత్నిస్తున్నారు. ఇది నిజంగా అభినందనీయం.

ప్రత్యక్ష నగదు పెట్టుబడి సాయం క్రెడిట్ తమదంటే తమదని రాజకీయ పార్టీలు వాదిస్తున్నాయి. కానీ వాస్తవం ఏమిటంటే 2005 ప్రాంతంలోనే బ్రెజిల్ దీనిని విజయవంతంగా అమలు చేసింది. దానిని ప్రపంచవ్యాప్తంగా పలు వర్ధమాన దేశాలు అనుసరించాయి. దీనినే 2009 ఎన్నికల సమయంలో తెలుగుదేశం తరపున చంద్రబాబు తనయుడు లోకేశ్ దీనిని తెరమీదకు తీసుకువచ్చారు. ఆ తరువాత 2017 మార్చి నెలలో వైఎస్ జగన్ పార్టీ ప్లీనరీలో రైతు భరోసా పేరిట ఇదే పథకాన్ని ప్రకటించారు. మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్, కేసీఆర్‌లు కూడా ఇదే విధానాన్ని స్వీకరించారు. అయితే ఈ మొత్తం పథకం విజయం సాధించాలంటే సేవలను అందించే వ్యవస్థ (సర్వీస్ డెలివరీ మెకానిజం) సజావుగా సాగాలి. ఆ దిశగా చర్యలు తీసుకోవడం చాలా అవసరం.

అందని కేసీఆర్ కిట్లు..

ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు చేయించుకుంటే కేసీఆర్ కిట్, రూ.12వేలు వస్తాయని చెప్పడంతో చాలా మంది మహిళలు ప్రసూతి కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రులకు వెళ్తున్నారు. కాన్పు జరిగినప్పటికీ కిట్లు లేవంటుండటంతో చాలామంది బిడ్డకు కావల్సిన నూనె, సబ్బులు, బట్టలు బయట కొనుక్కుంటున్నారు. ప్రస్తుతం స్టాక్ లేదని, పదిరోజుల తర్వాత వచ్చి తీసుకెళ్ళమని డాక్టర్లు చెపుతున్నారు. అయితే వెళ్ళిన ప్రతిసారీ స్టాకు లేదు మళ్ళీ రండి అనే సమాధానమే వస్తోంది. దాదాపు నెలరోజుల నుంచి కేసీఆర్ కిట్ల పంపిణీ చేయటం లేదు. కిట్లు, డబ్బు అందకపోవడంతో ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య తగ్గిపోతోంది. ఈ పథకంతో ప్రభుత్వానికి మంచి పేరొచ్చింది. కొంతకాలంగా ఈ పథకం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోంది. అధికారులు తగిన చర్యలు తీసుకుని కేసీఆర్ కిట్లను అందజేయాలి.

–సుజాత, మహబూబ్‌నగర్

అందరి సంక్షేమానికి అందరూ కలవండి



17- ఏకీకరణ

ఐక్యం అంటే ఏకత్వం. సంయోగంలో బలం ఉంటుంది. బొటనవేలు, తక్కిన వేళ్ళు ఏకం అయితే పిడికిలి ఏర్పడుతుంది. విడివిడిగా వేళ్ళు అంత బలమైనవి కాకపోయినా, కలసి పిడికిలిగా మారినప్పుడు బలోపేతమై ఇబ్బందులను నాశనం చేయగలదు. కనుక చేతులను, అడుగులను, బుద్ధులను, మనస్సులను కలిపి, ఏకం చేసి అంతులేని క్రమప్రగతిశీలక శక్తిని కలిగిస్తూ, అందరి సంక్షేమం కోసం అందరూ కలవండి.

వ్యక్తిగత సిపాయిల కవాతును ఏకీకృతం చేస్తే, విశ్వాసపూరిత, సమిష్టికృషి చైతన్యంకల సమూహకవాతు అవుతుంది.

భారతదేశప్రజలందరూ భాష, రాష్ట్రం, కులం, తరగతి, మతం, విభాగాలను మరచి కలసిపోతే ఓ అద్భుతమైన భారతదేశం అవతరిస్తుంది.

తరగతిలోని విద్యార్థులందరూ ఏకత్వంతో, శ్రేష్ఠతతో అధ్యయనం చేసి, శ్రేష్ఠతమమైన ఫలితాలను సాధించగలిగితే విద్యావిధానంలో ఒక క్రొత్త మైలురాయిని ఏర్పరచగలరు.

కుటుంబసభ్యులందరూ తమని తాము సంఘటిత పరచుకుంటూ అద్భుతానందగృహం ఆవిష్కృతమౌతుంది.

'ఏకీకరణ' తారతమ్యాలను అవగాహనచేసుకుంటూ, సాధారణతలను లీనంచేసుకుంటూ, శక్తులను కలుపుకుంటూ, పరస్పరాంగీకారాలతో, పరస్పర కృషితో, ప్రగతితో సృష్టింపబడుతుంది.

అన్ని మతాలూ ఏకంగా పరిణమిస్తే ఆధ్యాత్మికమతంగా ప్రపంచమధురత వాస్తవికంగా రూపొందుతుంది.

ప్రియమైన సుప్రియా! నేనూ, ఉపాధ్యాయ్ అంకుల్ 2003లో 'మతం – సంఘర్షణా? శాంతియా?' అనే కాన్ఫరెన్స్‌లో పాలుపంచుకోవటానికి బ్యాంకాక్‌లోని మహిడోల్ యూనివర్శిటీకి వెళ్ళిన సంగతి నీకు తెలుసుకదా! ఈ కాన్ఫరెన్స్ యూనివర్శిటీ ఆఫ్ పీస్, యునైటెడ్ నేషన్స్, ఏషియా పసిఫిక్ యూనివర్శిటీస్ కలిసి నిర్వహించాయి.

ఈ కాన్ఫరెన్స్‌లో పాలుపంచుకోవడం నాకు అత్యంతానందాన్నిచ్చిన సందర్భం, ఎందుకంటే అక్కడే నేను 'యూనివర్సల్ హ్యూమన్' అనే పద్యాన్ని సమర్పించాను. ఆ పద్యపు తెలుగు రూపాన్ని ఎంతో ప్రేమతో ఇక్కడ ఇస్తున్నాను.

చివరి సమావేశంలో ఈ పద్యాన్ని సమర్పించగా ప్రతిఒక్కరూ ఎంతో ఆనందించారు. సంతోషకరమైన, ఆహ్లాదకరమైన సమయమది. పశ్చిమాన యునైటెడ్ స్టేట్స్, తూర్పున ఉన్న చైనా, ఉత్తరాన ఉన్న మంగోలియా, దక్షిణాన ఉన్న ఆస్ట్రేలియాలకు చెందిన ముప్పై పైచిలుకు దేశాలనుంచీ వచ్చిన ఆధ్యాత్మిక, విద్యాధిక నాయకులందరూ కూడా కేవలం శ్లాఘించటమే కాదు, దృఢపరుస్తూ, సంతకాలు చేశారు.

విశ్వజనీన, ఏకత్వ, ఏకీకరణ, ఏకీకృత మానవుడి ఆత్మ అంతటా పులకరించింది.

కనుక ప్రియమైన సుప్రియా! ఏకీకరణపొందు, ఏకీకృతం చేసి విశ్వజనీన మానవుడివి, ఏకత్వమానవుడివి, ఆనంద, సంతోష, ఆహ్లాదకరవ్యక్తివి కా!

ఏకీకరించు, ఏకత్వంపొందు

ఏకీకరణకు ఏకీకృతమార్గాలు:

1. సాధనకు, కార్యాలకు అధ్యయనసంస్థలను, సమూహాలను ఏర్పరచు.
2. సామూహిక ప్రార్థనలను ఇంటిలో నిర్వహించు.
3. నీ జీవిత భాగస్వామితో, కుటుంబసభ్యులతో వాహ్యాళికి వెళ్ళు.
4. అతిథులు వచ్చినప్పుడు నీ కుటుంబసభ్యులతో కలిసి వంట చేయి.
5. పెద్ద సమూహాలతో కూడిన ప్రార్థనలు, ఉపన్యాసాలు, జ్ఞానయజ్ఞాలలో పాల్గొను.
6. విద్యార్థుల మధ్య ఉన్న వివాదాలను పరిష్కరించి వారిని ప్రేమతో కలుపు.
7. శిశిర్‌ను, మిగిలిన పిల్లలను ఒకచోట చేర్చి ప్రార్థనలు, అధ్యయనాలు చేయిస్తూ ఆహ్లాదకరంగా గడిపేటట్లుగా చేయి.
8. నీ తల్లిదండ్రులు వాదించుకుంటూ ఉంటే వారిని నీ ఆహ్లాదకరమైన చిరునవ్వుతో, బోధనతో వారిని తిరిగి ఏకం చేయి.



గట్టు నారాయణ (గురూజీ)

సమస్య పరిష్కారానికి 'షట్సూత్ర' కార్యక్రమం

(నిన్నటి తరువాయి)

ఆ క్రమంలో భాగంగానే సంస్థానాలు రద్దుచేయబడిన తర్వాత భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌లాగా ఏర్పరచబడ్డ కొన్ని సమైక్య రాష్ట్రాలలో ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పడాలనే లక్ష్యంతో ప్రాంతీయ ఘర్షణలు కూడ జరిగాయి, జరుగుతున్నాయి. అందువల్ల భారతదేశంలో ప్రత్యేక పరిస్థితుల్లో రూపొందుతున్న జాతుల సమస్యలో భాగంగానే ఇలాంటి ప్రాంతీయ ఉద్యమాల్ని చూడాలితప్ప, 'జాతిని చీల్చడం'గానో, విచ్ఛిన్నకర ఉద్యమాలుగానో వాటిని చూడరాదు.

తరువాత, ఉద్యమం బలహీనమయ్యేందుకు ఉద్యమనాయకులలో అభిప్రాయభేదాలు తలెత్తి, వారు ప్రత్యేక రాష్ట్ర నినాదం వదులుకొని, బేరానికి రావడానికి ఎనిమిది నెలల వ్యవధి పట్టింది. ఈ మధ్యకాలంలో వివిధ ఘట్టాలలో పోలీసులు ఉద్యమకారులపై జరిపిన కాల్పులలో వందలమంది నేలకొరిగారు. వేలమంది జైళ్ళపాలై ఉపాధి కోల్పోవడం, లక్షలమంది అమాయకులు కష్టనష్టాలకు గురికావడం జరిగింది. వివిధ కారణాలతో ప్రజల మద్దతు నానాటికి తరిగిపోవడంతో నాయకులకూ ఉద్యమం పట్ల ఆసక్తి సన్నగిల్లిపోయింది. ముఖం దాచుకునేందుకు గౌరవ ప్రదంగా జరిగే ఏ ఒప్పందానికైనా తాము సిద్ధమని వారు ప్రధానికి, మధ్యవర్తుల ద్వారా రహస్య సందేశాలు పంపించారు.

ఈ పరిణామాన్ని సాధించడంలో గవర్నర్ సలహాదారుగా ఆంధ్రప్రదేశ్‌ను పాలించిన హెచ్.సి.సెరిన్, శ్రీమతి గాంధీకి ఎంతగానో తోడ్పడినారు. ఉద్యమ తిరోగమనానికి కూడ ఉద్యోగులే చొరవ తీసుకున్నారు. తమ నిరవధిక సమ్మెను వారు బేషరతుగా విరమించారు. అయితే ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి కె.ఆర్. అమోస్ ఉద్యోగం బలి అయినట్టే ప్రత్యేక ఆంధ్ర ఉద్యమంలో ఉద్యోగుల నాయకులు ఏ. శ్రీరాములు, రామకృష్ణారావు ఉద్యోగాలు బలి అయినాయి. వారిని ప్రభుత్వం డిస్మిస్ చేసింది. తరువాత, ఏ. శ్రీరాములు శాసనసభకు ఏలూరు నుండి ఎన్నికై ప్రతిపక్షంలో ప్రముఖ నాయకుడుగా ఎదగగా, కె.ఆర్. అమోస్, రామకృష్ణారావు గాంధీ భవన్ నీడకు చేరుకున్నారు. న్యాయవాదులు కోర్టుల బహిష్కరణ ఉద్యమానికి స్వస్తి పలికారు. కోర్టుల బహిష్కరణ ఉపసంహరించుకోవడానికి ముందువారి నాయకులలో కూడ అభిప్రాయ భేదాలు తలెత్తి, సన్నాహక సంఘ కార్యదర్శిగా ఉన్న ప్రముఖ న్యాయవాది యం.వి. రామమూర్తి తమ పదవికి రాజీనామా చేశారు.

కీలు వెతికి వాత పెట్టడంలో నిష్ణాతురాలు అయిన శ్రీమతి గాంధీ ఆంధ్ర, తెలంగాణ నాయకులతో పలు మార్లు చర్చలు జరిపి సమస్యకు పరిష్కారంగా 'షట్సూత్ర' కార్యక్రమం రూపొందించి దానిని 1973 సెప్టెంబర్ 21వ తేదీన ప్రకటించారు. ఉద్యమ నాయకుల అంగీకారాన్నే కాక గోడమీద పల్లివాటంగా ఉన్న కొందరు ఆంధ్రోద్యమ నాయకులను శ్రీమతి గాంధీ గుర్తించి, శ్రీ పి.వి.కి ఉద్వాసన చెప్పగలనని వారికి రహస్యంగా పరోక్షహామీ ఇచ్చారు. శ్రీ పి.వి. మంత్రివర్గాన్ని రద్దుచేసి రాష్ట్రపతిపాలన విధించిన శ్రీమతి ఇందిరాగాంధీ ఆయనకు ఆగ్రహం రాకుండా చూచేందుకు ఆయనను లెజిస్లేచర్ పార్టీ నాయకుడుగా కొనసాగించడం ద్వారా, తిరిగి తను ముఖ్యమంత్రి కావచ్చు నన్న ఆశను శ్రీ పి.వి.లో కొనసాగనిచ్చారు. ఉద్యమంలో చేరిన కొందరు కాంగ్రెస్ నాయకులు శ్రీ పి.వి. నాయకత్వంపై గురి పెట్టిన సంగతి ఆమెకు తెలుసు కాబట్టి, సమయం ఆసన్నమైనప్పుడు ఉద్యమ అవసాన దశలో మీకు పి.వి. పీడ విరగడైపోతుంది. ఆయన కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకుడుగా ఎంతో కాలం కొనసాగబోదని ఆయన బద్ధ శత్రువులకు రహస్యంగా సంకేతాలు పంపించి తన షట్సూత్ర కార్యక్రమానికి వారి ఆమోదముద్ర పొందగలిగారు.

అంతేకాక గవర్నర్‌గా వెళ్ళిపోయిన చెన్నారెడ్డి, టి.పి.యస్. కాంగ్రెస్‌తో విలీనమైన సందర్భంలో తన చంకకింద చేరిన ప్రత్యేక తెలంగాణ, వాదులు తోకలు జాడించే అవకాశాలు లేనందున తెలంగాణకు కొంత నష్టం జరిగినా తనకే ప్రమాదం ఉండదని శ్రీమతి గాంధీ భావించారు. అందువలననే రాజధాని నగరంలో 1977 వరకు తెలంగాణ ప్రాంతంలో 1980 వరకు అమలులో ఉండ వలసిన ముల్కీ నియమాలను ప్రాంతీయ సంఘాన్ని 1973లోనే మధ్యంతరంగా రద్దు చేసేందుకు ఆమె సాహసించగలిగారు. ఈ చర్యలు ఆంధ్ర నాయకులకు, తామేదో సాధించామని ప్రజలకు సంజాయిషీ ఇచ్చుకునే అవకాశాన్ని కల్పించాయి.

1968–69 తెలంగాణ ఉద్యమ సందర్భంలో తెలంగాణలో కొందరు ఆంధ్రులు దూషణలకు, వేధింపులకు, అవమానాలకు గురిఅయినా, ఆంధ్ర రాష్ట్ర ఉద్యమకారులు ఎవరూ ఎప్పుడూ తెలంగాణ వ్యక్తులను దూషించకపోవడం, ద్వేషించకపోవడం ఉద్యమ విశిష్టతలలో ఒకటిగా పేర్కొనక తప్పదు. పైగావారు చెన్నారెడ్డి, బి. సత్యనారాయణ రెడ్డి వర్గాలతో చేతులు కలిపి తమ ఉద్యమం కొనసాగించేందుకు సంసిద్ధులైనారు. అయితే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రవాదులు సమగ్రతావాదులపై దాడులు చేయడం వారి ఆస్తిపాస్తులను ధ్వంసంచేయడం, బలవంతంగా రౌడీయిజం చేసి నిధులు వసూలు చేయటం వంటి సందర్భాలు కోకొల్లలుగా వెలుగుచూచాయి. ఉద్యమనిర్వహణకు పూనుకున్న సుమారు మూడు డజన్ల సంఘాలతో కొద్దిరోజులలోనే ప్రజలు విసిగివేసారిపోయారు. (సశేషం)

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

కాంగ్రెస్ పార్టీ పునాదుల బలానికి ఇవి నిదర్శనం

యుద్ధంలో ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎదిరించి నిలబడేవాడే సైనికుడు.... అలాంటి సైనికుడు ఓడినా, గెలిచినా వీరుడే.. అలాంటి లక్షణాలు కాంగ్రెస్ పార్టీలోని క్యాడర్‌కు సంపూర్ణంగా ఉన్నాయి. ఎన్ని అవంతరాలు వచ్చినా, ఎన్ని బెదరింపులు, ప్రలోభాలు వచ్చినా, అధికార పార్టీ టీఆర్ఎస్ సామ,దాన, బేధ, దండోపాయాలు ప్రయోగించినా కాంగ్రెస్ క్యాడర్ మాత్రం మొక్కవోని దీక్షతో పోటీలో దిగి దాదాపు 30 శాతం గ్రామాలను కైవసం చేసుకుంది. ఇది కాంగ్రెస్ పార్టీకి పునాదులలో ఉన్న బలానికి నిదర్శనం. డిసెంబర్లో తెలంగాణలో శాసన సభ ఎన్నికలు జరిగాయి. మొదటి నుంచి కాంగ్రెస్‌కు అనుకూలంగా వాతావరణం ఉందని, ఈ సారి కాంగ్రెస్ విజయం ఖాయమని కాంగ్రెస్ శ్రేణులు బలంగా నమ్మాయి. అయితే తీరా డిసెంబర్ 11న వచ్చిన శాసనసభ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ క్యాడర్‌ను తీవ్ర నిరాశకు గురిచేశాయి.

కేవలం 28.4 శాతం ఓట్లతో 19 అసెంబ్లీ సీట్లను సాధించిన కాంగ్రెస్ పంచాయతీ ఎన్నికలలో ఎలా పోటీ చేస్తుందనే మీమాంస పెద్ద నాయకుల్లో సైతం నెలకొంది. టీఆర్ఎస్ గతంలో అధికారంలో ఉండి తిరిగి ముందస్తు అసెంబ్లీ ఎన్నికలలకు పోయి దాదాపు 47 శాతం (46.9) ఓట్లతో 88 సీట్లను సాధించింది. గతంతో పోలిస్తే 25 అసెంబ్లీ స్థానాలు అదనంగా దక్కించుకొని రెండోసారి అధికారంలోకి రావడమే కాకుండా ముఖ్యమంత్రిగా కేసిఆర్ సంపూర్ణ మెజారిటీతో రెండోసారి పీఠం అదిష్టించారు. ఫుల్ జోష్‌లో ఉన్న టీఆర్ఎస్ పంచాయతీ ఎన్నికలలో విజయవంతంగా గ్రామాలను స్వాధీనం చేసుకుంటున్నదని భావించింది. ఆ ఉద్దేశంతో టీఆర్ఎస్ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం కాకుండా అసెంబ్లీ ఎన్నికల తరువాత నిర్వహించాలని వాయిదా వేశారు. అనంతరం కొంతమంది గ్రామ నాయకులు కోర్టుకు వెళ్ళిన నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు జనవరి 10 లోగా ఎన్నికలు పూర్తి చేయాలన్న లక్ష్యంతో కొద్ది ఆలస్యంగా అయినా ప్రభుత్వం ఎన్నికలను పూర్తి చేసింది.

మూడు విడతలుగా జనవరి 21, జనవరి 25, జనవరి 30తేదీలలో ఎన్నికలు నిర్వహించిన ఎన్నికల కమీషన్ రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంతంగా నిర్వహించగలగడం అభినందించాల్సిన విషయం. గ్రామాలలో నాయకులు పదవుల కోసం ఎంత పోటీ పడ్డా కూడా ఘర్షణలకు దిగకుండా శాంతియుతంగా ఎన్నికలకు సహకరించడం గ్రామ నాయకుల పరిపక్వ రాజకీయాలకు తార్కాణం. గెలిచిన గ్రామాల సర్పంచ్‌లకు శుభాకాంక్షలు. వారికి ధీటుగా పోటీకి దిగి పరాజయం పాలైనా గ్రామ పాలనలో పాలు పంచుకోవాలనే అభిలాష ఉండడం అభినందించాల్సిన విషయం. ఇదిలా ఉంటే టీఆర్ఎస్ గ్రామాలలో పాగా వేయడానికి చేసిన అనేక ఎత్తుగడలను కాంగ్రెస్ శ్రేణులు బలంగా అడ్డుకోగలిగాయి. అనేక గ్రామాలలో కాంగ్రెస్ జెండాను పంచాయతీలపై ఎగురవేసి గ్రామ కాంగ్రెస్ పునాదులు చాల బలంగా ఉన్నాయని నిరుపించుకున్నాయి.



పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి కనీస స్థాయిలో కూడా విజయాలు లేకుండా చేయాలని టీఆర్ఎస్ రాజకీయంగా అనేక ఎత్తుగడలు వేసింది. అసెంబ్లీ ఎన్నికలలో గెలిచిన ధీమాలో ఉన్న టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు , మాజీ మంత్రులు, రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు నామినెటెడ్ పదవులు ఆశిస్తున్న వారు, ఇప్పటికే పదవులలో ఉన్న వారు, పార్టీ పదవులలో ఉన్న వారు అంతా వారి వారి గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి పడక్బందీ ప్రణాళికలతో గ్రామాలలో పంచాయతీ ఎన్నికలను ఎదుర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అప్పటికే అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి పాలవడంతో కొంత నిరాశలో ఉంది. నాయకత్వం గ్రామాలలో తిరిగి పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా ఎదుర్కొవాలనే ఉత్సహం తక్కువగా కనపడింది. అయినా కూడా గ్రామాలలో కాంగ్రెస్ క్యాడర్ ఎలాంటి నిరాశ, నిస్తృహలకు లోనుకాకుండా గ్రామాలను కైవసం చేసుకునేందుకు వారు చూపిన పోరాట స్ఫూర్తికి సలామ్.ఇది కాంగ్రెస్ సైన్యం చేసిన యుద్ధంగా భావించాలి.

సహజంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. ఈ సారి అప్పుడే రెండోసారి గెలిచిన ఉత్సాహంలో ఉన్న టీఆర్ఎస్ పంచాయతీలపై పాగా వేసేందుకు చాలా ఎత్తులు వేసింది. గ్రామాలలో చాల వరకు ఏకగ్రీవాలు చేసేందుకు శ్రమించింది. మొత్తం 12, 501 గ్రామ పంచాయతీలకు గాను మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు జరిగాయి. అందులో 2,310 గ్రామ పంచాయతీలను టిఆర్ ఎస్ నాయకులు ఏకగ్రీవాలు చేసి వారి ఖాతాలో వేసుకున్నారు. అవి పోను దాదాపు 10 వేల 200 గ్రామాలలో ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ దాదాపు 2,700 గ్రామాలను, ఇతరులకు 2,200 గ్రామాలను కైవసం చేసుకున్నారు. దాదాపు 4, 900 గ్రామాలలో టీఆర్ఎస్ వ్యతిరేకంగా సర్పంచ్లు విజయం సాధిస్తే టీఆర్ఎస్ మరో 5,300 గ్రామాలలో విజయం సాధించింది. ఏకగ్రీవాలు కలుపుకుంటే టీఆర్ఎస్ 7,600 గ్రామాలలో విజయం సాధించింది. అంటే ఏకగ్రీవాలు కాకుండా ఎన్నికలు జరిగిన గ్రామాలను పరిశీలిస్తే 55 శాతం టీఆర్ఎస్ విజయం సాధిస్తే దాదాపు 45 శాతం గ్రామాలను టీఆర్ఎస్ వ్యతిరేక పార్టీలు కైవసం చేసుకున్నాయి. అందులో 30 శాతం గ్రామాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది.


ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితులలో కాంగ్రెస్ పార్టీ మొత్తంగా చూస్తే 25 శాతం గ్రామాలలో సర్పంచ్ పదవులను స్వాధీనం చేసుకోవడం అంటే పార్టీ క్యాడర్లో ఉన్న పట్టుదల ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. గ్రామాలలో గతంలో ఏ ఎన్నికలలో లేనంత డబ్బు పంపిణీ జరిగింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న గ్రామాలలో ఆదాయం బాగా ఉండి, రియల్ ఎస్టేట్ బిజినెస్ నడిచే గ్రామాలలో పంచాయతీ ఎన్నికలలో కోటి రూపాయల వరకు వ్యయం చేశారనే ప్రచారం జరిగింది. అధికార పార్టీ అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకు దగ్గరుండి చూసుకుంది. ఎం.ఎల్.ఎలు,మాజీ మంత్రులు, ఎం.పిలు, ముఖ్య నాయకులు గ్రామాలలో తిరిగి ప్రచారం చేశారు, టీఆర్ఎస్ గెలిస్తేనే గ్రామాలలో అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం ఉందని కాంగ్రెస్‌ను గెలిపిస్తే గ్రామం అభివృద్ధికి దూరమవతుందని ప్రచారం చేశారు, రైతు బంధు, పెన్షన్లు రావాలంటే టీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని వత్తిడి చేశారు. విపరీతమైన అధికార దుర్వినియోగం, విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేశారు. మద్యం, మాంసం లాంటి వాటిని ఇంటింటికి పంచి పెట్టారు. పండుగలకు దావతులు ఇచ్చారు. ఓట్ల సంఖ్యను బట్టి ఇంటింటికి ప్యాకేజీలు ఇచ్చారు. కులాలకు సంఘాల పెద్దలను పిలిచి వారి డిమాండ్ల మేరకు వ్యక్తి గత కోరికలు తీర్చడంతోపాటు కుల సంఘాలకు భవనాలు, అవరాలకు తగ్గట్టుగా డబ్బు, టెంట్ సామాన్లు కొనిచ్చారు. అయినా అనుకున్న రీతిలో టీఆర్ఎస్ విజయాలను సొంతం చేసుకోలేకపోయింది.

కాంగ్రెస్ పార్టీలో ముఖ్య నాయకులు ఓటమి భారంతో ఉండడంతో ఎవరు పెద్దగా గ్రామాల విషయంలో పట్టించుకోలేదు, ఆర్థికంగా కాంగ్రెస్ నాయకులు బలహీనంగా ఉన్నారు, ఇవన్నీ ఉన్నప్పటికీ గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు ప్రజలతో ఉన్న సన్నిహిత సంబంధాలతో అనేక గ్రామాలలో నెగ్గారు. గ్రామాలలో నిరంతరం ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను పరిష్కరించి గ్రామాలలో ఒక కుటుంబ సభ్యులుగా మమేకమై ఉండడంతో వందలాది గ్రామాలలో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులు విజయం సాధించారు. ప్రస్తుతం తీవ్రమైన రాజకీయ ఫిరాయింపుల వత్తిడిలు ఉన్నప్పటికీ లక్షలాది రూపాయలు ప్రలోభాలు పెట్టినప్పటికీ కాంగ్రెస్ నాయకులు జెండా పట్టుకొని పంచాయతీలపై పట్టు సాధించారు. అనేక రకాల వత్తిడిలు, ప్రలోబాలు, విచ్చలవిడిగా డబ్బు, మధ్యం, మాంసం పంచి పెట్టి బెదిరింపులు, అధికార దుర్వినియోగాలు చేసినా కూడ దాదాపు 2700 గ్రామాలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం కాంగ్రెస్ పార్టీకి గ్రామాలలో ఉన్న పట్టుకు నిదర్శనం.

మహబూబాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సంగారెడ్డి, ఖమ్మం, నల్గొండ, భువనగిరి, ఆదిలాబాద్ తదితర జిల్లాలలో కాంగ్రెస్ పార్టీ టీఆర్ఎస్ కు ధీటుగా సర్పంచ్ పదవులను కైవసం చేసుకుంది. కాంగ్రెస్ గెలిచిన అనేక గ్రామాలు మండల కేంద్రాలలో, మేజర్ పంచాయతీలుగా ఉండడం విశేషం.అలాగే వందలాది గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ 1 నుంచి 10 ఓట్ల తేడాతో చాల గ్రామాలలో ఓటమి పాలయింది. రాబోయే ఎం.పి.టి.సి, జడ్పీటిసి, పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి మంచి భవిష్యత్తు ఉంటుందని పంచాయతీ ఎన్నికల ఫలితాలతో కొంత ఉత్సాహం ఏర్పడింది.



– కప్పర హరి ప్రసాద్ రావు
ముఖ్య ప్రజా సంబంధాల అధికారి, టీపీసీసి
98492 50060



'బడ్జెట్‌లో ఏపీ మాటే లేదు'

విజయక్రాంతి,అమరావతి: చివరి బడ్జెట్‌లో కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహమే చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ అనే మాటే ఈ బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. రోజుకు 16 రూపాయలు ఇస్తే రైతులకు ఒరిగేదేమీ లేదని విమర్శించారు. 5ఎకరాల భూమి ఉంటే 500 రూపాయలు భిక్ష వేస్తారా అని కేంద్రాన్ని ప్రశ్నించారు. కేంద్రబడ్జెట్ పేదలపై ఏమాత్రం ప్రభావం చూపలేదని పేర్కొన్నారు. పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి కేంద్ర బడ్జెట్ లో సామాన్యులకు ఒరిగిందేమీ లేదన్నారు. ఈబీసీ రిజర్వేషన్ల ఆదాయ పరిమితి 8లక్షల రూపాయలు ఉంటే, ఆదాయపన్నుకు మాత్రం 5లక్షలు పెట్టారని ఇటువంటివి అనేకం ఉన్నాయన్నారు. దేశంలో నిరుద్యోగంపై చైనా కూడా హెచ్చరించిందన్న సీఎం మన రాష్ట్రంలోనే 14లక్షల మందికి ఉపాధి కల్పించామని తెలిపారు. బీజేపీ వైఫల్యం వల్లే దేశంలో నిరుద్యోగ సమస్య ఏర్పడిందన్నారు. శాసన సభలో శుక్రవారం రోజు చరిత్రలో నిలిచిపోనుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇంతమంది ఎమ్మెల్యేలు నల్ల చొక్కాలతో నిరసన తెలపటం ఎప్పుడూ జరగలేదన్నారు. ఢిల్లీలో మన ఎంపీలు నల్లచొక్కాలతో ధర్నా చేశారని తెలిపారు. రాష్ట్రంలో జేఏసీ బంద్ విజయవంతమైందన్నారు. అన్యాయాన్ని నిలదీసేందుకే ఈ తీవ్ర నిరసనలని పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పార్క్ చేసిన వాహనాలకు జరిమానా

విజయక్రాంతి, విశాఖపట్టణం: విశాఖ విమానాశ్రయంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా విమానాశ్రయ భద్రతా సిబ్బంది కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ వీఐపీలు, వీవీఐపీల పేరిట ఇష్టానుసారంగా కార్లు పార్కింగ్ చేసిన వారు అపరాధ రుసుం చెల్లించాల్సిందేనని హెచ్చరిస్తున్నారు. విమానాశ్రయ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు భద్రతా సిబ్బందితో అధికారులు చర్యలు చేపట్టారు. విమానాశ్రయం ముందు పార్కింగ్ చేసిన వారి వాహనాల టైర్లకు కళ్లాలు వేశారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసిన చాలా వాహనాలకు రూ. 3 వేల నుంచి రూ.5వేల వరకు జరిమానా విధించారు. ఓ తెలుగు మహిళా నాయకురాలు కారుకు ఎంపీ స్టిక్కర్ అతికించుకుని వస్తే అదేదో ఎంపీ కారని భద్రతా సిబ్బంది భావించారు. అయితేనేం నిబంధనలకు వ్యతిరేకంగా పార్కింగ్ చేశారని ఆ కారు చక్రానికి తాళం వేసేశారు. రూ.3 వేలు చెల్లిస్తే గానీ కదలనీయలేదు. మరో చోట ఓ పోలీసు అధికారి వెంట వచ్చిన మరో వ్యక్తి కారుకు జరిమానా వేశారు. ఇలా, విమానాశ్రయంలో పార్కింగ్ క్రమబద్ధీకరణ కట్టుదిట్టం చేయడానికి నిర్మొహమాటంగా భద్రతా సిబ్బంది చర్యలు చేపడుతున్నారు.

'డ్వాక్రా మహిళలను ముంచారు'

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డ్వాక్రా మహిళలను నిలువునా ముంచారని వైఎస్సార్ సీపీ మహిళా నేత కొల్లి నిర్మలా కుమారి విమర్శించారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సబ్‌ప్లాన్ నిధులను మళ్లించటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ప్రజలకిచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా బాబు అంటూ మండిపడ్డారు. ప్రపంచంలో ఇలాంటి సీఎం ఎక్కడా లేరన్నారు. చంద్రబాబు మాటలు ఏ మహిళా నమ్మడం లేదన్నారు. చంద్రబాబుకు కాపీ కొట్టడం మాత్రమే తెలుసని పేర్కొన్నారు.

ఓట్లు చేయించుకోవటం మంచి పద్ధతి కాదు



విజయక్రాంతి, కాకినాడ: పెన్షన్ దారులతో మళ్లీ తమకే ఓట్లు వేయాలంటూ టీడీపీ నేతలు ఓట్లు చేయించుకోవటం మంచి పద్ధతి కాదని వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు మండిపడ్డారు. ఇటువంటి టీడీపీ సెంటిమెంటు కార్యక్రమాలను ఖండిస్తున్నామన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పన్నుల రూపంలో వచ్చిన ప్రభుత్వ ఆదాయంతో ఓట్లు కొనుగోలు చేసే కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టారన్నారు. ఇది చాలా దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు. జగనన్న బాటలో చంద్రన్న నడుస్తున్నారంటూ ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఇప్పటికైనా తన వేషాలు ఆపాలని, ప్రజలు చాలా అసహ్యించుకుంటున్నారని చెప్పారు. స్పీకర్ సీట్లో నలచొక్కా వేసుకున్న టీడీపీ ఎమ్మెల్యే కూర్చునేంతగా చట్ట సభల విలువలను దిగజార్చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు హైకోర్టు భవనాల ప్రారంభం

- పటిష్ఠ పోలీసు బందోబస్తు

విజయక్రాంతి, గుంటూరు: ఈ నెల 3వ తేదీ ఆదివారం గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నేలపాడులో ఏపీ నూతన హైకోర్టు ప్రారంభోత్సవానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గుంటూరు గ్రామీణం ఎస్పీ రాజశేఖర్‌బాబు తెలిపారు. ఎస్పీ నేలపాడులో హైకోర్టు భవన ప్రాంగణంలో బందోబస్తు చర్యలను పర్యవేక్షించారు. అనంతరం పోలీసు అధికారులకు ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, అనేక మంది ప్రముఖులు, పెద్ద సంఖ్యలో న్యాయమూర్తులు హాజరుకానుండడంతో భద్రతా విధుల్లో బాధ్యతగా ఉండాలని ఆదేశించారు. ఆయా వీఐపీలు పయనించే మార్గాలతోపాటు కార్యక్రమం జరిగే ప్రదేశాల వద్ద భద్రతా చర్యలపై సూచనలు చేశారు. ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట ఏఎస్పీలు, డీఎస్పీలు ఉన్నారు.

ఏ జాతీయ ప్రాజెక్టు అయినా
పోలవరంలా పూర్తయ్యిందా

- చూపిస్తే రాజకీయాల నుంచి విరమించుకుంటా : చంద్రబాబు

విజయక్రాంతి, అమరావతి: పోలవరం తరహాలో జాతీయ ప్రాజెక్టు దేశంలో ఏదైనా పూర్తయ్యిందంటే రాజకీయాల నుంచి విరమించుకుంటా. రాష్ట్ర జీవనాడి అయిన ఈ ప్రాజెక్టుకు వెచ్చించిన నిధులివ్వమంటే ఇవ్వరు? సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) పంపితే ఆమోదించరు? 57,967 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని 24 గంటల్లో పూర్తి చేసి గిన్నిస్ రికార్డు సృష్టించినా కనికరం లేదు. సందేహాల నివృత్తికి ఢిల్లీకి నాలుగు టన్నుల పేపర్లు పంపా. ఆంధ్రప్రదేశ్ బాగు పడుతుందంటే మీకు అసూయ. తమిళనాడుకు నీళ్లిస్తామంటే ఓర్వలేరు. ప్రాజెక్టుకు ఒక వైపు అవార్డులిస్తూ మరో వైపు అవాకులు చవాకులు మాట్లాడతారా? మీకూ, బ్రిటీషువాళ్లకు తేడా ఏమిటి? వాళ్లే నయం. కాటన్దొర ఇచ్చిన నీళ్లయినా తాగుతున్నాం. మేము మీ బానిసలమా? రాజధానిని ఏభై ఏళ్లకు నిర్మిస్తారా? అప్పటివరకు ఇలాగే చావాలా?' అని సీఎం చంద్రబాబు ప్రధాని మోదీపై అసెంబ్లీలో శుక్రవారం నిప్పులు చెరిగారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుపై స్వల్ప వ్యవధి చర్చ సందర్భంగా సీఎం ఆవేశంగా ప్రసంగించారు. ప్రధాని తీరుపై మరోసారి విరుచుకుపడ్డారు.

ఇదో చీకటి రోజు. నాలాంటి సీనియర్ నాయకుడు నల్లచొక్కా వేసుకున్నారంటే వీళ్లు ఎంత దుర్మార్గంగా వ్యవహరించారో ప్రజలు అర్థం చేసుకోవాలి. 2002లో మోదీ, నిన్న అమిత్‌షా రాజకీయాల్లోకి వచ్చారు. 1978లోనే నేను ఎమ్మెల్యేనయ్యా. రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రధాని మోదీని సార్ అంటూ అనేకసార్లు గౌరవిస్తే అమరావతికి మట్టి, నీరు ముఖాన కొట్టిపోతారా? ఇదేనా మాకిచ్చే బహుమతి? ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వబోమంటే.. హోదాకు తగిన ప్రయోజనాలు ఆంధ్రప్రదేశ్‌కు కల్పిస్తే ఏ పేరు పెట్టుకున్నా అభ్యంతరం లేదన్నా. ఈశాన్య రాష్ట్రాలకు పారిశ్రామిక రాయితీలు, ఇతర అనేక ప్రత్యేక ప్యాకేజీలిచ్చి మాకు అన్యాయం చేస్తారా? ఇది ప్రధానికి తగునా?' అని చంద్రబాబు మండిపడ్డారు.



ఆటోడ్రైవర్లందరికీ పెద్దన్నగా ఉంటా

ఆటోలపై జీవితకాల పన్ను రద్దు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి పెద్దసంఖ్యలో ఆటో డ్రైవర్లు తరలివచ్చారు. పన్ను ఎత్తివేత నిర్ణయంపై ఆటోడ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఆటో డ్రైవర్లనుద్దేశించి మాట్లాడారు. తన జీవితానికి ఆటో డ్రైవర్ల జీవితానికి ఎన్నో దగ్గర పోలికలు ఉన్నాయన్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని డ్రైవర్లు పోషిస్తుంటే రాష్ట్రాన్ని నడుపుతూ ప్రజల సంక్షేమాన్ని తాను చూస్తున్నానని చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆటోవాలాలకు ముఖ్యమంత్రి మరిన్ని వరాలు కురిపించారు. ఆటో డ్రైవర్ చొక్కా ధరించి తన నివాస ప్రాంగణంలో స్వయంగా ఆటో నడిపి అందరిలోనూ హుషారు నింపారు. ఇంధన ఛార్జీలు, బీమా భారం కూడా తగ్గించేలా చర్యలు తీసుకుంటామని సీఎం వెల్లడించారు. ఆటోడ్రైవర్లందరికీ పెద్దన్నగా తానుంటానన్నారు. ప్రయాణికుల క్షేమం మీరు చూసుకోండి.. మీ క్షేమం నేను చూసుకుంటాను అని వారితో సీఎం అన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం


- తప్పుడు సర్వేలతో ప్రజలను మభ్యపెట్టాలనుకుంటున్నారు
- టీడీపీ ఓడిపోదు: అధినేత చంద్రబాబు

విజయక్రాంతి, విజయవాడ: కొందరు సర్వేలు చూసి తెగ సంబరపడిపోతున్నారని, వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓడిపోదని ఆ పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ ఓడిపోతే పరిస్థితి ఏంటి అని అడిగిన వ్యాపారులకు కూడా తాను అదే సమాధానం చెప్పానని అన్నారు. శనివారం కృష్ణాజిల్లా కేసరపల్లిలో నిర్వహించిన సంక్షేమ పండగ కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ పట్టిసీమ వేగంగా పూర్తి చేసి రైతులకు నీరు ఇచ్చాం. చంద్రన్నబాట పథకం కింద ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేశాం. రూ.83వేల కోట్ల ఖర్చుతో 23లక్షల ఇళ్లు నిర్మించి ఇస్తున్నాం. కాపులకు రిజర్వేషన్లు కల్పించి ఎవ్వరూ చేయని సాహసం చేశాను. రూ.50వేల కోట్ల విలువైన 34 వేల ఎకరాల భూమి రైతులు ఉచితంగా ఇచ్చారు.

నాపై ఉన్న నమ్మకంతోనే ప్రజలు అంత భూమిని ఉచితంగా ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ భూములు అభివృద్ధి చేసి ఇచ్చాం. ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయి. టీడీపీ ఓడిపోతే మా పరిస్థితి ఏంటి అని కొందరు పెట్టుబడిదారులు అడిగారు. టీడీపీ ఓడిపోదు, మీ పెట్టుబడులు ఎక్కడికీ పోవు అని వ్యాపారులతో చెప్పాను. కొందరు సర్వేలు చూసి సంబరపడిపోతున్నారు. కేంద్రం సహకరించి ఉంటే ఇంకా బాగా అభివృద్ధి జరిగేది. కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.80వేల కోట్లు రావాల్సి ఉందని పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. మనకు అన్యాయం చేసిన పార్టీకి పుట్టగతులు లేకుండా చేయాలి. కేసీఆర్, జగన్ కలిసి నాటకం ఆడుతున్నారు. కోడికత్తి కేసు ద్వారా ప్రభుత్వంపై బురద జల్లాలని చూస్తున్నారు. దేశంలో అత్యవసర పరిస్థితి నెలకొంది. కుట్రలు కుతంత్రాలు చేసిన వారికి తగిన బుద్ధి చెప్పాలి. రాష్ట్రం కోసం, ప్రజల కోసం ఐదేళ్లు శ్రమించాను. తప్పుడు సర్వేలతో ప్రజలను మభ్య పెట్టాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. ఆనాడు చేసినతప్పును కాంగ్రెస్ పార్టీ గ్రహించింది. ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది అని అన్నారు.

12 ఏళ్ల పోరాటం సాకారం

- 7వ తేదీన పోర్టు పనులను ప్రారంభించనున్న సీఎం
- బస్సుయాత్రతో ప్రజలకు అవగాహన : మంత్రి కొల్లు రవీంద్ర



విజయక్రాంతి, మచిలీపట్నం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదగా పోర్టు పనులను ఈనెల 7వ తేదీన ప్రారంభించనున్న నేపథ్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. స్థానిక రహదారులు, భవనాలశాఖ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12 ఏళ్ల పోరాటం ఫలితం సాకారం కాబోతుందన్నారు. పోర్టు నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని లక్ష మందికి తగ్గకుండా పండగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహిస్తామన్నారు. పరిపూర్ణ అవగాహన కల్పించేలా నియోజకవర్గ పరిధిలో శనివారం నుంచి బస్సుయాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. కరగ్రహారం నుంచి టీడీపీ ఆధ్వర్యంలో యాత్ర ప్రారంభమవుతుందన్నారు. పోర్టు పనుల ప్రారంభంతో పాటు బహిరంగసభ వద్ద ముఖ్యమంత్రి వివిధ అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలను ఆవిష్కరిస్తారన్నారు. రూ. 11 కోట్ల వ్యయంతో చిన్నాపురంలో నిర్మించే తాగునీటి పథకం, రూ.5 కోట్లతో చిలకలపూడి సమీపంలోని కాపు భవన్, రూ. 5 కోట్లతో రుద్రవరంలో బీసీ భవన్, తాళ్లపాలెం వద్ద రూ.10 కోట్లతో ఆనకట్ట, రూ.7.50 కోట్లతో గిలకలదిండి వద్ద నిర్మించే బ్రిడ్జి, రూ.17.50 కోట్ల అంచనాతో నిర్మించనున్న పంచాయతీరాజ్ రహదారులు, రూ.5 కోట్లతో మంగినపూడి బీచ్ వద్ద చేపట్టే పర్యాటక అభివృద్ధి పనులు, రూ.9 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల భవనాలు, రూ.2.50 కోట్లతో క్రీడా వికాస్ కేంద్ర నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేస్తారన్నారు. ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ నాయకులు బూరగడ్డ రమేష్‌నాయుడు, కొనకళ్ల జగన్నాథరావు, చిలంకుర్తి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. పోర్టు నిర్మాణ పనులకు వస్తున్న ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి రవీంద్ర పరిశీలించారు. మంగినపూడి శివారులో డ్రెడ్జింగ్ పనులు ప్రారంభించే ప్రాంతాన్ని, హెలిపాడ్ ఏర్పాట్లు, యాగశాల తదితర ప్రాంతాలను సందర్శించిన మంత్రి అధికారులకు తగు సూచనలు చేశారు. ఫిబ్రవరి 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు హెలికాప్టర్‌లో కృష్ణా విశ్వవిద్యాలయం చేరుకొని భవనాలను ప్రారంభించి విద్యార్థులతో ముఖ్యమంత్రి ముచ్చటిస్తారన్నారు. అనంతరం పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించి, మేకావానిపాలెం వద్ద నిర్మించిన పైలాన్‌ను ఆవిష్కరించి బహిరంగసభలో పాల్గొంటారన్నా రు. మచిలీపట్నం దశ, దిశను మార్చేందుకు దోహదపడే బందరు పోర్టు నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. స్థానిక వాసవి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన వర్తక, వ్యాపార సంఘాల ప్రతినిధుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పోర్టు కోసం చేసే ఉద్యమంలో భాగస్వాములుగా ఉన్న వ్యాపార సంఘాల ప్రతినిధుల కృషి ప్రశంసనీయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన పేరుతో మోసం చేశారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక మచిలీపట్నం, పరిసర ప్రాంత అభివృద్ధిపై చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని చెప్పారు. అందుకోసం ప్రత్యేకంగా ముడను ఏర్పాటు చేసి ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటోందని వివరించారు. ముడ వీసీ విల్సన్‌బాబు మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ మచిలీపట్నం చరిత్రలో ఓ ముఖ్య ఘట్టం కాబోతోందన్నారు. రూ.11వేల కోట్ల పెట్టుబడితో కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. మరికొన్ని పారిశ్రామిక సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. త్వరలో ముడా మాస్టర్ ప్రణాళిక ప్రభుత్వ ఆమోదానికి పంపుతామన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి మామిడి మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పురపాలక సంఘ అధ్యక్షుడు బాబాప్రసాద్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు

నెరవేరిన కడప వాసుల కల

- తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు కడప వరకు పొడిగింపు




విజయక్రాంతి, కడప: కడప ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. కడప నుండి శుక్రవారం సాయంత్రం 5గంటలకు విశాఖపట్నంకి తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు బయలుదేరింది. దీంతో కడప నుండి నేరుగా విజయవాడ, విశాఖపట్నంకు రైలు సౌకర్యం ఏర్పాటయ్యింది. ప్రయాణికుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును పొడిగించాలని కడప, రాజంపేట మాజీ పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పలుసార్లు పార్లమెంటులో చర్చించారు. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ వీరు స్వయంగా కలిసి వినతి పత్రాలు సమర్పించారు. దక్షిణ మధ్య రైల్వే బోర్డు మీటింగ్లో ప్రయాణికుల సౌకర్యార్థం రైలును పొడిగించాలని పట్టుపట్టారు. అందుకు స్పందించిన కేంద్ర మంత్రి, దక్షిణ మధ్య రైల్వేబోర్డు అధికారులు తిరుపతి వరకు కొనసాగుతున్న తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను కడప వరకు పొడిగించాలని నిర్ణయించారు. శుక్రవారం సాయంత్రం కడప నుంచి రైలు తిరుపతికి బయలుదేరింది. అటునుంచి విశాఖకు బయలుదేరుతుంది. అంతకుముందు ప్రయాణికులు విజయవాడకు వెళ్లాలంటే ధర్మవరం –విజయవాడ రైలును ఆశ్రయించాల్సి వచ్చేది. ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, నంద్యాల మీదుగా వెళ్లాల్సి వచ్చేది. వారానికి 3రోజులు మాత్రమే ఈ రైలు నడుస్తోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు విశాఖ తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతి రోజు నడుస్తుంది కాబట్టి రాజధానికి వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తొలగిపోనున్నాయి. విశాఖ–కడప ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖపట్నంలో ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి విజయవాడ మీదుగా తిరుపతికి మరుసటి రోజు ఉదయం 4.50 గంటలకు చేరుకుంటుంది. తిరుపతి నుంచి 5.20 గంటలకు బయలుదేరి రైల్వేకోడూరు, రాజంపేట, నందలూరు మీదుగా 8.25 గంటలకు కడప రైల్వేస్టేషన్‌కు వస్తుంది. ప్రతి రోజు సాయంత్రం 5.05 గం టలకు కడపలో బయలుదేరి తిరుపతికి రాత్రి 8.00 గంటలకు చేరుకుంటుంది. అక్కడినుంచి రేణిగుంట, గూడూరు, నెల్లూరు, కావలి, ఒంగోలు, చీరాల, బా పట్ల, తెనాలి మీదుగా విజయవాడ, నూజివీడు, ఏలూ రు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, ద్వారాపూడి, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి, దువ్వాడ, విశాఖపట్నంకు ఉదయం 11.30 గంటలకు చేరుకుంటుంది.

200 మంది మహిళలతో జనసేన కమిటీలు


విజయక్రాంతి, అమరావతి: జనసేన పార్టీ 200 మంది మహిళలతో రాష్ట్రస్థాయి కమిటీలను నియమించింది. కమిటీల ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్లు, పార్టీ అధికార ప్రతినిధులు, తదితరుల పోస్టులన్నింటినీ ఆడపడుచులతోనే భర్తీ చేసింది. కమిటీల తొలి జాబితాను పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ హైదరాబాద్‌లో పకటించారు.ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ జనసేన పార్టీ మహిళలకు చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని గట్టిగా చెబుతోందని, పార్టీ పదవుల్లో వారికి సముచిత స్థానం ఇచ్చి నిబద్ధత చాటుకున్నామని అన్నారు. తమ పార్టీకి చెందిన దాదాపు 40 విభాగాల్లో మహిళలు బలమైన పాత్ర పోషించేలా చేస్తామన్నారు. ఆయా విభాగాలకు సంబంధించిన తొలి జాబితాలో 200 మంది మహిళలకు స్థానం కల్పించినట్లు చెప్పారు. డాక్టర్లు, లెక్చరర్లు, న్యాయవాదులు, ఐటీ నిపుణులతో పాటు గృహిణులకు కూడా ఈ కమిటీల్లో స్థానం కల్పించారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీలోకి పలాసకు చెందిన పాండా సుజాతను తీసుకున్నారు. వీర మహిళ కమిటీకి ఛైర్‌పర్సన్‌గా కర్నూలు చెందిన రేఖ జవ్వాజి, పార్టీ విధానాల కమిటీకి ఛైర్‌పర్సన్‌గా డాక్టర్ యామిని జ్యోత్స్న కంబాల (రాజమహేంద్రవరం)ను నియమించారు. తొలి జాబితాలో దాదాపు 22 కమిటీలను ప్రకటించారు. మలి జాబితాలు రెండు మూడు రోజుల్లో విడుదల చేయనున్నట్లు తెలిసింది. అమెరికాలో ఇమ్మిగ్రేషన్ అధికారుల అదుపులో ఉన్న భారతీయ విద్యార్థులకు అవసరమైన న్యాయసహాయం అందించి విడుదల చేయించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం చర్యలు తీసుకోవాలని పవన్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో విద్యార్థులకు సహకరించాలని ఎన్నారై జనసేన ప్రతినిధులను ఒక ప్రకటనలో కోరారు.

విద్యార్థులకు కుళ్లిన కోడిగుడ్లు



విజయక్రాంతి, విజయనగరం: నెల్లిమర్ల నగర పంచాయతీతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కుళ్లిన కోడిగుడ్లు పెడుతున్నారు. దీంతో విద్యార్థులు తినలేక బయట పడేస్తున్నారు. నగరపంచాయతీతో పాటు మండలంలోని 70 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఒక ప్రయివేటు సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. నెల రోజులుగా ఆ సంస్థే మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేస్తుండగా అన్నం గట్టిగా ఉంటోందని, పప్పు పలుచగా ఉంటోందని విద్యార్థులు వాపోతున్నారు. వారికి సరఫరా చేస్తున్న గుడ్లు కూడా బాగుండడం లేదని విద్యార్థులు అంటున్నారు. కుళ్లిపోయిన కోడిగుడ్లను తమకు పెడుతున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మొదట్లో గుడ్లను పాఠశాలల్లోనే ఉడకబెట్టి విద్యార్థులకు అందించేవారు. సంక్రాంతి సెలవుల తర్వాత ఆ సంస్థే గుడ్లు ఉడకబెట్టి సరఫరా చేస్తోంది. రంగు మారిపోయిన గుడ్లను పాఠశాలలకు పంపిస్తున్నారు. తెల్లగా ఉండాల్సిన గుడ్లు ముదురు గోధుమ రంగులోకి మారిపోవడంతో దుర్వాసన వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు ఇప్పటికే ఆ సంస్థ ప్రతినిధులను హెచ్చరించారు. అయితే తమకు కాంట్రాక్టర్ సరఫరా చేసే గుడ్లనే తాము పాఠశాలలకు అందజేస్తున్నామని నిర్వాహకులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు కల్పించుకుని విద్యార్థులకు నాణ్యమైన గుడ్లు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

'పసుపు కుంకుమ'కు సబ్‌ప్లాన్ నిధులు



విజయక్రాంతి, అమరావతి: పసుపు కుంకుమ పథకానికి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల్ని మళ్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల సమయంలో అమలు చేస్తున్న ఈ పథకంలో భాగంగా మహిళలకు ఇచ్చేది అప్పు మాత్రమేనని ఒకవైపు చర్చ జరుగుతుండగా, మూడు విడతల్లో మొత్తం రూ. 2137.66 కోట్ల ఎస్సీ, ఎస్టీ నిధుల్ని మళ్లించేందుకు సిద్ధమయ్యారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులకు ఆర్థిక శాఖ ప్రత్యేక పద్దు నిర్వహిస్తుండగా, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి రూ.1668.60 కోట్లను, ఎస్టీ సబ్‌ప్లాన్ నుంచి రూ. 469.06 కోట్లను పసుపు కుంకుమ పథకానికి ఖర్చు చేయనున్నారు. మొదటి విడతలో ఫిబ్రవరి 1న మహిళలకు ఇస్తున్న చెక్కులకు డబ్బుల కోసం ఆ రెండు పద్దుల నుంచి రూ.534.41 కోట్లు ఇప్పటికే ట్రెజరీల ద్వారా విడుదలకు ప్రభుత్వం అనుమతించింది.

పసుపుకుంకుమ పథకంపై ఊరూరా ప్రచారం కోసం ప్రభుత్వ ఖజానా నుంచే మరో రూ.31.60 కోట్లు ఖర్చుపెట్టేందుకు సిద్ధమయ్యారు. గ్రామాల్ని మండలాల వారీగా మూడుగా విభజించి మూడ్రోజుల పాటు ఊరూరా చంద్రబాబును పొగిడేందుకు సభలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో వార్డుల వారీగా మూడ్రోజులు కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి నెలా 1 నుంచి 5 తేదీల మధ్య జరగాల్సిన పింఛన్ల పంపిణీని నిలిపేసి.. ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో గ్రామాలు, వార్డుల్లో జరిగే సభల్లోనే వాటిని పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయం అధికారుల్ని ఆదేశించింది. ఈ సభల్లో సీఎం చంద్రబాబును బాగా పొగిడేవారిని ప్రత్యేకంగా సన్మానించాలని సెర్ప్ సీఈవో కృష్ణమోహన్ జిల్లా అధికారులకు సూచించారు. ఊరూరా సభల నిర్వహణకు ఖర్చయ్యే రూ. 31.60 కోట్లను డ్వాక్రా సంఘాల బలోపేతానికి ఇచ్చే రివాల్వింగ్ ఫండ్, సంఘాల్లోని మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన ఎన్ఆర్ఎల్ఎం నిధులను మళ్లించారు.

క్షేత్రస్థాయిలో అభివృద్ధి పరిశీలన

- అన్ని జిల్లాలలో రైడ్ ఫర్ ఫ్యూచర్ సైకిల్ ప్రయాణం

విజయక్రాంతి, సత్తెనపల్లి: ఏపీ జన్మభూమి ఆధ్వర్యంలో ప్రవాస భారతీయుల సహకారంతో రాష్ట్రంలో 3,500 పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, 100కు పైగా అంగన్‌వాడీ కేంద్రాలు, 50కి పైగా శ్మశానవాటికల అభివృద్ధి జరిగింది. క్షేత్రస్థాయిలో వాటి ఫలాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవడంతో పాటు భవిష్యత్తులో మరింతగా ఎన్నారైల సహకారం తీసుకునేందుకు రైడ్ ఫర్ ఫ్యూచర్ పేరిట సైకిల్ ప్రయాణం చేపట్టారు 20 రోజులలో 13 జిల్లాల్లో 2 వేల కిలోమీటర్లు ప్రయాణించారు. ఉత్తర ఆమెరికాలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం ఆధ్వర్యంలో ఎన్నారైల భాగస్వామ్యంతో సైకిల్ రైడ్ జరుగుతోంది. ఏపీ జన్మభూమి కన్సల్టెంట్, డిజిటల్ రూమ్ ప్రోగ్రాం ఇన్‌చార్జి కరుటూరి ప్రదీప్, ఏపీ జన్మభూమి వలంటీరు, ప్రకృతి సేద్యం చేస్తున్న యువ రైతు అమర్ అక్బర్ సైకిల్ యాత్ర చేస్తున్నారు. గత నెల 21న కర్నూలులో ప్రారంభమైన ప్రయాణం శుక్రవారం గుంటూరు జిల్లాకు చేరుకుంది. సత్తెనపల్లి మండలం ఫణిదం, యడ్లపాడు మండలం కారుచోల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్ని యాత్రికులు సందర్శించారు. ఇప్పటికే 1100 కిలోమీటర్ల యాత్ర పూర్తయిందని వారు తెలిపారు. ఈనెల 10న శ్రీకాకుళంలో యాత్ర పూర్తవుతుంది. ప్రయాణంలో భాగంగా పాఠశాలలకు వెళ్లి డిజిటల్ తరగతులు, ప్రవాస భారతీయుల భాగస్వామ్యంతో చేపట్టిన కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో చిన్నారులు భాగస్వాములయ్యేలా చేస్తున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, శ్మశానవాటికలను సందర్శించడంతో పాటు అప్పటికప్పుడే డాక్యుమెంటేషన్ పూర్తి చేస్తున్నారు. రైడ్ ఫర్ ఫ్యూచర్‌కు అన్ని జిల్లాల్లో మంచి స్పందన లభించిందని అమరావతి కేంద్రంగా నడిచే ఏపీ జన్మభూమి కన్సల్టెంట్ ప్రదీప్ తెలిపారు.

గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజీనామా

గుజరాత్: గుజరాత్‌లోని ఊంజా జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందిన ఆశాపటేల్ పార్టీకి రాజీనామా చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో కలవరం మొదలైంది. ఆశాపటేల్ శనివారం పార్టీలోని అంతర్గత కలహాలు, తనకు పార్టీలో సముచిత స్థానం లభించకపోవటంతో మనస్థాపానికి గురై రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గాంధీనగర్‌లో గుజరాత్ అసెంబ్లీ అధ్యక్షుడు రాజేంద్ర త్రివేదికి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. ఆశాపటేల్ రాజీనామాను త్రివేది స్వీకరించారు. పటేల్ రాజీనామా కాంగ్రెస్‌కు దెబ్బేనని పార్టీ వర్గాలు భావిస్తు న్నాయి. 2017 ఎన్నికల్లో పాటిల్ బీజేపీని ఓడించి ఊంజా స్థానాన్ని గెలుపొందారు.

ప్రియాంకపై వ్యాఖ్యలు బీజేపీపై దేశవ్యాప్త కేసులకు కాంగ్రెస్ నిర్ణయం

న్యూఢిల్లీ: ప్రియాంక గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లో వస్తున్నారంటూ ప్రకటించింది మొదలు బీజేపీ నేతలు స్పందిస్తున్న తీరుపై కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు సుశ్మితా దేవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రియాంకపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై సోమవారం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ మహిళా విభాగాలు కేసులు పెట్టనున్నారని ఆమె వెల్లడించారు. ఈ మేరకు సుశ్మిత తన ట్విటర్ ఖాతాలో ఓ వీడియో సందేశాన్ని పోస్టు చేశారు.


'మహిళల పట్ల కనీస గౌరవం చూపించకపోవడం వల్లే అనేకమంది రాజకీయాల్లోకి వచ్చేందుకు వెనకాడుతున్నారు. ఇదే వైఖరితో ప్రియాంక గాంధీని సైతం లక్ష్యంగా చేసుకోవడం బాధాకరం. ఆమె జనరల్ సెక్రటరీగా ప్రకటిం చిన నాటి నుంచి బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు చాలా బాధపెట్టాయి' అని ఆమె పేర్కొన్నారు. ప్రియాంకపై అసత్య ప్రచారం చేస్తున్నవారిపై కేసులు నమోదు చేయాలని రాష్ట్ర మహిళా విభాగాలను కోరినట్టు సుశ్మిత తెలిపారు. దుష్ప్రచారానికి అడ్డుకట్ట వేయాలంటే దాని వెనుక ఉన్నవారిపై కేసులు నమోదు చేయాలనీ... అందుకు ఆయా రాష్ట్రాల్లోని పోలీసులు కూడా సహకరించాలని కోరుతున్నామన్నారు.

ప్రియాంక గాంధీకి "అందం" తప్ప మరో అర్హత లేదనీ.. "అందంతో" ఓట్లు రాలవంటూ బీహార్ మంత్రి, బీజేపీ నేత వినోద్ నారాయణ్ ఝా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

సరిహద్దు మూసివేతకు సాంకేతికత జోడిస్తాం

మమత సర్కార్‌లో ఎవరూ పదిలంగా లేరు


- చొరబాట్లు, నేరాల తగ్గుదలకు తోడ్పాటు
- 2021లో బీజేపీ ప్రభుత్వం నెలకొంటుంది



న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్, అస్సాం అంతర్రాష్ట్ర సరిహద్దు రేఖ మూసివేసేందుకు సాంకేతికతను జోడిస్తామని కేంద్ర హోంశాఖామంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం పేర్కొన్నారు. రాజ్‌నాథ్ సింగ్ అలీపూర్ ద్వారాలో ఒక ర్యాలీని సంబోధిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ సరిద్దుల నుంచి చొరబాట్లు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ విషయంలో సరిహద్దు ప్రాంతంలోని కొన్ని భూములను ఇవ్వాలని ఇప్పటికే కేంద్రం పశ్చిమ బెంగాల్‌కు విజ్ఞప్తి చేసిందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ విజ్ఞప్తిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇక తాము సాంకేతికత సహాయంతో ఈ రెండు రాష్ట్రాల వెంట ఉన్న సరిహద్దులను మూసివేయాలని నిర్ణయించామన్నారు. ఈ చర్యతో చొరబాట్లు, దొంగతనాలు, నకిలీనోట్లు దేశంలోకి రావడం లాంటి తదితర నేరపూరిత సంఘటనలు చోటు చేసుకోకుండా ఉంటాయని తద్వారా భారతదేశంలో శాంతి సౌభాగ్యాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. మమతా బెనర్జీని టార్గెట్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో మా, మాటి, మనుష్ (తల్లి, భూమి, మనిషి)లు సుఖంగా లేరన్నారు. పశ్చిమ బెంగాల్‌లో వందమంది బీజేపీ కార్యకర్తలను హత్య చేశారని ఆరోపించారు. ఈ రాష్ట్రంలో పశ్నించిన వారిని, ఎదురుతిరిగిన ఎవ్వరినీ వదలడం లేదన్నారు. పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ హత్యలు జరగవద్దని దీని కోసం బంగాల్‌లో 2021లో బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

పబ్జిని నిషేధించాలి

బాంబే హైకోర్టును ఆశ్రయించిన పదకొండేళ్ల బాలుడు



ముంబయి: ఆన్లైన్ గేమ్ పబ్జిపై నిషేధం విధించాలని కోరుతూ 11ఏళ్ల విద్యార్థి బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. అంతకు ముందు ఈ విషయంపై మహారాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్కు లేఖ రాసిన ఆ విద్యార్థి.. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. అహద్ నిజాం అనే విద్యార్థి తన కుటుంబంతో కలిసి ముంబయిలోని బంద్రాలో నివాసముంటున్నాడు. పబ్జి కారణంగా అనేక మంది విద్యార్థులు హింసకు ప్రేరేపితులవుతున్నారని, దీన్ని వెంట నే నిషేధించాలని కోరుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్రమంత్రికి లేఖ రాశాడు. తాజాగా తన తల్లితో కలిసి బాంబే హైకోర్టులో పిటిషన్ వేశాడు. అంతేగాక ఆన్‌లైన్‌లో ఇలాంటి హింసను ప్రేరేపించే కంటెంట్ను పరిశీలించడానికి ఓ ఆన్లైన్ ఎథిక్స్ రివ్యూ కమిటీని ఏర్పాటుచేసేలా కేంద్రప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని అహద్ తన పిటిషన్‌లో పేర్కొన్నాడు.

అంతకుముందు జమ్ము కశ్మీర్ విద్యార్థి యూనియన్ కూడా ఈ గేమ్‌పై నిషేధం విధించాలని ఆ రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ను కోరింది. పబ్జి వల్ల విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ పెట్టట్లేదని, తద్వారా పరీక్షల్లో ఫెయిల్ అవుతున్నారని విద్యార్థి యూనియన్ పేర్కొంది. కాగా.. ఇటీవలే గుజరాత్ ప్రభుత్వం దీనిపై ఆంక్షలు విధించింది. పబ్జిని నిషేధించాలని రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను ఆదేశించింది.

పబ్జి గేమ్ బారిన సుమారు 20 కోట్ల మంది పడ్డారని ఈ గ్రూప్ గేమ్స్ వల్ల వారు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, తిండి తిప్పలు కూడా పట్టించుకోవడం లేదని ఇటీవలే విడుదలైన ఓ సర్వే తేల్చింది. ఈ గేమ్ ఆడేవారు మానసిక ప్రశాంతతను కోల్పోయి చికాకు, ఆందోళన, ఆగ్రహం లాంటి గుణాలు అలవడుతున్నాయి. తేల్చింది.

కిసాన్ సమ్మాన్.. రైతుల జాబితా అందించాలి: కేంద్రం



ఢిల్లీ: తాత్కాలిక బడ్జెట్లో రైతుల కోసం ప్రవేశ పెట్టిన పెట్టుబడి సాయం పథకం అమలుపై కేంద్రం కసరత్తు ప్రారంభించింది. ఇందుకోసం వీలైనంత త్వరగా అర్హులైన రైతుల జాబితాను అందజేయాలని రాష్ట్రాలను కోరినట్లు నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ పథకం అన్ని రాష్ట్రాల్లో వేగంగా అమలవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఈశాన్య రాష్ట్రాల్లో భూ యాజమాన్య హక్కుల సమస్యల కారణంగా కొంత ఆలస్యం కావొచ్చని సందేహం వ్యక్తం చేశారు. పథకం అమలు చేసేందుకు యుద్ధప్రాతిపదికన కేంద్ర వ్యవసాయశాఖ చర్యలు చేపడుతోందని చెప్పారు. అర్హులందరికీ లబ్ధి చేకూరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. మొత్తం వ్యవసాయదారులను కాకుండా చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాను దృష్టిలో పెట్టుకొని ఈ పథకాన్ని తాత్కాలిక బడ్జెట్లో చేర్చారని పేర్కొన్నారు. శుక్రవారమే కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి కొన్ని రాష్ట్రాల కార్యదర్శులకు, వ్యవసాయ కార్యదర్శులకు లేఖ రాశారని చెప్పారు. వివిధ గ్రామాల్లో అర్హులైన రైతులను గుర్తించి, వాళ్ల పేరు, భూ విస్తీర్ణం తదితర వివరాలను నమోదు చేసి గ్రామపంచాయతీ కార్యాలయం నోటీస్బోర్డులో ప్రదర్శించాలని లేఖలో ఆదేశించినట్లు చెప్పారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాల తహసీల్దార్ కార్యాలయాల్లో భూముల వివరాలు డిజిటలైజేషన్ అయినందున అర్హుల వివరాలు సులభంగా తెలుసుకునే వీలుందని, దీంతో పథకం అమలు వేగంగా పూర్తవుతుందని ఆకాంక్షించారు. ఈశాన్య రాష్ట్రాల్లో భూమి హక్కులపై వివాదాలున్న కారణంగా ఆ రాష్ట్రాల్లో కొంత ఆలస్యం చోటు చేసుకోవచ్చని, దానికి కూడా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నట్లు వివరించారు. శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రైతుల కోసం ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని తీసుకొస్తున్నట్లు ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు.

ఢిల్లీలో భూ ప్రకంపనలు



న్యూఢిల్లీ: ఢిల్లీతోబాటు ఎన్‌సీఆర్ దాని దగ్గర ఉన్న ప్రాంతాల్లో శనివారం భూ ప్రకంపనలు సంభవించాయి. జమ్మూలో కూడా భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. భారత కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం 5 గంటల 34 నిమిషాల 44 సెకండ్ల ప్రాంతంలో భూ ప్రకంపనలు సంభవించాయి. భూకంప కేంద్రం హిందుకుష్ పర్వత శ్రేణుల్లో ఉన్నట్లుగా శాస్త్రవేత్తలు అంచనా వేశారు. హిందుకుష్ పర్వతశ్రేణి మధ్య ఆఫ్ఘానిస్థాన్ నుంచి ఉత్తర పాకిస్థాన్ వరకూ విస్తరించి ఉంది. ఇప్పటికే శాస్త్రవేత్తల అంచనా.. పలు నివేదికల ప్రకారం దేశంలోని 38 ప్రాంతాలు సిస్మిక్ జోన్(భూకంపం వచ్చే ఆస్కారాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు)గా గుర్తించాయి. దేశంలో 60 శాతం భూభాగాలు ఇవే కోవలో ఉంటాయంటున్నారు.

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ రికార్డుల ప్రకారం భూకంపాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టలేదని వెల్లడించారు. కానీ ఢిల్లీ మెట్రో రైల్ భూకంపం ఒక తీవ్రత వరకూ తట్టుకోగలదని పేర్కొన్నారు. రిక్టర్‌స్కేల్‌పై ఎంత మొత్తంలో కంపనాలు నమోదవుతాయో అంతే పెద్ద ఎత్తున భూమి కంపిస్తుంది. 2.9 గనుక ఉంటే కేవలం భూమి కంపిస్తుంది. అదే 7.9 రిక్టర్ స్కేల్‌పై కంపనాలు నమోదైతే భవంతులు, ఇళ్లు కూలిపోతాయి. జోన్ 5 భూకంప కేంద్రాలుగా ఢిల్లీ, పాట్నా, శ్రీనగర్, కోహిమా, పాండిచ్చేరి, గుహవాటి, గ్యాంగ్‌టక్, షిమ్లా, డెహ్రాడూన్, ఇంఫాల్ చండీఘడ్, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్, ఉత్తర బీహార్, అండమాన్ నికోబార్‌లు ఉన్నాయి. జోన్4–5 మధ్యలో అమృత్‌సర్, లూథియానా, రూర్కీలు ఉన్నాయి.

బీజేపీపై ఆప్ విమర్శలు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2019–20 తాత్కాలిక బడ్జెట్‌ను రెండో 'సర్జికల్ దాడి'గా బీజేపీ నేతలు అభివర్ణిస్తుండటాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ తప్పుపట్టింది. ఇది ఇండియా, పాకిస్థాన్ కాదు అని విరుచుకుపడింది. ఇలాంటి పదాలు వాడకుండా ప్రభుత్వం సంయమనం పాటించాలని హితవు పలికింది.

ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ శనివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, రైతులకు రోజుకు రూ.17 రూపాయలు ఇవ్వడాన్ని సర్జికల్ దాడులుగా పరిగణించలేమన్నారు. మీరు (కేంద్రం) రైతు రుణాలు మాఫీ చేశారా? బడా పారిశ్రామికవేత్తల రుణాలు మాఫీ చేశారు. రైతులకు రోజుకు రూ.17 రూపాయలు ఇస్తామని చెప్పి దాన్ని సర్జికల్ స్ట్రైక్స్‌గా చెప్పుకుంటున్నారు. ఇదేమైనా పాకిస్థానా? ఇది ఇండియా. అది మరచిపోవద్దు. కనీసం అలాంటి పదాలు వాడటమైనా మానేయాలి అని ఆయన అన్నారు. అంతకుముందు, బడ్జెట్‌పై కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాస్ స్పందిస్తూ, 2019 బడ్జెట్‌ను రెండో సర్జికల్ స్ట్రైక్స్‌గా అభివర్ణించారు.

73 వేల అస్సాల్ట్ రైఫిళ్ల కొనుగోలుకు ఓకే



న్యూఢిల్లీ: దేశ రక్షణ రంగాన్ని పటిష్టం చేసేందుకు మూడు లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శనివారంనాడు అమెరికా నుంచి 73,000 వేల అస్సాల్ట్ రైఫిళ్లను కొనుగోలు చేపట్టనుంది. ఈ రైఫిళ్ల కొనుగోలుకు సంబంధించి రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఓకే చేశారు. చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో పహారా కాస్తున్న భద్రతా బలగాలు ఈ రైఫిళ్లను వినియోగించనున్నారు. అమెరికా దళాలతో సహా ఈ రైఫిళ్లను యూరోపియన్ దేశాలు కూడా వినియోగిస్తున్నాయి. అధికారుల వివరాల ప్రకారం ఈ రైఫిళ్ల కొనుగోలు ప్రక్రియను తొందరలోనే చేపట్టనున్నారు. ఈ ఒప్పందం ఒక వారంలోగా పూర్తి అవుతుందని ఓ అధికారి తెలిపారు.ఒప్పందం అనంతరం అమెరికాకు ఒప్పందం చేసుకున్న తేదీ నుంచి ఒక సంవత్సరం నిర్ణీత గడువులోకి రైఫిళ్లను అప్పగించాల్సి ఉంటుంది. చైనా, పాకిస్థాన్ దేశాలే కాకుండా ఇతర దేశాల్లో కూడా భద్రత కోసం వినియోగిస్తున్న సాంకేతికతతో కూడుకొని ఉన్న ఆయుధాలను భారత రక్షణ రంగం సమకూర్చుకోనుంది. 2017 అక్టోబర్‌లో 7 లక్షల రైఫిళ్లు, 44వేల లైట్ మిషన్ గన్, 44,600 కార్బన్‌లు కొనే ప్రక్రియను మొదలు పెట్టింది. ఈషాపూర్‌లో తయారైన అస్సాల్ట్ రైఫిళ్లను 18 నెలల క్రితం భారత ప్రభుత్వం విఫలమైనవిగా ప్రకటించింది. అనంతరం ప్రపంచమార్కెట్‌లోని రైఫిళ్ల కొనే యత్నాన్ని వేగం చేసింది. పాత రైఫిళ్లను పూర్తిగా పక్కన పెట్టేయాలంటే భారత సైన్యానికి 7.62 శాతం ఎక్కువగా 51 మి.మి. 7 లక్షల అస్సాల్ట్ రైఫిళ్లు కావాల్సి ఉంది.


మంచుతో హిమాచల్ గజగజ



సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌ను తాజా హిమపాతం వణికిస్తోంది. కులు తదితర పర్వత ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా అధికారులు ట్రాఫిక్‌ను నిలిపివేశారు. హిమాచల్‌ప్రదేశ్ వ్యాప్తంగా మంచు కారణంగా 413 రహదారులను మూసివేసినట్లు అధికారులు తెలిపారు. 206 యంత్రాలతో మంచును తొలగించే ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. శనివారం హిమాచల్‌ప్రదేశ్ ఉష్ణోగ్రతలు మైనస్ 3 డిగ్రీలకు పతనమయ్యే అవకాశం ఉందని వాతావరణ విభాగం అంచనా వేసింది.

ఇదే పరిస్థితి వచ్చే వారం కూడా కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. మంచు కారణంగా 1760 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినగా.. 1300 ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వాటికి మరమ్మతులు చేసి త్వరలోనే పునరుద్ధరిస్తామని వెల్లడించారు. మరోవైపు రహదారులన్నీ మూసివేయడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. చలికి బయటికి వెళ్లలేక ఇంట్లోని తినడానికి ఏమైనా తెచ్చుకుందామంటే బయటి దుకాణాలు కూడా మూసి ఉండడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

మనోభావాలు దెబ్బతింటే క్షమించండి'



పనాజీ: గోవా ముఖ్యమంత్రి మనోహర్ పరికర్‌ను జీసస్‌తో పోల్చి.. క్రిస్టియన్ల మనోభావాలు దెబ్బతీశారంటూ తనపై కాంగ్రెస్ పార్టీ తనపై చేస్తున్న విమర్శలపై గోవా మంత్రి విజయ్ సర్దేశాయి స్పందించారు. 'ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే నన్ను క్షమించండి. అయితే నాదొక విన్నపం. దయచేసి కాంగ్రెస్ పార్టీ పన్నిన వలలో చిక్కుకోకండి. మనుషుల మధ్య సఖ్యతకు బంధాలే వారధులని.. పరికర్ ఆ విషయంలో విజయవంతమయ్యారని తాను అంటే.. కొందరేమో కాంక్రీటు బ్రిడ్జిల గురించి మాట్లాడి రాజకీయం చేస్తున్నారు' అని శనివారం ఆయన వివరణ ఇచ్చారు.

ఈ నేపథ్యంలో విజయ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ఆ పార్టీ అధికార ప్రతినిధి రోహిత్ బ్రాస్ డేసా మాట్లాడుతూ.. పరికర్‌ను దేవుడితో పోల్చి విజయ్ క్రిస్టియన్లను అవమానించారంటూ విమర్శించారు. ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక గోవా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందినప్పటికీ.. గోవా ఫార్వర్డ్ పార్టీతో కలిసి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల ప్రచారంలో బీజేపీని తీవ్రంగా విమర్శించిన విజయ్ సర్దేశాయి(గోవా ఫార్వర్డ్ పార్టీ)ఆ పార్టీతో చేతులు కలపడంతో.. సొంత పార్టీ నేతల నుంచే వ్యతిరేకత ఎదుర్కొన్నారు. తాజాగా స్పందించిన ఆయన క్షమాపణలు చెప్పారు.

చత్తీస్‌గడ్‌లో ఎన్‌కౌంటర్



చత్తీస్‌ఘడ్: కొంతకాలం విరామం తరువాత చత్తీస్‌గడ్ దండకారణ్యంలో మరోమారు తూటాల వర్షం కురిసింది. పచ్చని అభయారణ్యంలో నెత్తుటేర్లు పారాయి. మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులకు తీవ్రగాయాలు కాగా చికిత్స పొందుతూ ఒక మహిళ మృతి చెందింది. బస్తర్ రేంజ్ డీఐజీ పి.సుందర్ రాజన్ ఇందుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు.

సుక్మా జిల్లా పూసవాడ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు గాలింపులు చేపడుతున్నాయి. ఈ క్రమంలో అదే ప్రాంతంలో అంబుష్ వేసిన మావోయిస్టులు భద్రత బలగాలపై కాల్పులకు పాల్పడ్డారు. దీంతో వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులు జరిపారు. సుమారు 20 నిమిషాల పాటు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మహిళా మావోయిస్టులు తీవ్రంగా గాయపడ్డారు. కాల్పుల విరమణ అనంతరం రక్తపు మడుగుల్లో పడి ఉన్న వారిని జవాన్లు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అందులో తీవ్రంగా గాయపడిన ఓ మహిళా మావోయిస్టు పరిస్థితి విషమించి మృతి చెందింది. సంఘటనా స్థలంలో మావోయిస్టులకు సంబంధించిన వస్తుసామాగ్రి, ఆయుధాలను జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మరికొందరు మావోయిస్టులు గాయపడినట్లు పోలీస్ అధికారులు భావిస్తున్నారు.

ఈ ఘటనతో సమీప గ్రామాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. భద్రతను మరింత పటిష్టం చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

బస్సులో షూటవుట్

బీహార్: బీహార్‌లో పట్టపగలు.. ప్రజలంతా చూస్తుండగా లైవ్ ఎన్‌కౌంటర్ జరిగింది. ముజఫర్పూర్ బస్టాండ్‌లో ఆగివున్న బస్సులో నక్కిన క్రిమినల్‌ను పోలీసులు మట్టుబెట్టారు. సినీఫక్కీలో జరిగిన ఈ ఘటన వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఓ ముఠాకు చెందిన పది మంది నేరగాళ్లు బస్సులో కూర్చున్న కుందన్ సింగ్ అనే వ్యక్తిపై కాల్పులు జరిపారు. దీంతో ఆ బస్సులోని ప్రయాణికులు భయంతో బస్సు దిగి పరుగులు పెట్టారు. ఈ సమాచారం తెలియగానే అక్కడే పహారా కాస్తున్న సాయుధ పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు.

పారిపోతున్న ఓ నేరగాడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బస్సులో నక్కిన ఇంకో నేరగాడు లొంగిపోకుండా పోలీసులపైకి విచ్చలవిడిగా కాల్పులు జరపడం మొదలెట్టాడు. పోలీసులు పలుమార్లు హెచ్చరించిన క్రిమినల్ అతని పంథా వీడలేదు. దీంతో పోలీసులు అతనిపైకి ఎదురు కాల్పులు జరిపారు. బస్సు అద్దం పగలగొట్టి మరీ నేరగాడిని షూట్ చేశారు. దీంతో ఆ నేరగాడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఎన్‌కౌంటర్ జరుగుతున్న సమయంలో బస్సులో నుంచి దిగిన మిగతా ప్రయాణికులు, రోడ్డున పోయే జనాలు కూడా 'వాడిని చంపేయండి.. చంపేయండి' అంటూ కేకలు పెట్టడం గమనార్హం.

మోదీ పర్యటన.. హురియత్ నేత నిర్బంధం





శ్రీనగర్: మితావాద హురియత్ కాన్ఫరెన్స్ చైర్మన్ మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్‌ను జమ్మూ కశ్మీర్ పోలీసులు గృహ నిర్బంధం విధించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూసేందుకే మిర్వాయిజ్‌ను హౌస్ అరెస్టు చేసినట్టు అధికారులు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం జమ్మూ కశ్మీర్ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో వేర్పాటువాదులు రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో ముందు జాగ్రత్తగా మిర్వాయిజ్‌ను గృహ నిర్బంధంలో ఉంచినట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం శ్రీనగర్‌లోని నిగీన్ ప్రాంతంలో ఉన్న మిర్వాయిజ్ నివాసం వద్ద పెద్దఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. కాగా ప్రధాని పర్యటన నేపథ్యంలో ప్రభుత్వం భయానక వాతావరణాన్ని సృష్టిస్తోందంటూ మిర్వాయిజ్ ట్విటర్‌లో ఆరోపించారు. 'నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వం పానిక్ బటన్ను నొక్కేసింది. నియంత్రణ కఠినతరం చేసింది. లాల్ చౌక్‌లో సైతం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇవాళ ఉదయం నుంచి నన్ను హౌస్ అరెస్ట్‌లో ఉంచారు' అని మిర్వాయిజ్ ట్వీట్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం జమ్మూ కశ్మీర్‌లోని మొత్తం మూడు ప్రాంతాల్లోనూ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు.

మెట్రో రైలులో గర్భిణీపై సెక్యూరిటీ గార్డుల దాడి

స్వీడన్: స్టాక్ హోంలో తన కుమార్తెతో కలసి మెట్రో రైలులో ప్రయాణిస్తున్న ఓ మహిళపై సెక్యూరిటీ గార్డులు దాడి చేసిన సంఘటన స్వీడన్‌లో కలకలం రేపింది. మెట్రో అధికారుల కథనం ప్రకారం ఆ మహిళ మెట్రో రైలులో వెళుతుండగా టికెట్ తనిఖీ చేసారు. ఈ తనిఖీల్లో ఆవిడ తన కుమార్తెకు టికెట్ తీసుకోని విషయం బయటపడింది. కొంతసేపు వాగ్వాదం తర్వాత సెక్యూరిటీ గార్డులు ఆవిడను రైలులోంచి నెట్టి వేసారు. ఈ సంఘటనతో ఆవిడ కూతురు కూడా బాగా భయపడిపోయింది. ఆవిడ గర్భవతి అని, సెక్యూరిటీ గార్డులు కిరాతకంగా ప్రవర్తించారని పలువురు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఈ విషయం వైరల్ అయింది. దీంతో అధికారులు ఆవిడను ఆస్పత్రిలో చేర్పించి చికిత్సను అందిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి అధికారులు ఇద్దరు సెక్యూరిటీ గార్డులను సస్పెండ్ చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయపరమైన సహకార చర్యల్లో 'ఆటా'

- ఆటా అధ్యక్షుడు పరమేశ్ భీంరెడ్డి



అమెరికా: అమెరికాలో వీసా సమస్యల కారణంగా అరెస్టయిన విద్యార్థులకు అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) న్యాయపరమైన సహకారాలన్నీ అందిస్తున్నది. ఆ వర్సిటీలో అడ్మిషన్పొందిన తెలుగు విద్యార్థులంతా అరెస్టయ్యారనేది అవాస్తవం. 50100 మంది వరకు మాత్రమే అరెస్టు అయ్యారు. శాన్ఫ్రాన్సిస్కోలో అరెస్టుచేసిన 14 మందిని విడిచిపెట్టారు. వారు తిరిగి భారత్కు వెళ్లేందుకు అనుమతించారు. వివిధ సెంటర్లలో ఉన్న వారిని ఇంకా విడిచిపెట్టలేదు. వారిని జడ్జి ముందు ప్రవేశడుతారు.



నిను వీడని మంచును నీనే...

వాషింగ్టన్: అమెరికాలోని తూర్పు తీర ప్రాంతాలను కమ్మిన మంచు తెరలు వీడటంలేదు. మూడు రోజుల నుంచీ ఇక్కడ పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మైనస్లలో నమోదవుతున్నాయి. న్యూయార్క్ నగరంలోని బ్రైంట్ పార్క్‌లో అయితే ఫౌంటెయిన్ నుంచి వెలువడిన నీరు ఇలా గడ్డకట్టుకుపోయింది.

అరెస్టైన వారిలో 129 మంది భారతీయులు

విద్యార్థుల కోసం హాట్‌లైన్ తెరిచిన భారత ఎంబసీ

వాషింగ్టన్: అమెరికాలో నకిలీ విద్యార్థి వీసా రాకెట్ కలకలం సృష్టించింది. విద్యార్థి వీసా ముసుగులో వందల మంది విదేశీయులకు అమెరికాలో అక్రమంగా నివసించేందుకు, ఉద్యోగం చేసుకునేందుకు వీలు కల్పించిన 8 మంది దళారులను ఇక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు అరెస్టు చేశారు. నకిలీ విద్యార్థి వీసాలతో అక్రమంగా తమ దేశంలో ఉంటున్న 130 మంది విదేశీయులను కూడా అదుపులోకి తీసుకున్నారు. కాగా.. వీరిలో 129 మంది భారతీయులేనని అధికారులు తాజాగా వెల్లడించారు. మరోవైపు అరెస్టయిన విద్యార్థులకు సాయం చేసేందుకు అమెరికాలోని భారత ఎంబసీ 24 గంటల పాటు పని చేసే హాట్‌లైన్ తెరిచింది. విద్యార్థులు, వాటి కుటుంబ సభ్యులకు నిరంతరం అందుబాటులో ఉండేందుకు ఓ నోడల్ అధికారిని కూడా నియమించింది. టెక్సాస్‌లోని డిటెన్షన్ సెంటర్లో ఉన్న భారత విద్యార్థులను అక్కడి భారత కాన్సులేట్ అధికారులు కలిశారు. విద్యార్థులకు అన్ని విధాల సాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఇదిలా ఉండగాఅండర్ కవర్ ఆపరేషన్లో భాగంగా అధికారులు ప్రారంభించిన ఫార్మింగ్టన్ యూనివర్శిటీ నకిలీదని విద్యార్థులకు తెలియదని ఇమ్మిగ్రేషన్ అటార్నీ అధికారులు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో ఫెడరల్ అధికారుల తీరును తప్పుబట్టారు. అమెరికాలో కొన్ని యూనివర్శిటీలు తొలి రోజు నుంచే కరిక్యులర్ ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తాయని, ఇది కూడా అలాంటిదేనని భావించి విద్యార్థులు చేరినట్లు తమకు తెలిసిందని అట్లాంటా అటార్నీ మైఖేల్ సోఫో తెలిపారు. విద్యార్థి వీసా కార్యక్రమాన్ని దుర్వినియోగం చేసేవారిని వలపన్ని పట్టుకోవాలని అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్ఫోర్స్మెంట్ (ఐసీఈ) అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఐసీఈలోని అంతర్గత భద్రత దర్యాప్తు (హెచ్ఎస్ఐ)కు చెందిన ప్రత్యేక ఏజెంట్లు మిషిగన్ రాష్ట్రంలోని ఫార్మింగ్టన్ హిల్స్లో 'ఫార్మింగ్టన్ విశ్వవిద్యాలయం' పేరుతో ఒక నకిలీ విద్యా సంస్థను ఏర్పాటు చేశారు. డెట్రాయిట్ ప్రాంతంలోని ఒక చిన్న భవనంలో దీన్ని నిర్వహించారు. వర్సిటీకి సంబంధించిన సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ విషయం తెలియని 8 మంది ఈ వర్సిటీలో 600 మందికిపైగా విద్యార్థులను చేర్చేందుకు ప్రయత్నించి, అధికారుల వలలో చిక్కారు. ఈ 8 మందిని అరెస్టు చేసిన అధికారులు గురువారం నాటికి 130 మంది విద్యార్థులను కూడా అదుపులోకి తీసుకున్నారు. మిగతా వారిపై కూడా నిఘా పెట్టినట్లు తెలుస్తోంది.

సాయానికి ముందుకొచ్చిన నాటా

- ఉచిత న్యాయసహాయానికి సిద్ధం

న్యూజెర్సీ : ఫర్మింగ్టన్ ఫేక్ యూనివర్సిటీ వ్యవహారంలో అరెస్టయిన తెలుగు విద్యార్థులకు సాయం చేసేందుకు నార్త్ అమెరికన్ తెలుగు అసోషియేషన్ (నాటా) ముందుకొచ్చింది. ఫర్మింగ్టన్ యూనివర్సిటీ ఫేక్ అని తెలియక చాలా మంది విద్యార్థులు మోసపోయారని నాటా ప్రెసిడెంట్ డాక్టర్ గోసల రాఘవ రెడ్డి, కార్యదర్శి ఆళ్ళ రామిరెడ్డి అన్నారు. బాధితుల్లో ఎక్కువ మంది తెలుగు విద్యార్థులే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టయిన వారిలో చాలామంది తమ వర్క్ పర్మిట్ పొందడానికి ఈ యూనివర్సిటీలో చేరానని వెల్లడించారు. బాధిత విద్యార్థులు నాటాకు ఫోన్ చేసి పరిస్థితి వివరించారని తెలిపారు. విద్యార్థులకు ఉచిత న్యాయసహాయం అందిస్తామని నాటా నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇమ్మిగ్రేషన్ లాయర్లు విజయ్ ఎల్లారెడ్డిగారి, సంతోష్రెడ్డి సోమిరెడ్డి, యాయా తిబిట్ బాధిత విద్యార్థులతో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, వలసదారుల హక్కులేమిటో తెలిపారని, మళ్లీ ఇలాంటి ఘటనల్లో బాధితులు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారని తెలిపారు.

తల్లిదండ్రులు భయపడొద్దు..

అరెస్టయిన విద్యార్థుల తల్లిదండ్రులు భయపడాల్సిన పనిలేదని నాటా నాయకులు తెలిపారు. విచారరణ పూర్తయిన అనంతరం విద్యార్థుల భారత్కు పంపుతారని వెల్లడించారు. హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ శాఖ నిర్బంధంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని భరోసానిచ్చారు.

వివరాలు తెలుసుకోవాలంటే..

అరెస్టయిన వారి వివరాలు తెలుసుకోవాలంటే https://locator.ice.gov వెబ్సైట్లో లేదా ఇండియన్ ఎంబసీ వారికి {(202) 3221190, (202) 3402590} ఫోన్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు. వివరాలకోసం.. cons3.washington@mea.gov.in కి ఈమెయిల్ చేయవచ్చని తెలిపారు. కష్టపడి చదివిన విద్యార్థులా ఫేక్ యూనివర్సిటీల ఉచ్చులో పడకుండా.. అన్ని రూల్స్ పాటించి ప్రముఖ విశ్వవిద్యాలయాల నుంచి OPT/CPT పొందడం కోసం కృషి చేయాలని సలహా ఇచ్చారు. ఎటువంటి కోర్సులు లేకుండా ఏ యూనివర్సిటీ అయినా CPT అందించినట్టయితే అలాంటి వర్సిటీలను నమొద్దని హెచ్చరించారు.



వేడి నీటిని గాల్లోకి విసిరితే..

వాషింగ్టన్: అమెరికాలోని మిడ్వెస్ట్ ప్రాంతం చలికి ఎంతలా గజగజలాడుతున్నదో మనకు తెలుసు. అమెరికా చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో అంటార్కిటికా కంటే తక్కువ ఉష్ణోగ్రతలు ఆ ప్రాంతంలో నమోదవుతున్నాయి. ఇప్పటికే మైనస్ 50 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ అక్కడి ప్రజలు ఎంటర్టైన్మెంట్ను వెతుక్కుంటున్నారు. మరుగుతున్న నీటిని గాల్లోకి విసురుతూ వీడియోలు తీసి సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తున్నారు. ఆ నీటిని గాల్లోకి విసరగానే అవి గడ్డ కట్టిపోవడం మనం ఈ వీడియోల్లో చూడొచ్చు. ప్రస్తుతం ట్విటర్ మొత్తం ఇలాంటి వీడియోలతో నిండిపోయింది. ఇప్పటికే కుంచించుకుపోతున్న రైలు పట్టాలను సాధారణ స్థితికి తీసుకురావడానికి వాటిని తగులబెడుతున్న వీడియోలను మనం చూశాం. తాజాగా ఈ వేడి నీళ్లు విసిరే వీడియోలు అమెరికా పరిస్థితికి అద్దం పడుతున్నాయి.



ఫిబ్రవరి 14న సిస్టర్స్ డే..!

పాకిస్తాన్: ఫిబ్రవరి 14 తేదీ ప్రపంచలోనే చాలా ప్రత్యేకం. ప్రేమికులరోజుగా పలు దేశాల్లో ప్రేమ జంటలు తమదైన రోజుగా స్వేచ్ఛగా విహరిస్తుంటాయి. అయితే పాకిస్థాన్ మాత్రం వాలెంటైన్స్ డే (ప్రేమికుల దినోత్సవం)ను పూర్తిగా వ్యతిరేకిస్తోంది. గత రెండేళ్లుగా వాలెంటైన్స్ డేపై పాకిస్థాన్లో నిషేధం కొనసాగుతోంది. ఇస్లామాబాద్ హైకోర్టు ప్రేమికుల దినోత్సవాన్ని జరపడాన్ని నిషేధించిన విషయం తెలిసిందే. వేడుకలు నిర్వహించవద్దని, వీటికి సంబంధించిన కథనాలు కూడా ప్రచురించవద్దని ఆదేశాలు జారీ చేసింది. వాలెంటైన్స్ డేను నిషేధించడం మాత్రమే కాదు, అలాంటి సంప్రదాయాలను మరిచిపోవాలంటే ఫిబ్రవరి 14ను 'సిస్టర్స్ డే' నిర్వహించుకోవాలని ఫైసలాబాద్ అగ్రికల్చర్ యూనివర్సిటీ నిర్ణయించింది. ఆ రోజు ముస్లిం విద్యార్థినులకు, మహిళలకు దుస్తులు, స్కార్ఫ్లు అందజేయాలని సూచించారు. ఈ మేరకు వర్సిటీ వైస్ ఛాన్సర్, ఇతర బోర్డు సభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

పాక్ సంప్రదాయాలు, ఇస్లాం సంప్రదాయాలపై అవగాహన పెరగాలంటే ఇలాంటివి తప్పవనిరు వైస్ చాన్సలర్ జాఫర్ ఇక్బాల్ రణ్ధవా అన్నారు. డాన్ న్యూస్ మీడియాతో వైస్ ఛాన్సర్ జాఫర్ ఇక్బాల్ మాట్లాడారు. 'పాశ్యాత్య విధానాలకు చరమగీతం పాడాలి. మహిళలపట్ల మాకు చాలా గౌరవం ఉంది. ప్రేమికులరోజు లాంటివి ఇస్లాం, పాక్ సంస్కృతిసంప్రదాయాలకు చెడ్డపేరు తీసుకొస్తాయి. అమ్మాయి, అబ్బాయి మధ్య ఉండే ప్రేమ సోదరుడుసోదరి మధ్య ఉండే అనుబంధం గొప్పది. అందుకే ఫిబ్రవరి 14న 'సిస్టర్స్ డే' నిర్వహించడం మంచి నిర్ణయమని' ఇక్బాల్ అభిప్రాయపడ్డారు.



ఆస్ట్రేలియాను ముంచెత్తుతున్న వరదలు

- జల దిగ్బంధంలో టౌన్స్‌విల్లే నగరం

టౌన్స్‌విల్లే: ఆస్ట్రేలియాలోని టౌన్స్విల్లే నగరాన్ని వరదలు ముంచెత్తుతున్నాయి. ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో టౌన్స్విల్లే జలదిగ్బంధమయ్యింది. లోతట్టు ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. స్థానికులు దిక్కుతోచని పరిస్థితిలో పడవల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ప్రభుత్వ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.



ఐఎన్ఎఫ్ నుంచి వైదొలగిన అమెరికా

- ఒప్పందాన్ని రష్యా ఉల్లంఘించిందన్న పాంపియో

వాషింగ్టన్: రష్యాతో కుదుర్చుకున్న ప్రచ్ఛన్న యుద్ధ కాలం నాటి ఐఎన్ఎఫ్ (ఇంటర్మీడియట్‌రేంజ్ న్యూక్లియర్ ఫోర్సెస్) ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్లు అమెరికా ప్రకటించింది. ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించి రష్యా క్షిపణులను తయారు చేసినందునే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మైక్ పాంపియో చెప్పారు. వైదొలిగే ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమై ఆర్నెల్లు కొనసాగుతుందనీ, ఆలోపు రష్యా తాను తయారు చేసిన ఆయుధాలను నాశనం చేసి చర్చలకు రావాలని కోరారు.

30 ఏళ్లకుపైగా ఈ ఒప్పందానికి అమెరికా కట్టుబడి ఉంది. కానీ రష్యా ఉల్లంఘనలకు పాల్పడుతున్నప్పుడు మేం కూడా ఈ ఒప్పందం నుంచి బయటకొస్తాం' అని పాంపియో తెలిపారు. ఈ ఆరు నెలల్లోపు రష్యా తన ఆయుధాలను నాశనం చేసి ఒప్పందానికి కట్టుబడుతుందని తాము భావిస్తున్నామన్నారు.

ప్రయాణికుడి బ్యాగులో చిరుత కూన

చెన్నై: చెన్నై విమానాశ్రయం నిఘా సిబ్బంది శనివారం ఉదయం దిమ్మతిరిగిపోయే షాక్కు గురయ్యారు. ఓ ప్రయాణికుడి బ్యాగును అనుమానం వచ్చి తనిఖీ చేసినప్పుడు అందులోంచి ఓ చిరుతపులి కూన బయటపడడమే అందుకు కారణం. అది చిన్నగా గుర్గుర్ అంటూ దిక్కులు చూస్తున్నది. భద్రతా సిబ్బంది దానిని ఓ తువ్వాలులో చుట్టి సీసాతో పాలు పట్టిస్తున్నారు. దాని వయసు ఓ నెల ఉంటుందని అంచనా. ఆ చిన్నారి చిరుతను చెన్నైలోని అన్నా జూపార్కుకు తరలిస్తున్నారు. చిరుతను బ్యాగులో దాచి తెస్తున్న ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తమిళనాడు అటవీ విభాగం అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారని తెలుస్తున్నది. వన్యప్రాణులను తరలించడం చట్టవిరుద్ధం.

పైగా నిందితుడైన ప్రయాణికుడు చిరుత కూన



ప్రాణాలకు హానికలిగే విధంగా దానిని బ్యాగులో దాచి తరలించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బ్రెజిల్లో విషాదం నింపిన మైనింగ్ డ్యామ్

- ప్రమాదకర స్థాయిలో నీటిమట్టం
- హెచ్చరికలు జారీ చేసిన అధికారులు
- దుర్ఘటనతో 40 మందికిపైగా మృతి

బ్రెజిల్: బ్రెజిల్లోని మినాస్ గేరియాస్ రాష్ట్రం బ్రుమాదిన్హో పట్టణంలో మరో మైనింగ్ డ్యామ్‌లో నీటి మట్టం ప్రమాదకర స్థాయిలో పెరగడంతో అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరించారు. వాడుకలో లేని మైనింగ్ వ్యర్థాల నిర్వహణ కోసం నిర్మించిన డ్యామ్ కూలడంతో సుమారు 320 మంది గల్లంతైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటివరకు 40 మంది మృతదేహాలను వెలికితీశారు. మృతులు ఇంకా వందల సంఖ్యలో ఉండే అవకాశం ఉందని స్థానిక అగ్నిమాపక సిబ్బంది, మైనింగ్ కంపెనీ అధికారులు తెలిపారు. తాజాగా ఇదే గని వద్ద మరో మైనింగ్ డ్యామ్‌లో నీటి మట్టం ప్రమాదకర స్థాయిలో పెరిగిన నేపథ్యంలో అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు ఎత్తైన ప్రదేశాలకు తరలివెళ్లాలని సూచించారు. జరిగిన దుర్ఘటనకు సంబంధించి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

బురద పేరుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం

బురద భారీగా పేరుకుపోవడంతో రహదారులు మూసుకుపోయాయి. దీంతో హెలికాప్టర్ల ద్వారా సహాయక చర్యలు చేపడుతున్నారు. దుర్ఘటనలో ఇప్పటివరకూ 170 మంది రక్షించామని, 23 మందిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించామని అధికారులు వెల్లడించారు. కూలిన డ్యామ్ 40 ఏండ్ల కిందట నిర్మించినదని, అది 86 మీటర్ల ఎత్తు ఉన్నట్లు వాలే కంపెనీ తెలిపింది. దాన్ని తొలిగించాల్సి ఉండగా, ఇంతలోనే కూలిందని పేర్కొంది. ఇటీవలే దేశ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన జైర్ బోల్సొనారో శనివారం ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాద స్థలిని చూసి భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయానని, సహాయక చర్యలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన ట్వీట్ చేశారు. 1000 మంది సైనికులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నట్లు మిలిటరీ వెల్లడించింది. బాధితులను రక్షించేందుకు ఇజ్రాయెల్ కూడా సహాయక సామగ్రితో పాటు 30 మంది సైనికులను పంపింది. దుర్ఘటన నేపథ్యంలో వాలే కంపెనీకి దేశ వాతావరణ పరిరక్షణ సంస్థ 66.5 కోట్ల డాలర్ల జరిమానా విధించింది. మినాస్ గేరియాస్ రాష్ట్ర ప్రభుత్వం కూడా మరో జరిమానా విధించేందుకు సిద్ధమైంది. వాలే కంపెనీకి చెందిన బ్యాంకు ఖాతాల్లో ఉన్న 27 కోట్ల డాలర్లను జప్తు చేసేందుకు ఇప్పటికే కోర్టు అనుమతులు పొందినట్లు అధికారులు తెలిపారు. దీనిని బాధితుల సహాయనిధికి జమచేయనున్నట్లు వెల్లడించారు.

పాక్‌లో భూకంపం..


పాకిస్థాన్: పాకిస్థాన్లో భూకంపం సంభవించింది. శనివారం సాయంత్రం 5.34 గంటలకు భూమి కంపించినట్లు అధికారులు వెల్లడించారు. రిక్టర్ స్కేల్ ప్రకంపనల తీవ్రత 6.1గా నమోదైందని ఐఎండీ వెల్లడించింది. ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న భారత్లోని ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా పలు చోట్ల స్వల్పంగా భూమి కంపించినట్లు సమాచారం.

ఇక ఎమర్జెన్సీయేనా..

వాషింగ్టన్: సరిహద్దు గోడ వివాదంతో అగ్రరాజ్యం అమెరికాలో ఇటీవల 35రోజుల పాటు ప్రభుత్వం స్తంభించిపోయింది. షట్డౌ డెమోక్రాట్ల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో దాన్ని తాత్కాలికంగా ఎత్తివేశారు. అయితే ప్రస్తుతం తాము ఎమర్జెన్సీకి దగ్గరవుతున్నామని ఆ దేశాధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో ఓ మీడియాతో మాట్లాడిన ట్రంప్.. మెక్సికో సరిహద్దులో గోడ నిర్మించేందుకు నిధులు కావాలంటే అత్యవసర పరిస్థితిని విధించాల్సిన అవసరం ఉందని, ప్రస్తుతం అందుకు దగ్గరగా ఉన్నామని పేర్కొన్నారు. సరిహద్దు భద్రతపై డెమోక్రాట్లతో చర్చలు జరపడం అంటే సమయాన్ని వృథా చేసుకోవడమే అని విమర్శించారు.

ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ చెడు రాజకీయాలను పాల్పడుతున్నారని ఆరోపించారు. సరిహద్దులో భద్రతా పెంచాల్సిన అవసరం ఉందని ఆమెకు తెలిసినా ఆ విషయం పట్టించుకోవట్లేదన్నారు. అక్రమ వలసదారుల గురించి ఎవరికీ పట్టట్లేదని దుయ్యబట్టారు. మెక్సికో సరిహద్దులో గోడను నిర్మించి తీరుతామని, దానివల్లే అక్రమ వలసదారులు దేశంలోకి రాకుండా ఆపగలమని ట్రంప్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

మెక్సికోలో సరిహద్దు గోడను నిర్మించేందుకు ట్రంప్ బిల్లు తీసుకొచ్చారు. అయితే ఈ బిల్లును డెమోక్రాట్లు అంగీకరించకపోవడంతో ప్రభుత్వాన్ని మూసివేశారు. గతవారమే షట్డౌన్ను తాత్కాలికంగా ఎత్తివేశారు. ఇదిలా ఉండగా అమెరికాలో అత్యవసర పరిస్థితిని విధించినట్లయితే కాంగ్రెస్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ట్రంప్ గోడ నిర్మాణాన్ని చేపట్టేందుకు వీలుంటుంది. అంతేగాక.. విపత్తు నిర్వహణ నిధులను కూడా గోడ నిర్మాణం కోసం ఉపయోగించుకునేందుకు ట్రంప్కు ప్రత్యేకాధికారాలు ఉంటాయి.



శంకరాభరణం.. నాలుగో దశాబ్దం!

సంగీతం నేపథ్యంలో కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'శంకరాభరణం'. సంగీతం అంటే దానికి ఒక గొప్ప పద్ధతి ఉంటుందని ఎంతో గొప్పగా చెప్పిన చిత్రమిది. జె.వి.సోమయాజులు ప్రధాన పాత్రధారిగా నటించిన ఈ సినిమాలో మంజు భార్గవి కథానాయికగా నటించారు. ప్రతిష్ఠాత్మక పూర్ణోదయ బ్యానర్ పై ఏడిద నాగేశ్వర రావు ఈ చిత్రాన్ని నిర్మించారు. శంకరాభరణం కథే ఓ ఆణిముత్యం. శంకరశాస్త్రిగా పేరుగాంచిన శంకరశాస్త్రి (జె వి సోమయాజులు) ఒక గొప్ప సంగీత విద్వాంసుడు. ఆయన సంగీతమంటే చెవి కోసుకునే వాళ్ళు చాలామంది ఉంటారు. ఒకానొక వేశ్య కూతురు, గొప్ప నర్తకి అయిన తులసి (మంజు భార్గవి) ఆ వృత్తిని అసహ్యించుకుంటుంది. కళలను ఆరాధించే తులసి, శంకరశాస్రిని గురుభావంతో ఆరాధిస్తుంది. ఆయన దగ్గర సంగీతం నేర్చుకోవాలని ఆశపడుతుంది. కానీ ఆమె తల్లి మాత్రం ఆ వృత్తిలోనే కొనసాగాలని పట్టుబడుతుంది. ఆమెను బలాత్కరించి శంకర శాస్త్రిని తులనాడిన ఒక విటుణ్ణి విధిలేని పరిస్థితులలో హతమారుస్తుంది. వేశ్యకు ఆశ్రయం ఇవ్వడంతో శంకరశాస్త్రిని అందరూ చిన్న చూపు చూడడం మొదలు పెడతారు. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే కథ. నాలుగు జాతీయ అవార్డులు, ఐదు నందులు గెలుచుకున్న మేటి చిత్రంగా నిలిచింది. ఈ ఆణిముత్యం విడుదలై నేటికి 39 సంవత్సరాలు (02/02/1980) పూర్తయింది. 02 ఫిబ్రవరి 2020 నాటికి నాలుగు దశాబ్దాలు పూర్తవుతుంది.



కోపమా నాపైన!

గాసిప్పులపై ఒక్కొక్కరి స్ప ందన ఒక్కోలా ఉంటుంది. అందాల కథానాయిక రష్మిక మందన తనపై వచ్చే గాసిప్పులపై ఇదివరకూ సీరియస్ అయ్యేది. కన్నడ పరిశ్రమ ను వదిలేసి తెలుగు సినీపరిశ్రమకు వెళ్లిపోయిందని, ఆ క్రమంలోనే తనని ప్రేమించిన యువకుడిని దూరం చేసుకుందని అభిమానులు సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్ చేశారు. వాటిపై తనదైన శైలిలో అప్పట్లో సమాధానం ఇచ్చింది రష్మిక. తాజాగా ఈ భామ తనపై ఓ వెబ్ మీడియాలో వచ్చిన వార్తలకు కాస్తంత సెటైరికల్ గానే స్ప ందించింది. కన్నడ పరిశ్రమపై నేను కోపంగా ఉన్నానని రాశారు. సొంత పరిశ్రమపై ఎవరైనా అలా ఉంటారా ? ఉంటే ఆధారాలు చూపండి! అని అంది. రష్మిక విషయంలో అప్సెట్ అయిన కన్నడ చిత్ర పరిశ్రమ అంటూ రాశారు. ఆ ధారాలు లేనిదే నమ్మను. ఇలా అడుగుతున్నానని మరోలా అనుకోకండి. ఆధారం ఉంటే నాకు మెసేజ్ చేయండి అంటూ నవ్వేసింది రష్మిక. ఈ అమ్మడు ఛలో, గీత గోవిందం, దేవదాసు చిత్రాల తర్వాత దేవరకొండ సరసన డియర్ కామ్రేడ్ చిత్రంలో నటిస్తోంది. నితిన్ సరసన వెంకీ కుడుముల దర్శకత్వంలో భీష్మ అనే చిత్రంలో అవకాశం అందుకుంది. యజమాన, పొగరు అనే కన్నడ చిత్రాల్లోనూ నాయిక గా నటిస్తోంది.



సింగిల్ విండో పై హర్షం

కేంద్రం తాజా బడ్జెట్‌లో వినోదరంగంపై తీసుకున్న నిర్ణయాలపై హర్షం వ్యక్తమవుతోంది. 28 శాతం జీఎస్టీ చెల్లింపు.. టిక్కెట్టు పై వడ్డనలు అంటూ తెగ భయపెట్టేసిన కేంద్రం ప్రస్తుతం దిగొచ్చింది. బడ్జెట్‌లోనే ఊరట కలిగించే నిర్ణయాల్ని ప్రకటించి కొంతవరకూ మేలు చేయడంపై టాలీవుడ్ లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ఇంతకీ కేంద్ర బడ్జెట్‌లో కీలకంగా తీసుకున్న నిర్ణయం ఏది? అంటే...తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో జీఎస్టీ దెబ్బకు కునారిల్లుతున్న సినీ రంగంపై వరాల జల్లు కురిపించారు. ఇకపై ప్రాంతీయ చిత్రాలకు సింగిల్ విండో పద్ధతిలో షూటింగ్‌లకు అనుమతి ఇవ్వనున్నట్టుగా ప్రకటించారు. ఇప్పటి వరకు విదేశీ చిత్రాలకు మాత్రమే ఈ విధానం అమల్లో ఉంది. తాజా ప్రకటనతో స్వదేశీ చిత్రాలకు ఈ విధానం అమలవుతుంది. సినిమా టికెట్లపై ఇదివరకూ రూ.18 శాతం నుంచి 28 శాతం వరకూ టిక్కెట్టు బాదుడు ఉండేది. దానిని (జీఎస్టీని) 12 శాతానికి తగ్గిస్తున్నట్టుగా బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. సినీరంగాన్ని పట్టి పీడిస్తున్న పైరసీని అరికట్టేందుకు యాంటీ కామ్ కార్డింగ్ ప్రొవిజన్ యాక్ట్‌ను సినిమాటోగ్రఫీ చట్టానికి జత చేయనున్నట్టుగా ప్రకటన వెలువడింది. ఈ నిర్ణయాలతో ఇకపై వినోద రంగం మరింతగా పరుగులు పెట్టేందుకు ఆస్కారం లభించనుంది. అయితే ప్రకటనలు ఘనం.. పనులు శూన్యం అన్న చందంగా కాకుండా యుద్ధప్రాతిపదికన ఈ విధానాన్ని వెంటనే అమలు చేయాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.



యాత్ర ఈవెంట్‌లో మహి.వి. రాఘవ్


ఇడుపులపాయకు వినిపించాలి!

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జీవిత చరిత్రలో ఆయన చేపట్టిన పాదయాత్రలోని కీలక ఘట్టాలను ఆధారంగా చేసుకుని రూపొందించిన సినిమా 'యాత్ర'. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి పాత్రలో నటించారు. 70 ఎం.ఎం.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై మహి.వి.రాఘవ్ దర్శకత్వంలో విజయ్ చిల్లా, శశిదేవి రెడ్డి నిర్మించారు. ఫిబ్రవరి 8న విడుదల కానుంది. హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుక ఆద్యంతం వైయస్ – జగన్ అభిమానుల సమక్షంలో ఎమోషనల్ గా సాగింది.

నిర్మాత విజయ్ చిల్లా మాట్లాడుతూ "ఒక వారం రోజులుగా నా స్నేహితుడు శశి యు.ఎస్‌లో సినిమాను ప్రమోట్ చేస్తూ బిజీగా ఉన్నారు. శ్యామ్ దత్తా వల్లే ఈ సినిమా చేస్తున్నాం. ఆయనే ఈ సినిమా కథను మమ్ముట్టి వద్దకు తీసుకెళ్లారు. మమ్ముట్టి మా కథను నమ్మడమే కాదు.. గొప్ప సహకారం అందించారు. అందుకు ఆయనకు థాంక్స్. మా సినిమాటోగ్రాఫర్ సత్య, మ్యూజిక్ డైరెక్టర్ కె, ఆర్ట్ డైరెక్టర్స్ రామకృష్ణ, మోనికగారు, ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ బ్యాక్‌బోన్‌గా నిలిచారు. సీతారామశాస్త్రి ఐదు పాటలను ఐదు సన్నివేశానికి తగ్గట్టు రాశారు. పెంచలదాస్‌కి థాంక్స్. డైరెక్టర్ మహి మంచి మనసున్న వ్యక్తి. . ఫిబ్రవరి 8న సినిమా విడుదలవుతుంది. వై.ఎస్.ఆర్‌గారి ఫ్యాన్స్‌కే కాదు.. ప్రతి కుటుంబం సినిమా చూసి వై.ఎస్.ఆర్గారి ఆత్మ, స్ఫూర్తిని ఈ సినిమాలో చూడొచ్చు" అన్నారు. మహి.వి.రాఘవ్ మాట్లాడుతూ "మమ్ముట్టిగారికి నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఈ సినిమాలో చూసిన యాక్టింగ్ అంతా ఆయన గొప్పతనమే. ఆయనతో పనిచేసే అవకాశం ఇచ్చినందుకు థాంక్స్. ఓ మెంటార్‌గా నన్ను నడిపించారు. ఓ సినిమా అనేది మొత్తం టీమ్‌కు సంబంధించిన వర్క్, కథ మాత్రమే నాది. అక్కడి నుండి సినిమాగా రూపొందే క్రమంలో నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎందరో సహకారం అందించారు. అందుకని ఈ సినిమా నాది అని చెప్పుకోను. సత్య గొప్ప విజువల్స్ అందించారు. కె గారు గొప్ప సంగీతం అందించారు. ఆర్ట్ డైరెక్టర్స్ రామకృష్ణ, మోనికగారు సపోర్ట్ చేశారు. నేను చాలా హ్యాపీగా సినిమా చేశాను. నాకు సహకరించిన నా టీంకు థాంక్స్. నేను నిర్మాతగా కెరీర్‌ను అనుకోకుండా ప్రారంభించాను. నేను డైరెక్టర్‌గా మారడానికి కారణం విజయ్, శశియే కారణం. ఇక సినిమా విషయానికి వస్తే.. నాకు, వై.ఎస్.ఆర్‌కి ఏ సంబంధం లేదు. ఇలాంటి కథలను ఎందరో ఎన్నో రకాలుగా చెప్పి ఉండొచ్చు. అలాంటి కథలను వినడం వల్లనే నేను రాజశేఖర్‌రెడ్డిగారి కథ చేద్దామని అనుకున్నాను. మా అమ్మగారిది కడప దగ్గర చిన్న ఊరు. అక్కడ పుట్టడం వల్ల మాకు నొప్పి ఓర్చుకునే బలం, ఓపిక మరొకరికి ఉండదు. అది మంచితనమో, మూర్ఖత్వమో అనుకోండి. జగనన్న గురించి ఓ విషయం చెప్పాలి. నేను ఎక్కడికైనా దూకిన తర్వాత ఆలోచిద్దాంలే అనుకునే టైప్. స్క్రిప్ట్ అంతా రాసేశాను. మమ్ముట్టిగారు రెడీ అయిపోయారు. నేను గోదావరి జిల్లాలో జగన్ అన్నను కలిసి ఇలా నేను పాదయాత్రపై సినిమా చేద్దామని అనుకుంటున్నాను అని చెప్పాను. మా నాయన ఏం చేశాడో చూపించు, ఆయన చేయని దానికి క్రెడిట్ ఆపాదించొద్దు అన్నారు. సినిమా మొత్తం పూర్తయిన తర్వాత ట్రైలర్ చూడమంటే చూసి బావుందన్నారు. సినిమా చూస్తారా? అన్న.. అన్నాను. "మీ నాయకుడు కథ మీరు చెప్పారు నన్నేం చేయమంటారు" అన్నారే కానీ.. మా నాన్న కథ అని అనలేదు. అది ఆయన గొప్పతనం. ఎవరినైనా ప్రత్యేక అతిథుల్ని పిలుద్దామా అని అనుకున్నాం కానీ.. ఆయన అభిమానులను పిలవాలని నిర్ణయించుకున్నాం. ఇది అందరి సినిమా. ఎమోషనల్‌గా, నిజాయితీగా ఉండే సినిమా. చూసినప్పుడు రియల్‌గా ఫీలవుతారు" అన్నారు. అభిమానులనుద్దేశించి మాట్లాడుతూ .. మీరు ఇక్కడ అరిస్తే ఇడుపులపాయకు వినిపించాలి అని అన్నారు. మమ్ముట్టి మాట్లాడుతూ "నేను తెలుగు మాట్లాడలేను. కానీ అర్థం చేసుకుంటాను. కానీ సినిమా కోసం కష్టపడి నేర్చుకున్నాను. నాకు తెలుగు భాష అంటే చాలా ఇష్టం.

ప్రియా ప్రియా చంపొద్దే!

వింక్ గర్ల్ ప్రియా ప్రకాశ్ వారియర్, రోషన్ నటించిన లవర్స్ డే చిత్రం ప్రేమికుల దినోత్సవం ఫిబ్రవరి 14న రిలీజవుతోంది. తెలుగు, మలయాళంతోపాటు కన్నడ, తమిళ భాషల్లో ఈ చిత్రం ఏక కాలంలో విడుదల కానున్నది. క్రేజీ డైరెక్టర్ ఒమర్ లులు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని తెలుగులో నిర్మాతలు ఎ. గురురాజ్, సి.హెచ్.వినోద్రెడ్డి సుఖీభవ సినిమాస్ బ్యానర్‌పై అందిస్తున్నారు. నిర్మాతలు గురురాజ్, వినోద్ రెడ్డి మాట్లాడుతూ.. జనవరి 23వ తేదీన స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లో జరిగిన ఆడియో ఫంక్షన్ సూపర్ హిట్ అయ్యింది. మా ఆహ్వానాన్ని మన్నించి ఆడియో ఫంక్షన్ కు వచ్చిన అల్లు అర్జున్కు ధన్యవాదాలు తెలుపుకొంటున్నాం. ఆయన రాకతో మా సినిమాకు మరింత క్రేజ్ ఏర్పడింది. చిన్న చిత్రానికి బన్నీ అందించిన సహకారాన్ని మాటల్లో చెప్పలేం. ఆడియో రిలీజ్ తర్వాత ప్రియా ప్రకాశ్ వారియర్ కు టాలీవుడ్లో క్రేజ్ మరింత పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో సినిమాను తెలుగు ప్రేక్షకులకి దగ్గరగా చేసేందుకు, ప్రేక్షకులకు సంపూర్ణమైన వినోదాన్ని అందించేందుకు ప్రీ ప్రోడక్షన్ పనులను క్వాలిటీతో రూపొందించాం. ప్రియ వారియర్కు తెలుగులో ఉమ (ప్రముఖ దర్శకుడు రేలంగి నర్సింహారావు తమ్ముడి కూతురు), ఈ చిత్రంలో మరో ప్రధాన పాత్రను పోషించిన నూరిన్కు సింగర్ లిప్సిక డబ్బింగ్ చెప్పారు. లవర్స్ డే చిత్రంలో మొత్తం ఎనిమిది పాటలు ఉన్నాయి. గీత రచయితలు చంద్రబోస్, చైతన్య ప్రసాద్, శివ గణేష్, శ్రీజో, శ్రీ సాయికిరణ్ సాహిత్యాన్ని అందించారు. ప్రియా వారియర్ క్రేజ్, పాటలకు విపరీతమైన స్పందన రావడంతో పెరిగిన అంచనాలకు తగినట్టుగా అన్ని ఏరియాల్లో బ్రహ్మాండమైన బిజినెస్ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటికే విడుదలకు అన్ని హంగులు పూర్తి చేసుకొన్నాం. ప్రేమికుల దినోత్సవం కానుకగా లవర్స్ డే చిత్రాన్ని ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం అని తెలిపారు.



'నేనే ముఖ్యమంత్రి'!!

వైష్ణవి ఫిలింస్, ఆలూరి క్రియేషన్స్ పతాకాలపై అట్లూరి నారాయణరావు , ఆలూరి సాంబశివరావు సంయుక్తంగా నిర్మిస్తోన్న చిత్రం 'నేనే ముఖ్యమంత్రి'. దేవిప్రసాద్, వాయు తనయ్, శశి, సుచిత్ర ప్రధాన పాత్రల్లో మోహన్ రావిపాటి దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 8న గ్రాండ్ గా విడుదలవుతోంది. ఈ సందర్భంగా వైష్ణవి ఫిలింస్ అధినేత అట్లూరి నారాయణరావు మాట్లాడుతూ..."మా చిత్రం ద్వారా సమకాలీన రాజకీయ అంశాల గురించి చర్చించాం. అన్ని వర్గాలకు నచ్చే అంశాలతో పాటు అందర్నీ ఆలోచింపజేసేలా సన్నివేశాలు, సంభాషణలు ఉంటాయి. దేవిప్రసాద్, వాయుతనయ్, శశి, సుచిత్ర అద్భుతమైన నటన ప్రదర్శించారు. సంగీతానికి కూడా మంచి ప్రాధాన్యత ఉన్న చిత్రం. కాన్సెప్ట్ నచ్చి ఈ సినిమా నిర్మించాం. ప్రేక్షకులకు కూడా నచ్చుతుందన్న నమ్మకంతో ఉన్నాం" అన్నారు. నిర్మాత ఆలూరి సాంబశివరావు మాట్లాడుతూ..."నేటి సమాజం యొక్క రాజకీయ పరిస్థితులకు అద్దం పడుతూ బూనేనే ముఖ్యమంత్రిబూ చిత్రాన్ని నిర్మించాము. మేము అనుకున్న దానికన్నా సినిమా చాలా బాగా వచ్చింది. మా దర్శకుడు పర్ఫెక్ట్ ప్లానింగ్ తో ఎక్కడా ఇబ్బంది రాకుండా సినిమాను పూర్తి చేసారు. ఇప్పటికే విడుదలైన పాటలకు, టీజర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమాను ఈ నెల 8న గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నాం " అన్నారు.



సుకుమార్ నాగశౌర్య కాంబో

సుకుమార్ రైటింగ్స్ స్పీడ్ పెరిగింది. ఈ బ్యానర్ యువహీరోలకు వరంగా మారింది. తాజా సమాచారం ప్రకారం.. సుకుమార్ నాగశౌర్య శరత్ మరార్ కాంబినేషన్ లో ఓ సినిమా తెరకెక్కనుంది. దర్శకుడిగా భారీ చిత్రాలను తెరకెక్కిస్తోన్న బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ తన నిర్మాణ సంస్థ సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లో తన దర్శకత్వ శాఖలో పనిచేస్తున్న యంగ్ టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తూ ఇతర ప్రముఖ నిర్మాణ సంస్థలతో కలిసి సినిమాలను రూపొందిస్తున్న



సంగతి తెలిసిందే. తాజాగా సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ సుకుమార్, నార్త్ స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ శరత్ మరార్ కలయికలో ఓ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో నాగశౌర్య హీరోగా నటిస్తున్నారు. సుకుమార్ దర్శకత్వ శాఖలో పనిచేస్తున్న కాశీ విశాల్ ఈ సినిమాను డైరెక్ట్ చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన వివరాలను త్వరలోనే ప్రకటిస్తారు.



18 వయసు దాటితేనే..!

ఆదిత్ హీరోగా నిక్కీ తంబోలి హీరోయిన్ గా బ్లూ ఘోస్ట్ పిక్చర్స్ పతాకంపై పి.సంతోష్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం చీకటి గదిలో చితకొట్టుడు. ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ హైదరాబాద్ ప్రసాద్ లాబ్స్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో హీరో ఆధిత్, హీరోయిన్ నిక్కి తంబోలి, తాగుబోతు రమేష్, మిర్చి హేమంత్, దర్శకుడు సంతోష్ పి.జయకుమార్, సంగీత దర్శకుడు బాలమురలి బాలు పాల్గొన్నారు. లాస్ట్ ఇయర్ తమిళంలో రిలీజ్ అయి సూపర్ హిట్ అయిన ఐ ఎం కె చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేశారు. పోసాని, రఘుబాబు, సత్యం రాజేష్, తాగుబోతు రమేష్, మిర్చి హేమంత్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం ఫిబ్రవరి మూడో వారంలో విడుదలకు సిద్ధం అవుతోంది. హీరో ఆధిత్ మాట్లాడుతూ... సంతోష్ స్క్రిప్ట్ విని చాలా ఎక్సయిట్ అయ్యాను. షూటింగ్ చేసేటప్పుడు ఎంజాయ్ చేస్తూ చేశాం. ఇలాంటి సినిమాల్ని అందరూ హ్యాండిల్ చేయలేరు. సంతోష్ బ్యాలెన్స్ గా తెరకెక్కించాడు. యూత్, కపుల్స్, సింగిల్ పర్సన్స్ ఎంజాయ్ చేసే విధంగా .. కడుపుబ్బా నవ్వుకొనేలా ఉంటుంది..అన్నారు.

దర్శకుడు సంతోష్ పి. జయకుమార్ మాట్లాడుతూ... ఇది నా మూడవ చిత్రం. తమిళంలో లాస్ట్ ఇయర్ ఐ ఎం కె గా ఈ చిత్రం విడుదలై కాంట్రవర్సీ అయి పెద్ద హిట్ అయ్యింది. హిందీలో ఇలాంటి చిత్రాలు చాలా వచ్చాయి. తమిళ్, తెలుగులో మొదటి సారి వస్తోంది. అడల్ట్ హార్రర్ కామెడీ చిత్రం ఇది. అబ్బాయి, అమ్మాయి, యూత్ మాత్రమే ఈ సినిమా చూడాలి. బ్యాంకాక్ లో 14 రోజులు, చెన్నైలో 6రోజులు మొత్తం 20రోజుల్లో షూటింగ్ పూర్తి చేశాం. ఆర్టిస్టులు అందరూ ఫుల్ సపోర్ట్ చేయబట్టే త్వరగా పూర్తి చేశాం. న్యూ జోనర్ లో ఈ సినిమాని ట్రై చేశాం. కచ్చితంగా సక్సెస్ అవుతుందని నమ్మకం ఉంది. డబుల్ మీనింగ్ డైలాగ్స్ తో కడుపుబ్బా నవ్వుకునేలా ఈ చిత్రం ఉంటుంది అన్నారు. 18 సంవత్సరాల పైబడినవారు ఈ సినిమా చూడాలి. ఫ్యామిలీ ఆడియన్స్ ఈ సినిమాకి రావద్దు.. అన్నారు.

అమావాస్య కూడా పౌర్ణమి లాంటిదే!



సచిన్ జోషి

అమావాస్య అంటే దట్టమైన చీకటి అనే అర్థం కాదు. అది కూడా పౌర్ణమిలాంటిదే.. వచ్చి వెళ్లే ఒక ఘూడానుభూతినిచ్చే రాత్రి.. అని తనదైన శైలిలో చెప్పారు సచిన్ జోషి. ముంబైలో బిలియన్ డాలర్ బిజినెస్ ప్రపంచంలో పారిశ్రామికవేత్తగా గుర్తింపు తెచ్చుకున్న సచిన్ జోషి క్రీడలు, సినీరంగాలపై ఎంతో ఆసక్తిగా ఉంటారు. గత ఏడెనిమిదేళ్లుగా ఆయన టాలీవుడ్, బాలీవుడ్ లో పలు చిత్రాల్లోనూ నటించారు. ఒరేయ్ పండు చిత్రంతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అటుపై ఆషిఖీ 2 రీమేక్ లోనూ నటించారు. ప్రస్తుతం సచిన్ కథానాయకుడిగా నటించిన అమావాస్య రిలీజ్ కి రెడీ అవుతోంది. భూషణ్ పటేల్ ఈ చిత్రానికి దర్శకత్వ ం వహించారు. నర్గీస్ ఫక్రీ కథానాయికగా నటించింది. హిందీ (అమవాస్), తెలుగులో ఫిబ్రవరి 8న ఈ చిత్రం రిలీజవుతోంది. ఈ సందర్భ ంగా హైదరాబాద్ దసపల్లాలో జరిగిన విలేకరుల సమావేశంలో సచిన్ జోషి మాట్లాడారు.

సచిన్ మాట్లాడుతూ .. అమావాస్య టైటిల్ కి తగ్గట్టే ఇదో హారర్ చిత్రం. ఇందులో భయపెట్టే ఎన్నో అంశాలు ఉంటాయి. చక్కని కామెడీ ఆకట్టుకుంటుంది. అమావాస్య అంటే బ్లాక్ మ్యాజిక్ గుర్తొస్తుంది. ఆ రోజు దెయ్యాలు పవర్ ఫుల్ గా మారతాయి అని అనుకుంటాం. దీని చుట్టూనే కథ తిప్పినా ఎంతో హారర్ మైమరిపిస్తుంది. ఇక ఈ తరహా చిత్రాల విజయంలో సంగీతం ప్రధాన భూమిక పోషిస్తుంది. అమావాస్య రీరికార్డింగ్ అంతర్జాతీయ స్థాయిలో ఉంటుంది. అలాగే ఈ సినిమా కథాంశం నాకు బాగా నచ్చి చేశాను అని అన్నారు. మీడియా ఇంటరాక్షన్ లో పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చిన సచిన్ జోషి.. సంగీతం భారతదేశంలో మన జీవితంలో ఒక భాగం .. తాజా సినిమా కోసం సంగీతం పై ఎంతో శ్రద్ధ తీసుకున్నాం. ఇక నా తొలి సినిమా ఒరేయ్ పండు కోసం రమణ గోగుల తో కలిసి మూడు రోజుల పాటు మ్యూజిక్ కోసం పని చేశాను. ఈ సినిమాకి సంగీతం విషయంలో అంతే బెస్ట్ గా పని చేశాం.. అని అన్నారు.

ఇతర నిర్మాతలకు ఓకే!

నేను ఆటల్ని ఇష్టపడతాను. అంతకుమించి సినిమాని ఆరాధిస్తానని సచిన్ జోషి అన్నారు. సినిమాల్లో పూర్తి స్థాయిలో నటించడం ఇష్టం. అదే నా ప్యాషన్.. సరైన కథలు వచ్చినప్పుడు సినిమాలు చేస్తాను. నాతో సినిమాలు చేసేందుకు ఇతర నిర్మాతలు వచ్చినా సిద్ధంగానే ఉంటాను. ప్రస్తుతం భూషణ్ పటేల్ తో కలిసి పని చేశాను... అని అన్నారు.

హేట్ అంటే ఒట్టు!

'హేట్ స్టోరి 4' చిత్రంలో నటించింది ఊర్వశి రౌతేల. టీవీ తెర నుంచి వెండితెరకు పరిచయమై ఆరంభమే యువతరంలో అసాధారణ ఫాలోయింగ్ సంపాదించింది. హేట్ స్టోరి సిరీస్ లో బెస్ట్ సినిమాగా నిలిచేందుకు ఈ అమ్మడు పడిన తపన పై ఆసక్తికర చర్చ సాగింది. తనని కావాలని కోరుకునే ఇద్దరు అన్నదమ్ముల మధ్య చిచ్చు పెట్టే భామగా నటించి వేడెక్కించింది. 2018 బెస్ట్ హాటెస్ట్ గాళ్స్ జాబితాలో ఊర్వశి పేరు అగ్రపథంలో నిలిచింది. ప్రస్తుతం ఈ భామ ఓ బాలీవుడ్ చిత్రంలోనూ నటిస్తోంది. ఈ ఏడాది ఈ చిత్రం రిలీజ్ కి రెడీ అవుతోంది. ఇంకా ఈ సినిమాకి టైటిల్ నిర్ణయించాల్సి ఉంది. ఊర్వశి సామాజిక మాధ్యమాల్లో రెగ్యులర్ గా ఫోటోషూట్లను అభిమానుల కోసం షేర్ చేస్తూ అసాధారణ ఫాలోయింగ్ పెంచుకుంటోంది.



క్రైమ్ రూపం మార్చుకుంది!!



వెంకట్ మూవీస్ బ్యానర్ పై కె.టి.నాయక్ దర్శకత్వంలో వెంకట్ నిర్మిస్తున్న చిత్రం 'దండుపాళ్యం 4'. హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ పాత్రికేయులతో ముచ్చటించింది. ఈ కార్యక్రమంలో నిర్మాత వెంకట్ మాట్లాడుతూ "దండుపాళ్యం 4'ని కొత్తవాళ్లతో చేశాం. నేను, డి.ఎస్.రావుగారు నటించాం. అలాగే అరుణ్ బచ్చన్, సంజీవ్‌కుమార్, బుల్లెట్ సోము, రంగాయన విఠల, స్నేహ, రాక్ లైన్ సుధాకర్ ఇలా చాలా మంది సినిమాలో పనిచేశాం. ఆర్టిస్టులందరికీ 8 నెలలు పాటు నటనలో శిక్షణ ఇప్పించాం. వారికి హెయర్ కట్ చేయలేదు. మాసీ లుక్ గెటప్‌ను మెయిన్‌టెయిన్ చేశాం. టైం తీసుకుని సినిమా చేశాం. డైరెక్టర్ కె.టి.నాయక్‌గారు సినిమాను చక్కగా డైరెక్ట్ చేశారు. నేను నవంబరాల్లోనే సినిమాకు సెన్సార్ కోసం అప్లయ్ చేశాం. అయితే సెన్సార్ సమస్య వచ్చింది. మాకు తెలిసిన కేంద్ర మంత్రితో కూడా మాట్లాడాం. ఆ పనులు జరుగుతున్నాయి. సాధారణంగా సినిమాలో ఏ సీన్ అయినా అభ్యంతరకరంగా ఉంటే సెన్సార్ వాళ్లు అభ్యంతరం చెప్పొచ్చు. సీన్స్ కట్ చేయమనో, మ్యూట్ చేయమనో, ట్రిమ్ చేయమనో చెప్పవచ్చు. దండుపాళ్యం మూడు భాగాలను లేని అబ్జక్షన్ మా సినిమాకు మాత్రం ఎందుకో తెలియడం లేదు. ఒప్పుకుంటే కట్స్ ఏం చేయాలో చెబుతా.. లేకుంటే రిఫ్యూజ్ చేస్తానని ఆయన అన్నారు. బేసిక్ స్టోరీలో ఏమైనా ప్రాబ్లెం ఉంటే రిఫ్యూజ్ చేయవచ్చు. కానీ ఏ అబ్జక్షన్ లేనప్పుడు ఎందుకు రిఫ్యూజ్ చేశారో తెలియడం లేదు. అడిగితే సెన్సార్ ఆఫీసర్ నుండి సమాధానం లేదు. సినిమాను మార్చిలో విడుదల చేయాలని అనుకున్నాం. కానీ.. ఇప్పుడు రిఫ్యూజ్ చేయడం వల్ల ఆర్సి కి వెళ్లి తర్వాత ట్రిబ్యునల్‌కి కూడా వెళ్లాలి. కాబట్టి రిలీజ్ లేట్ అవుతోంది" అన్నారు. దర్శకుడు కె.టి.నాయక్ మాట్లాడుతూ "సినిమాను చక్కగా తెరకెక్కించాం. అయితే కారణాలు చెప్పకుండా సినిమాను తిరస్కరించడం ఎందుకో తెలియడం లేదు. సినిమా బాగా వచ్చింది. ఆడియెన్స్‌కు ఏం కావాలో దాన్ని సినిమాలో అందించాం. ఆర్.సి, వెళ్లడానికి కారణాలు తెలియడం లేదు" అన్నారు. ఈ చిత్రంలో కొత్త ముమైత్‌ని చూడొచ్చని, ఒక గ్యాంగ్ స్టర్ పాత్రలో నటించానని బెనర్జీ తెలిపారు.

'చిటికె'లో సాధ్యం..!

- ఇడ్లీ పిండి పల్చగా ఉంటే దానిలో కొద్దిగా బొంబాయి రవ్వ కలపాలి.
- ఉప్మా తయారికి పోపు వేయించి నీళ్ళకు బదులు కాసిని పాలు పోస్తే రుచిగా ఉంటుంది.
- పెరుగు పులిస్తే పారవేయకుండా వడకట్టి మళ్ళీ గోరువెచ్చటి పాలు కలిపితే తాజా పెరుగు తయారు అవుతుంది.
- దోసె పిండి పులిస్తే దానిలో నాలుగు స్పూన్లు మైదా పిండి వేసి బాగా కలిపి దోసెలు వేస్తె కరకర లాడుతాయి.
- దోసెల పిండి తో పాటు ఉడికించిన ఒక బంగాళదుంప ను కుడా వేసి రుబ్బితే దోసెలు రుచికరం గ ఉంటాయి.
- మినప గారెలు ఎర్రగా దోరగా వేగాలి అంటే బాణలి లో వేసే ముందు చేతిని మజ్జిగ తో తడి చేసుకోవాలి.
- చపాతీలు మృదువు గా ఉండాలి అంటే పిండి కలిపేటప్పుడు కొద్దిగా పాలు కలిపితే సరి.
- దోసెలు పల్చగా రావాలి అంటే ఒక కప్పు సగ్గుబియ్యం నానబెట్టి వేసి రుబ్బాలి.
- పూరీలు మైదా పిండి తో చేస్తే కొంచం పల్చగా వత్తాలి.
- పూరీలు బాగా పొంగాలి అంటే గోధుమ పిండితో చేస్తే కొంచెం మందంగ వత్తాలి.



నాజూగ్గా కనిపించేందుకు..

నేటి హడావుడి జీవితంలో టైమ్‌కి తినకుండా, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వెచ్చించే సమయం లేక ఊబకాయం సమస్యకు లోనవుతున్నారు. ప్రస్తుతం ఆడ, మగ ఇద్దరిలోనూ ఈ సమస్య చాలా పెరిగిపోయింది. పెద్దవారిలోనే కాదు, చిన్న పిల్లల్లో కూడా ఇదే ప్రాబ్లమ్. సమయానికి తినకపోవడమే ఇందుకు ప్రధాన కారణం అంటున్నారు వైద్యులు. మరి బరువు పెరిగి ఊబకాయం సమస్య రాకుండా ఎలాంటి నియమాలు పాటించాలో చూసేద్దాం..

కొందరు ఎంత తిన్నా ఏమాత్రం లావెక్కకుండా సన్నగా ఉంటారు. మరి కొందరు కొద్దిగా తిన్నా విపరీతంగా లావెక్కుతారు. ఇలాంటి వారినే ఊబకాయులు అంటారు. నిజానికి మనం తీసుకునే ఆహారం మీదే బరువు పెరగడం, తగ్గడం అనేది ఆధారపడి ఉంటుందన్న విషయాన్ని చాలా మంది మరిచిపోతుంటారు. బరువు తగ్గాలనుకునేవారు ఈ కించి సూచనలను గుర్తు పెట్టుకోవాలి.

సమయానికి తినకపోవడంతో గ్యాస్ ఫామ్ అయ్యి, బరువు పెరుగుతారు. దాంతో ఆటోమెటిక్‌గా ఊబకాయం వచ్చేస్తుంది. ఆ సమస్య వచ్చాక నానా తిప్పలు పడక తప్పదు మరి. అందుకే కొన్ని ముందు జాగ్రత్తలను పాటిస్తే అందుకు దూరంగా ఉండొచ్చు.

ఆకలిని గమనించుకోవాలి..

ఆకలి వేయడానికి అరగంట ముందే మెదడు ఆహారం కావాలన్న సూచనలను అందిస్తుంది. ఆ సూచనలను ఏ మాత్రం గమనించకుంగా ఆకలి అనిపించిన గంటో, గంటన్నర తరువాతో ఆహారం తీసుకోవడం వల్ల ఫలితం ఉండదు. అలాగే తిన్నాక కడుపు నిండినట్లు అనిపించగానే తినడం ఆపేయాలని నిపుణులు సూచిస్తున్నారు.



టైమ్‌కి భోజనం చేయాలి..

ఎంత తిన్నా.. ఏది తిన్నా భోజనానికి సరికాదు అంటారు. ఇది నూటికి నూరుపాళ్లు నిజం. బరువు తగ్గాలనుకునేవారు భోజనం అస్సలు మానేయకూడదు. అయితే మీరు తీసుకునే భోజనాన్ని తగ్గించుకొని ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్ పెద్ద మొత్తంలో తీసుకోవాలి. మధ్యాహ్నం రాత్రి భోజనంలో వరికి బదులుగా రాగులు, గోధుమలు, సజ్జలూ ఉపయోగించుకోవాలి. రాత్రి పడుకోవడానికి నాలుగు గంటలు ముందే భోజనం ముగించాలి.

తీపి పదార్థాలకు దూరంగా..

బరువు తగ్గాలనుకునే వారు తీపి పదార్థాలకు తప్పనిసరిగా దూరంగా ఉండాల్సిందే. వీరు చక్కెరకు బదులు బెల్లం, తేనెను ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకోవచ్చు. వీటితో పాటు తీపి ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను అధికంగా తీసుకోవాలి.

ఆందోళన, ఒత్తిడి..

బరువు తగ్గే క్రమంలో ఉన్నవారు తప్పనిసరిగా ఆందోళన, ఒత్తిడికి దూరంగా ఉండాలి. పై రెండింటి కారణంగా అధికంగా తీనేయండంతో బరువు పెరిగే అవకాశం ఉందని పరిశోధనల్లో రుజువైంది.

నిద్రలేమి..

కడుపునిండా తిండి, కంటి నిండా నిద్ర ఆరోగ్య రహస్యాలు అంటారు. నిద్రలేమి కూడా ఊబకాయానికి ఓ కారణం. ఏడెనిమిది గంటలు నిద్ర తప్పనిసరి.

వ్యాయామం తప్పనిసరి..

వ్యాయామం తప్పనిసరి. రోజులో కనీసం కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలి. అలా కేటాయించడం కుదరని వారు ఇంట్లోనే మెట్లు ఎక్కడం, దిగడం ఇంట్లోనే అటూ ఇటూ ఆగకుండా తిరగడం, నడవడం లాంటివి చేయాలి. నిద్ర లేచిన వెంటనే ఇలాంటివి చేస్తే మంచి ఫలితం ఉంటుంది. వీలుంటే ఉదయం, సాయంత్రం ఓ అరగంట పాటు నడవడం అలవాటు చేసుకోవాలి. ఆటలు కూడా మంచి వ్యాయామాన్నిస్తాయి. పెద్ద వయస్సులో ఆటలు ఏమిటి? అనుకోనవసరం లేదు. పిల్లలను తీసుకొని ప్లే గ్రౌండ్‌కి వెళ్లినప్పుడు వారి ఆటల్లో పాల్గొనవచ్చు. పిల్లలతో కలిసి ఆడుకుంటే చాలు మరే ఇతర వ్యాయామాలు అక్కర్లేదు.

లేజీ డైసీ స్టిచ్..




అల్లికల ప్రత్యేకం

ఆడవాళ్లు ఇంట్లో ఉంటే ఏదో ఒక పని చేయాలనుకుంటారు. ముఖ్యంగా సారీ డిజైన్స్. మిషన్ కుట్టు, ఎంబ్రాయిడరీ, కుట్లు అల్లికల వంటి పనులకు ప్రాధాన్యతనిస్తారు. అలాంటి వర్క్స్ మీద ఆసక్తి ఉన్న వారికి ఎలాంటి అల్లికలను ఏవిధంగా కుడితే బాగుంటుందో చూసేద్దామా..

లేజీ డైసీ స్టిచ్ దీనినే 'మెలిక కుట్టు' అంటారు. ఎందుకంటే దారాన్ని గుండ్రంగా మెలిపెట్టి ఈ కుట్టు కుడుతారు. ఈ కుట్టు విధానంలో రెండు కుట్ల మధ్య కొంచెం స్పేస్ ఉండడం వల్ల 'విడివడ్డ గొలుసు' అనే మరో పేరుతో కూడా పిలుస్తారు.

ఈ కుట్టుతో చిన్నచిన్న ఆకుల్ని, పువ్వురేకుల్ని కుట్టొచ్చు. ఈ రేఖలు వెడల్పుగా వుంటే రెండు గొలుసులు వేస్తారు. ఒకటి లోపలివైపు, మరోటి బయటివైపు. దీనివల్ల కుట్టు ముద్దగా వచ్చి లోపల పూరించినట్లుగా కనిపిస్తుంది. నాలుగు వైపుల సమానంగా ఉండే చతురస్ర గొలుసు కుట్టులాగా ఈ లూప్‌స్టిచ్‌లో కూడా రెండు గొలుసులకీ రెండు విభిన్నమైన రంగుల దారాలను వాడుతూ కుడతారు. రెండు రంగులతో కుట్టిన లూప్‌స్టిచ్ పువ్వు రేకులు అందంగా కనిపిస్తాయి.






భోజనం చేసే విధానము

షేర్ చేసుకుందాం..!

భోజనం బల్ల మీదికి స్పూన్స్, ఫోర్క్ లు వచ్చి చేతితో భోజనం చేసే వాడిని అనాగరికుడిగా చూస్తూ వెక్కిరిస్తున్న తరుణమిది.

తిండేదైనా ఫోర్క్ ఖచ్చితం అయి కూర్చుంది ఈ వేళ..?

భోజనశాల లో ఎవరైనా పద్దతిగా చేతితో అన్నం కలుపుకొని తింటుంటే అందరూ అతడిని వింత గా చూసే పరిస్థితి ఏర్పడింది.

ఇక మన ఇంట్లో చిన్న పిల్లలకు సైతం స్పూన్స్ అలవాటు చేస్తున్నారు ఈ తరం తల్లీదండ్రులు.

దానికి వాళ్లు చూపిస్తున్న ప్రధాన కారణం.. చేతులు శుభ్రంగా ఉండవు కదా..! అని. అయితే ఓ సారి చేతిని ఉపయోగించి భోజనం చేస్తే కలిగే శాస్త్రీయ లాభాలను ఓ సారి చూద్దాం.

ఇది చదివాక ఎక్కడున్నా..?

మీరు పద్దతిగా చేతిని ఉపయోగించి భోజనం చేస్తారని ఆశిస్తున్నాను.

చేతితో ఆహారాన్ని తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలు:

- చేతిస్పర్శ వల్ల శరీరానికి బలం చేకూరుతుంది.
- చేతితో ఆహారం తీసుకోవడం వలన కొన్ని మిలియన్ల నరాలు మన మెదడుకు సిగ్నల్స్ ని పంపిస్తాయి.
- అహారాన్ని చేతితో ముట్టుకో గానే, ఆహారం తీసుకునే విషయం మెదడు పొట్టకు సంకేతమిస్తుంది. అలా కడుపులో జీర్ణరసాలు, ఎంజైమ్స్ రిలీజ్ కావడం వలన జీర్ణశక్తి బాగా జరుగుతుంది.
- చేత్తో ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండటమే కాకుండా, ఎటువంటి ఆలోచనలు లేకుండా ఒకే ధ్యాసలో ఉంటాం.
- మన ఆహారం లో నూనె ఎక్కువగా ఉపయోగిస్తాం.ఇలా తయారుచేసుకున్న ఆహారాన్ని స్పూన్స్, ఫోరక్స్ తో తీసుకోవడం వలన ప్రతిచర్య ఏర్పడి రుచిపోతుంది.
- వ్రేళ్ళతో ఆహారం కలుపుకొని, ముద్దలుగా ఒక్కో పదార్థాన్ని కలుపుకోవడం వలన రక్తప్రసరణ బాగా జరుగుతుంది.
- చేతి వ్రేళ్ళతో ఆహారం తీసుకోవడం వల్ల,వ్రేళ్ళు పెదాలకు తగలగానే నోటిలో లాలాజలం ఊరుతుంది.
- ఇంకా చేతివ్రేళ్ళతో మనం ఆహారం తీసుకోవడం వలన అనారోగ్యం పాలుకాకుండా,ఆరోగ్యవంతంగా ఉంటారు. జీర్ణ ప్రక్రియ బాగా జరుగుతుంది. ఇలా చేయడం ఒక వ్యాయామంలా ఉంటుంది. పురణాల ప్రకారంగా ....

చేతిలో ఉండే ఒక్కో వ్రేలు ఒక్కో తత్వాన్ని కలిగి ఉంటుంది.

బొటన వేలు: అగ్నితత్వం
చూపుడు వేలు: వాయుతత్వం
మధ్య వేలు: ఆకాశం
ఉంగరపు వేలు: భూమి
చిటికిన వేలు: జలతత్వం..

ఈ అయిదు వ్రేళ్ళ స్పర్శ ఆహారానికి తగిలినపుడు జీవశక్తి ఉత్తేజితం అవుతుంది.

సేకరణ: మీ స్నేహితుడు
వాట్సాప్ అభిమాని



కాకరకాయ స్టఫ్డ్

కావలసిన పదార్థములు:

పొట్టి కాకరకాయలు 1/2 కేజీ, ఎండు కొబ్బరి చిప్ప 1, నువ్వులు 2 టేబుల్ స్పూన్స్, వేరు శనగ గుళ్ళు 1 కప్పు, ఆయిల్ , ఉప్పు , కారం , వెల్లులి , జీలకర్ర.

తయారు చేసే విధానం:

ముందుగా కాకరకాయలు కడిగి చివరలు కట్ చేసి గిన్నెలో వేసుకోవాలి. అందులో కొంచం పెరుగు , చింత పండు , 1 గ్లాస్ నీరు పోసి ఉడికించి పెట్టుకోవాలి. అవి ఆరిన తరువాత ఒకవైపు నిలువు చీలి గింజలు తీసి వేయాలి . పాన్లో ఆయిల్ వేసి ఈ ఉడికించిన కాకరకాయలు ఎర్రగా వేయించి ఒక ప్లేటులో పెట్టుకోవాలి.

స్టఫ్ చేయడానికి వేరు శనగ , నువ్వులు వేయించి కొబ్బరి కూడా కలిపి మిక్సీలో గ్రైండ్ చెయ్యాలి. విడిగా వెల్లుల్లి, జీలకర్ర గ్రైండ్ చేసి అంత ఒక ప్లేటులో వేసి అందులో కారం , ఉప్పు తగినంత వేసి కొంచం ఆయిల్ వేసి కలుపుకోవాలి. ఈ పొడిని వేయించి ఉంచిన కాకరకాయలో స్టఫ్ చెయ్యాలి. ఇది రైస్‌లో కలుపుకొని తింటే రుచిగా ఉంటుంది.





కరేలా జ్యూస్

కావలసి పదార్థములు:

కాకరకాయ 12, నిమ్మకాయ 1/2, పసుపుపావుచెంచా, ఉప్పు చిటికెడు

తయారు చేసే విధానం:

1. కాకరకాయను తీసుకుని సరిగ్గా కడగండి. 2. పై తొక్కు తీసేసి విత్తనాలు తొలగించండి. 3. కాకరకాయను చిన్న ముక్కలుగా తరిగి,బౌల్ లో వేయండి. 4. ఒక చిటికెడు ఉప్పును వేసి 10 నిమిషాలు నీళ్ళలో నానబెట్టండి. 5. రసం తీయడానికి, తరిగిన ముక్కలను మిక్సీలో వేసి నీళ్ళు పోయండి. 6.మిక్సీ పట్టి రసం తీసి దానిపై ఉప్పు, పసుపును చల్లండి. 7. కొన్ని చుక్కల నిమ్మరసాన్ని జత చేస్తే మంచి రుచిగల కాకరకాయ రసం రెడీ అయినట్లే.

కాకరకాయ లేదా కరేలా కొందరికీ నచ్చీ, మరికొందరికి నచ్చని కాయగూర. కానీ దాని ప్రాముఖ్యత ఎక్కువే ఉంటుంది. భోజనంలో తినేందుకు ఇష్టపడకున్నా, మరోరకంగా తినేందుకు ప్రయత్నించండి. ఎందుకంటే ఇందులోని పోషకాలు ఆరోగ్యానికి చాలా మంచిది. డైట్‌లో ప్రతిరోజూ కాకరకాయ రసాన్ని చేర్చుకుంటే, రక్తంలో చక్కెర స్థాయి తగ్గుతుందని పరిశోధనల్లో తేలింది. కాకర రసంలో విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు పదార్థం పుష్కలంగా ఉంటాయి. ఇది బరువు తగ్గటంలో కూడా సాయపడుతుంది. ఆహారాన్ని ఎక్కువ తీసుకోకుండా, చాలా సేపటి వరకు కడుపు నిండివుండేటట్లుగా చేస్తుంది.



కాకరకాయ ఫ్రై

కావలసిన పదార్థములు:

కాకరకాయలు 1/2కేజి, ఉల్లిపాయలు 2,
తాలింపు కోసం: వేరుశనగ గుళ్ళు 3 టేబుల్ స్పూన్స్, నువ్వులు 2 టేబుల్ స్పూన్స్, ఎండు కొబ్బరి కొంచం ముక్క, వెల్లుల్లి రెబ్బలు 7, నూనె 1 కప్పు.

తయారు చేసే విధానం:

ముందుగా కాకరకాయలు చివరలు కట్ చేసి ఒక గిన్నెలో కొంచం చింతపండు, రెండు టేబుల్ స్పూన్లు పెరుగు, 1 కప్పు నీరు పోసి ఉడికించాలి. తరువాత నీటిని తీసివేసి అందులో గింజలు తీసివేసి కాకరకయలను చిన్న ముక్కలుగా కోసి బాణిలో నూనె పోసి ఈ ముక్కలను కొంచం కొంచం వేయించి తీసి పక్కన పెట్టాలి. వేరుశనగ గుళ్ళు, నువ్వులును కొంచం వేయించి చల్లారిన తరువాత అందులో కొంచం ఎండు కొబ్బరి ముక్కలుగా తరిగి అన్ని కలిపి పొడిగా చెయ్యాలి. చివరలో వెల్లుల్లి వేసి మరొకసారి తిప్పాలి. ఇప్పుడు మరొక భాణీ తీసుకొని కొంచం నూనె వేసి తాలింపు వేసి అందులో సన్నగా కట్ చేసి ఉంచిన ఉల్లి తరుగు వేసి గోధుమ రంగు వచ్చే వరకు వేయించాలి. అందులో ఫ్రై చేసి ఉంచిన కాకర ముక్కలు, చేసిన పొడి, తగినంత ఉప్పు, కారం, చిటెకెడు పసుపు వేసి తీప్పుతూ వేయించాలి. ఇలా రెండు నిముషాలు తిప్పి స్టవ్ ఆఫ్ చియ్యాలి. ఈ కర్రీ రైస్‌లో కలుపకొని తింటే చాలా బాగుంటుంది.

కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)

హైదరాబాద్	395	విజయవాడ	395
ముంబయి	450	ఢిల్లీ	412
చెన్నై	430	బెంగళూరు	425



బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.

హైదరాబాద్	95	ఢిల్లీ	120
కరీంనగర్	100	ముంబయి	115
వరంగల్	105	చెన్నై	115



సెన్సెక్స్ +212.74
36,469



నిఫ్టీ + 62.70
10,893

రూపాయి
₹71.24
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
33,580
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో

జనవరిలోనూ రూ. లక్ష కోట్లు దాటిన జీఎస్‌టీ

అత్యధికంగా ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ. 51,225 కోట్లు వసూళ్లు



ముంబై: ఈ ఏడాది తొలి నెలలో వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) వసూళ్లు రూ. లక్ష కోట్లు దాటాయి. 2018 డిసెంబరులో జీఎస్‌టీ వసూళ్లు రూ. 94,725 కోట్లుగా ఉండగా.. గత నెలలో ఇవి రూ. 1.02లక్షల కోట్లకు పెరిగాయి. 2018 జనవరిలో వసూలైన రూ. 89,825కోట్ల జీఎస్‌టీతో పోలిస్తే ఇది 14శాతం ఎక్కువ. ఇక ఈ ఏడాది జనవరి 31 నాటికి రిటర్న్‌లు దాఖలు చేసిన వారి సంఖ్య 73.3లక్షలకు చేరింది. '2019 జనవరిలో జీఎస్‌టీ వసూళ్లు రూ. 1,02,503 కోట్లుగా ఉన్నాయి. ఇందులో కేంద్ర జీఎస్‌టీ రూ. 17,763 కోట్లు కాగా.. రాష్ట్ర జీఎస్‌టీ రూ. 24,826 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ. 51,225 కోట్లు, సెస్ రూ. 8,690కోట్లుగా ఉంది' అని ఆర్థికశాఖ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 2017 జులై 1న జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తర్వాత వసూళ్లు రూ. లక్ష కోట్ల మైలురాయిని దాటడం ఇది మూడోసారి. గతేడాది ఏప్రిల్, అక్టోబరు లోనూ వసూళ్లు లక్ష కోట్లు దాటాయి. 2018 ఏప్రిల్‌లో జీఎస్‌టీ వసూళ్లు రూ. 1.03లక్షల కోట్లుగా ఉండగా.. అక్టోబరులో రూ. 1,00,710 కోట్లు జీఎస్‌టీ కింద వసూలయ్యాయి. కాగా.. ఏప్రిల్ తర్వాత అత్యధిక జీఎస్‌టీ వసూలవడం మళ్లీ ఇప్పుడే.

కొచ్చర్‌పై చర్యలు - బ్యాంకులకో హెచ్చరిక

- బలహీన యంత్రాంగం, లోపించిన పారదర్శకత
- చందా కొచ్చర్ పతనమే వీటికి నిదర్శనం
- హెచ్చరించిన అంతర్జాతీయ రేటింగ్ సంస్థ ఎస్అండ్‌పీ

ముంబై: దేశీయ బ్యాంకుల్లో పరిపాలన యంత్రాంగం అస్తవ్యస్తంగా ఉందనడానికి ఐసీఐసీఐ మాజీ సీఈఓ చందాకొచ్చర్ పతనమే ఉదాహరణ అని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ ఎస్అండ్‌పీ (స్టాండర్డ్ అండ్ పూర్స్) వెల్లడించింది. "చందా కొచ్చర్ విషయంలో తాజాగా చోటు చేసుకున్న పరిణామాలు, ఆమెపై బ్యాంకు బోర్డులో మారిన అభిప్రాయాలు.. దేశీయ బ్యాంకుల్లో బలహీన యంత్రాంగం, పారదర్శకత కొరవడిందనడానికి ఉదాహరణలు" అని ఆ రేటింగ్ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది.



దేశంలోనే ఒక బ్యాంకులో సీఈఓ హోదాను పొందిన మొదటి మహిళగా ఆమె పేరు ప్రఖ్యాతలు పొందారు. నిబంధనలు ఉల్లఘించారంటూ ఆమె మీద ఆరోపణలు వచ్చినా.. 2016, 2018లో ఐసీఐసీఐ బ్యాంకు బోర్డు చందా కొచ్చర్ వెన్నంటే ఉంది. ఇప్పుడు బోర్డు నుంచి వచ్చిన వ్యతిరేకత కార్పొరేట్ రంగంలో ఉన్న బోర్డులపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను వెల్లడిచేస్తున్నాయని ఆ సంస్థ పేర్కొంది. ఆమెకు అందించిన బోనస్ మొత్తాలను వెనక్కి తీసుకోవాలన్న బోర్డు నిర్ణయాన్ని రేటింగ్ సంస్థ ఆహ్వానించింది.

కారణం రీత్యా తొలగింపు'గా కొచ్చర్ రాజీనామాను పరిగణిస్తున్నామని బుధవారం ఐసీఐసీఐ బ్యాంకు ఓ ప్రకటనలో వెల్లడించిన సంగతి తెలిసిందే. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ నేతృత్వంలో ఏర్పాటైన అంతర్గత దర్యాప్తు కమిటీ.. కొచ్చర్ ప్రవర్తనా నియమావళిని ఉల్లఘించారని వెల్లడించిన అనంతరం బ్యాంకు ఆ ప్రకటన చేసింది. అది తనను తీవ్రంగా నిరాశపరిచిందని, షాక్‌కు గురిచేసిందని కొచ్చర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఆమె మీద కేసు నమోదు చేసింది. వీడియోకాన్‌కు రుణాలు మంజూరు చేసే విషయంలో కొచ్చర్ క్విడ్‌ప్రోకో కు పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో ఆమె తన పదవిని కోల్పోవాల్సి వచ్చింది.

6న ఒప్పో కే1 స్మార్ట్‌ఫోన్ విడుదల



ఢిల్లీ: తమ కస్టమర్లను ఆకట్టుకునేందుకు చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ ఒప్పో మరో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఫిబ్రవరి 6వ తేదీన భారత మార్కెట్‌లో ఒప్పో కే1 స్మార్ట్‌ఫోన్‌ను ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ పేర్కొంది. ఈ ఫోన్ ప్రారంభ ధర రూ. 17,000తో ప్రారంభమవుతుందని సంస్థ తెలిపింది. స్నాప్‌డ్రాగన్ 660, 6జీబీ ర్యామ్, 25 మెగా పిక్సెల్ సెల్ఫీ కెమెరా, 6.4 అంగుళాల పూర్తి స్థాయిలో హెచ్‌డీ డిస్ ప్లే, ఆండ్రాయిడ్ 8.1 ఓరియో, డ్యూయల్ కెమెరా సెటప్‌తో పాటు 16 మెగా పిక్సెల్ ప్రైమరీ సెన్సార్ కెమెరా, 64 జీబీ స్టోరేజ్, మైక్రోఎస్‌డీ కార్డు 256జీబీ వరకు, 4జీ వీవోఎల్టీఈ, వైఫై 802.11, బ్లూటూత్ 5.0, 3డీ గ్లాస్, 3,600ఎంఏహెచ్ బ్యాటరీ ఉంటుంది. గత సంవత్సరంలో చైనా మార్కెట్‌లో ఒప్పో కే1 ఫోన్‌ను విడుదల చేశారు.

కొత్త ఆఫర్‌ను ప్రకటించిన వొడాఫోన్



హైదరాబాద్: తమ వినియోగదారులను ఆకట్టుకునేందుకు బ్రిటీష్ మల్టీనేషనల్ కమ్యూనికేషన్ సంస్థ వొడాఫోన్ మరో ఆఫర్ ప్రకటించింది. రూ. 50, రూ. 100, రూ.500 రీచార్జ్ ప్లాన్‌లను ప్రవేశపెట్టింది. వొడాఫోన్ సైట్, మై వొడాఫోన్ యాప్ ద్వారా ఈ ప్లాన్‌లను రీచార్జ్ చేసుకోవచ్చని కంపెనీ పేర్కొంది. రూ. 50 ప్లాన్‌తో రీచార్జ్ చేసుకుంటే 39.37 టాక్‌టైమ్, రూ. 100తో రీచార్జ్ చేసుకుంటే ఫుల్ టాక్‌టైమ్ 28 రోజుల వరకు కాలపరిమితి ఉంటుంది. రూ. 500తో రీచార్జ్ చేసుకుంటే ఫుల్ టాక్ టైమ్, 84 రోజుల వరకు కాలపరిమితి ఉంటుంది. రూ. 1,699 ప్లాన్‌తో రీచార్జ్ చేసుకుంటే 365 రోజుల వరకు కాలపరిమితి ఉంటుంది.

24న మార్కెట్లోకి నోకియా 9 ప్యూర్ వ్యూ స్మార్ట్‌ఫోన్



ఢిల్లీ: మొబైల్స్ తయారీదారు హెచ్ఎండీ గ్లోబల్ తన నూతన నోకియా స్మార్ట్ ఫోన్ నోకియా 9 ప్యూర్ వ్యూ ను ఈ నెల 24వ తేదీన విడుదల చేయనుంది. అదే రోజు బార్సిలోనాలో జరగనున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో ఈ ఫోన్‌ను ప్రదర్శించనున్నారు. ఇక ఈ ఫోన్‌లో వెనుక భాగంలో 5 కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. అలాగే ముందు భాగంలో ఇన్ స్క్రీన్ కెమెరాను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ ఫోన్‌లో 5.9 ఇంచుల క్వాడ్ హెచ్‌డీ 3డీ గ్లాస్ ఓలెడ్ డిస్‌ప్లే, స్నాప్‌డ్రాగన్ 845 ప్రాసెసర్, 8 జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 9.0 పై, ఐపీ 68 వాటర్, డస్ట్ రెసిస్టెన్స్, 4150 ఎంఏహెచ్ బ్యాటరీ, వైర్లెస్ చార్జింగ్ తదితర ఫీచర్లను అందివ్వనున్నట్లు తెలిసింది. ఇక ఈ ఫోన్ గురించిన పూర్తి స్పెసిఫికేషన్ల వివరాలు త్వరలో తెలిసే అవకాశం ఉంది.

ఆకట్టుకుంటున్న ఇండియన్ లగ్జరీ ఎక్స్‌పో



విజయక్రాంతి, హైదరాబాద్: ఫెరారీ బెంట్లీ, బెంజ్, బీఎండబ్ల్యూ వంటి ప్రముఖ కంపెనీలకు చెందిన లగ్జరీ కార్లు... జెమ్ సుజుకీ, బెనెల్లీ, ఇండయన్ మోటర్ సైకిల్, బీఎండబ్ల్యూ, విల్సన్ ఆడియో, ట్రంఫ్ కంపెనీలకు చెందిన బైకులు... లగ్జరీ జ్యువెలరీ, ఫర్నిచర్, పాదరక్షలు, అంతర్జాతీయ ఫర్‌ఫ్యూమ్ బ్రాండ్స్ ఇలా అన్ని రకాలైన విలాసవంతమైన ఉత్పత్తులు ఒకే వేదికపై కొలువుదీరాయి. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తాజ్ క్రిష్ణా హోటల్లో ద ఇండియన్ లగ్జరీ ఎక్స్‌పో ఏర్పాటు చేశారు.



గ్రాన్యూల్స్ మధ్యంతర డివిడెండు 25 శాతం

ముంబై: 2018–19 ఆర్థిక సంవత్సరానికి రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై 25 శాతం మూడవ మధ్యంతర డివిడెండు చెల్లించాలని గ్రాన్యూల్స్ బోర్డు నిర్ణయించింది. డిసెంబరు త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 71 శాతం అధికమై రూ.60 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.411 కోట్ల నుంచి రూ.637 కోట్లకు చేరింది. ఏప్రిల్, డిసెంబరులో రూ.1,690 కోట్ల టర్నోవరుపై రూ.172 కోట్ల నికర లాభం పొందింది.

స్పోర్ట్స

సిరీస్‌ను 'డ్రా'గా ముగించిన భారత హాకీ మహిళా జట్టు



ముర్సియా (స్పెయిన్): తమకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న స్పెయిన్ జట్టుపై వారి దేశంలోనే సిరీస్ గెలిచే అవకాశాన్ని భారత మహిళల జట్టు చేజార్చుకుంది. నాలుగు మ్యాచ్‌ల సిరిస్‌ను ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ భారత్ 1–1తో ముగించింది. సిరీస్‌లోని చివరిదైన నాలుగో మ్యాచ్ 2–2తో 'డ్రా' అయ్యింది. ఆట 8వ నిమిషంలో దీప్ ఎక్కా గోల్‌తోభారత్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం 26వ నిమిషంలో నవనీత్ కౌర్ గోల్‌తో భారత ఆధిక్యం 2–0కు చేరింది.

స్కోరు 2–2తో సమం

మూడో క్వార్టర్‌లో భారత్ నాలుగు నిమిషాల తేడాలో రెండు గోల్స్ సమర్పించుకుంది. ప్రపంచ ఏడో ర్యాంకర్ స్పెయిన్ జట్టు తరపున 35వ నిమిషంలో లూసియా జెమినెజ్ 39వ నిమిషంలో క్లారా వైకార్ట్ ఒక్కో గోల్ చేసి స్కోరును 2–2తో సమం చేశారు. ఆ తర్వాత రెండు జట్లు మరో గోల్ చేసేందుకు యత్నించినా సఫలం కాలేకపోయాయి. తొలి మ్యాచ్లో భారత్ 2–3తో ఓడిపోగా... రెండో మ్యాచ్ 1–1తో 'డ్రా' అయ్యింది. మూడో మ్యాచ్‌లో భారత్ 5–2తో గెలిచిన విషయం తెలిసిందే.

ధోనీ వచ్చేశాడు..

- గెలుపే లక్ష్యంగా బరిలోకి రోహిత్ సేన
- చివరి వన్డేలోనూ విజయం మాదే అంటున్న కివీస్

కివీస్‌తో నేడే చివరి వన్డే

వెల్లింగ్టన్: చివరి వన్డే గెలుపుతో న్యూజిలాండ్‌లో వన్డే సీరీస్‌ను ముగించాలని భారత జట్టు చూస్తోంది. నాలుగో వన్డేలో ఘోరంగా విఫలమైనా చివరి వన్డేలో గెలిచి మళ్లీ విజయాల బాట పట్టాలని టీమిండియా భావిస్తోంది. నేడు న్యూజిలాండ్‌లో జరిగే చివరి వన్డేకు సీనియర్ ఆటగాడు ధోనీ కూడా పూర్తి ఫిట్నెస్‌తో బరిలోకి దిగుతున్నాడు. ధోని రాకతో జట్టులో ఆత్మస్థైర్యం వచ్చింది అంటున్నారు. నాలుగో వన్డేలో బౌన్సర్లకు , స్వింగ్ బంతులకు ఇబ్బంది పడిన భారత బ్యాట్స్‌మెన్ ఈ వన్డేలో వాటిని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యారు. నెట్స్‌లో కూడా భారత బ్యాట్స్‌మెన్స్ తీవ్రంగా శ్రమించారు. ఒపెనర్లు ధావన్, రోహిత్ శర్మల రాణింపుపై భారత జట్టు ఆధారపడుతోంది. ఈ జోడి కాని శుభారంభం ఇస్తే తర్వాత వచ్చే బ్యాట్స్‌మెన్స్ చెలరేగడానికి అవకాశం లభిస్తుంది. ధోనీ రాకతో టాప్‌ఆర్డర్ బలీయంగా కనిపిస్తోంది. రాయుడు రాణింపుపై ఆందోళనలో ఉంది టీం ఇండియా మేనేజ్‌మెంట్ . ప్రపంచ కప్ దగ్గర పడుతున్న నేపథ్యంలో నాలుగో స్థానంలో నిలదొక్కుకుంటున్నాడు అనుకుంటున్న తరుణంలో ఈ మధ్య అంబటి రాయుడు విఫలమవుతున్నాడు. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా రాణించి విమర్శకుల నోళ్లను మూయించడమే కాకుండా సెల



క్టర్లు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని రాయుడు చూస్తున్నాడు. ఈ మ్యాచ్‌లో దినేష్ కార్తీక్‌ను పక్కన పెట్టనుంది మేనేజ్‌మెంట్,బౌలింగ్‌లో భువీ, షమీ, బాగా రాణిస్తున్నారు. స్పిన్‌లో ఛాహల్, కుల్‌దీప్ యాదవ్ జోడీ మరోసారి చెలరేగితే మ్యాచ్ భారత్ వశం అయ్యే అవకాశం ఉంది. ఐదో వన్డేలో అన్ని విభాగాల్లో రాణించి గెలుపుతో సీరీస్‌ను ముగించాలని గట్టిపట్టుదలతో ఉంది టీమిండియా.



మరో విజయంపై కన్నేసిన న్యూజిలాండ్

స్వదేశంలో ఇప్పటికే సీరీస్‌ను కోల్పోయిన బ్లాక్ కాప్స్ జట్టు నాలుగో వన్డేలో భారత్ చెలరేగి ఘనవిజయం సాధించి పరువు నిలబెట్టుకుంది. ఇక వన్డే సీరీస్‌లో చివరిదైన 5వన్డేలో కూడా అదే ఫార్ములాతో భారత్‌ను కట్టడి చేయాలని కివీస్ చూస్తోంది. బౌలింగ్‌లో ట్రెంట్ బౌల్ట్ అద్భుతంగా రాణిస్తున్నాడు. మరోసారి అతనిపై నమ్మకం పెట్టుకుంది ఆ జట్టు, బ్యాటింగ్‌లో కేన్ విలియమ్సన్, రాస్ టేలర్‌లు రాణింపుపైన కూడా ఆశలు పెట్టుకుంది. ఈ మ్యాచ్‌ను గెలిచి స్వదేశంలో పరువు నిలబెట్టుకోవాలని చూస్తోంది న్యూజిలాండ్ జట్టు.





వన్డే ర్యాంకింగ్స్ విడుదల చేసిన ఐసీసీ

- నంబర్ 1లో స్మృతి మంధాన

దుబాయ్: మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత మహిళా క్రీడాకారిణి స్మృతి మంధాన అగ్రస్థానంలో నిలిచింది. సూపర్ ఫామ్‌లో ఉన్న మంధాన ఇప్పటికే వన్డే ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ 2018, ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు 2018లను సొంతం చేసుకుని ఒక క్యాలెండర్ ఇయర్‌లో రెండు ఐసీసీ అవార్డులను దక్కించుకున్న తొలి భారత మహిళా క్రికెటర్‌గా అరుదైన రికార్డును నెలకొల్పింది. నిలకడగా రాణిస్తున్న మంధాన తాజాగా ఐసీసీ విడుదల చేసిన ఇంటర్నేషనల్ వన్డే ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి 751 పాయింట్లతో మొదటిస్థానాన్ని కైవసం చేసుకుంది.ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో స్మృతి మంధాన అద్భుతమైన ఆటతీరుతో ఆతిథ్య జట్టుపై విజృంభించింది. దీంతో వన్డే ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి మొదటిస్థానాన్ని చేరుకుంది. న్యూజిలాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా మొదటి వన్డేలో 105, రెండో వన్డేలో 90 పరుగులు చేసి టీమిండియా మహిళల జట్టు సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించింది. టీమిండియా మరో మహిళా క్రికెటర్ మిథాలీరాజ్ 669 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. మరో బ్యాట్స్ ఉమెన్ జెమీమా రోడ్రిగ్జ్ తొలివన్డేలో 81 పరుగులు చేసి ఆకట్టుకుని తాజా ర్యాంకింగ్స్‌లో 64వ స్థానం నుంచి 61వ స్థానానికి చేరుకుంది. గత ఏడాది మార్చిలో అరంగ్రేట్రం చేసిన జెమీమా ఇప్పటికి కేవలం ఏడు వన్డేలు మాత్రమే ఆడింది. బౌలింగ్ విభాగంలో టీమిండియా స్పిన్నర్లు పూనమ్ యాదవ్, దీప్తి శర్మలు ఐదు స్థానాలు మెరుగు పరుచుకుని ఎనిమిది, తొమ్మిది స్థానాల్లో నిలిచారు. కివీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో పూనమ్ ఆరు వికెట్లు తీయగా, దీప్తిశర్మ నాలుగు వికెట్లు పడగొట్టింది. ఏక్తా బిస్త్ 13 స్థానాన్ని కైవసం చేసుకుంది. రెండో వన్డేలో మూడు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఝులన్ గోస్వామి ఈ జాబితాలో నాలుగో స్థానంలో నిలిచింది. టాప్5 మంది బౌలర్లలో నిలిచిన ఏకైక టీమిండియా బౌలర్ ఝులన్ ఒక్కటే కావడం విశేషం.

డేవిస్‌కప్‌లో భారత్ ఆశలు సజీవం



కోల్‌కత్తా: పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న, దివిజ్ శరణ్‌లు తమ సత్తా చాటి డేవిస్ కప్ క్వాలిఫయర్ మ్యాచ్‌లో గెలుపొందారు. ఇటలీకి చెందిన సైమన్ బోలెల్లి, మటెవో బెర్రెట్టిలపై గెలిచి డేవిస్ కప్‌లో ఆశలను సజీవంగా నిలిపారు. కోల్‌కత్తా సౌత్ క్లబ్‌లో శనివారం గంట 43 నిమిషాల పాటు హోరాహోరీగా జరిగిన నాలుగోగేమ్ సెకెండ్ సెట్‌లో 4–6, 6–3, 6–4 తేడాతో ఓడించారు. తొలిసెట్‌ను 4–6 తేడాతో కోల్పోయిన రోహన్ జోడీ రెండు, మూడో సెట్లలో పుంజుకుని విజయం సాధించారు. గతంలో బెర్రెట్టిని ఇటాలియన్ టాప్ సీడ్ ఫేబియో ఫోగినితో కలిసి సెయింట్ పీటర్స్ బర్గ్ ఓపెన్ టైటిల్‌ను గెలుపొందాడు. బోరెల్లి 2015 ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. మ్యాచ్ అనంతరం శరణ్ మాట్లాడుతూ ఈ మ్యాచ్‌లో మంచి సమన్వయంతో ఆడామని చెప్పారు. ఇండియా తరుపున మ్యాచ్ ఆడడం కొంత ఒత్తిడికి గురయ్యానని, రోహన్‌తో మ్యాచ్ ఆడడం వల్ల గ్రాస్‌కోర్టులో ఆటను బాగా ఎంజాయ్ చేశానని చెప్పాడు.

తొలి టీ20 వైజాగ్‌లో

ఆస్ట్రేలియా పర్యటనలో స్వల్ప మార్పులు

విజయక్రాంతి, హైదరాబాద్: న్యూజిలాండ్ పర్యటన తరువాత ఆస్ట్రేలియా జట్టు ఇండియాలో పర్యటించనున్న సంగతి తెలిసిందే. ఈ పర్యటనలో ఆస్ట్రేలియా జట్టు టీమిండియాతో రెండు టీ20లు, ఐదు వన్డేలు ఆడనుంది. అయితే టీ20 సిరీస్‌లో భాగంగా స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. తొలి టీ20 మ్యాచ్‌కు బెంగుళూరుకు బదులు వైజాగ్ ఆతిథ్యమివ్వనుంది. అయితే ఫిబ్రవరి 24న బెంగుళూరు వేదికగా తొలి టీ20, ఫిబ్రవరి 27న వైజాగ్ వేదికగా రెండో టీ 20 నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. కానీ ఫిబ్రవరి 24న బెంగళూరులో వాయుసేన ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. ఈ ఎగ్జిబిషన్‌కు ప్రధానిమోడీ బెంగుళూరు రానుండడంతో మ్యాచ్ నిర్వహణ కోసం చిన్నస్వామి స్టేడియానికి భద్రత కల్పించలేమని పోలీస్ కమిషనర్ తెలిపారు. దీంతో వేదికలను మార్చుకోవడానికి కర్ణాటక క్రికెట్ సంఘం ఆంధ్రప్రదేశ్ క్రికెట్ సంఘాన్ని కోరింది. దీంతో మ్యాచ్ వేదికలను పరస్పరం మార్చుకోవడానికి బీసీసీఐ కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఫిబ్రవరి 24 ఆదివారం కావడంతో తొలి టీ20కి స్టేడియం పూర్తిగా నిండిపోయే ఛాన్స్ ఉంది.



Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD-500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.